# అంతర్దర్శన ధ్యానములు

# అంతర్దర్శన ధ్యానములు

మాస్టర్ కె. పార్వతీకుమార్

ధనిష్ఠ పబ్లికేషన్స్

విశాఖపట్నం.

ప్రథమ ముద్రణ : 2004
ప్రతులు : 1,000

**అంతర్దర్శన**

అన్ని హక్కులు గ్రంథకర్తవి.

వెల : రూ॥ **100-00**

ప్రాప్తిస్థానము :
జగద్గురు మందిరము
(ది వరల్డ్ టీచర్ టెంపుల్)
'రాధామాధవమ్',
14-38-2, ముప్పిడి కోలనీ,
విశాఖపట్నం - 530 002.

ముద్రణ :
♒ ఎక్వేరియన్ ప్రింటింగ్ స్కూల్
విశాఖపట్నం - 530 016.
☏ 2747320, 2751329.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శృతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్చుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ",** డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపము లోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - *"జగద్గురు మందిరము"* గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## *సంకలనకర్త : మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్*

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియ వచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించుచున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచు చున్నారు.

శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలనకర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "*పరహితము పరమధర్మ*" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠా ఫౌండేషన్**

# ముందుమాట

ఇందలి 93 ధ్యానములు సాధకుని మనోస్వభావమును తీర్చిదిద్ది, జీవ చైతన్యమునకు అనుగుణముగను, దైవానుభూతికి చేరువుగను చేర్చుట కీయబడినవి.

ఈ ధ్యానములు మాస్టర్ ఇ.కె. గారికి, వారు అనుసరించుచున్న గురు పరంపర నుండి, వారి ననుసరించుచున్న వారి కీయబడినవి.

ఒక విధముగ చూచినచో, మాస్టర్ సి.వి.వి. గారు అందించిన సమస్త కోర్సుల సారాంశమే, మరల మాస్టర్ ఇ.కె. గారి ద్వారా, మాస్టరుగారు మరల అందించిరి.

ఈ ధ్యానములను ప్రతి దినము ఉదయము ప్రార్థనకు ముందు పఠించి, అవగాహన చేసుకొని, ధ్యానము యొక్క మూల భావముపై మనసున శోధన చేయుటకు వినియోగింపవలెను. అట్లు చేయుటలో నిమగ్నమైన సాధకుని మనో చేతనను మాస్టరుగారు సరిచేయుదురు.

నిర్ణయింపబడిన తేదీల ప్రకారము శ్రద్ధ, భక్తితో ధ్యానము సాగింపవలెను. ముందురోజు ధ్యానమును తొంగిచూచు కుతూహల ముండరాదు. ఒకే సమయమునకు (మనస్సు, దేహమును శుచి గావించి) ధ్యానింపవలెను.

ధ్యానము 15 నిమిషములు సాగును. ధ్యానమునందు కలుగు భావములు, చిత్రములు, సంకేతములు ఒక పుస్తకమునందు వ్రాయు చుండవలెను. క్రమశః కలుగు భావములు, దర్శించు చిత్రములు, సంకేతములు సాధకునికి అంతర్ముఖ బోధనలుగ ఏర్పడును. వాటిని

పాటించు యత్నము త్రికరణశుద్ధిగ చేయవలెను. దర్శనములు, బోధలు గ్రహించిన తేది, సమయముకూడ వ్రాసుకొనవలెను.

ఈ ప్రార్థనలు మార్చి 21, జూన్ 22, సెప్టెంబరు 23, డిసెంబరు 25 తేదీలలో ప్రారంభించి సంవత్సరము పాటు శ్రద్ధా భక్తులతో నిర్వర్తించకొన వలెను.

క్రమశిక్షణతో, స్వచ్ఛందముగ ఈ ధ్యానములు గావించిన వారికి మనోవికాసము తథ్యము. ఇది వాగ్దానము. గుర్తింపగలరు.

సాధకుడు సాధారణముగ బహిర్ముఖుడే. దేహేంద్రియములు, మనస్సుచేత ఎంత సాధన చేసినను, ప్రజ్ఞ బహిర్ముఖముగనే వర్తించును. నర్తించును. ఈ ధ్యానములు సాధకుని క్రమశః అంతర్ముఖుని చేయగలవు. తనయందలి విజ్ఞానము, ఆనందము పొరలను వికసింప చేయగలవు. ఆత్మానుభూతికి దారి చూపగలవు.

ఈ ధ్యానములను ఆంగ్లములో అందించుట వలన, ఆంగ్లము లోనే పఠించుట ఉత్తమము. కేవలము అవగాహన కొరకు తెనిగించుట జరిగినది. అది కూడ స్త్రీల కోరిక మేరకు జరిగినది. ఇది వారి పిలుపు. వారికే సమర్పణము.

- కె. పార్వతీకుమార్

# అంతర్దర్శన ధ్యానములు

ఇందు వివరింపబడిన ధ్యానములు మాస్టర్ ఇ.కె. గారికి అందింపబడిన విశిష్ట ధ్యానములు. ఈ ధ్యానములను వసంత నవరాత్రులలో గాని, శరన్నవరాత్రులలో గాని, ఉత్తరాయణ సంక్రమణ పుణ్య దినములలో గాని, దక్షిణాయన సంక్రమణ పుణ్య దినములలో గాని ప్రారంభించవలెను. సంవత్సర మంతయు శ్రద్ధా భక్తులతో నిర్వర్తించుకొనవలెను. ఏ రోజునకు కేటాయించిన ధ్యానము ఆ రోజుననే, ఉదయము ప్రార్థనకు ముందు శ్రద్ధతో మూడు సార్లు పఠింపవలెను. భావమును మనసులో నుంచుకొని మాస్టరు సి.వి.వి. ప్రార్థనను నిర్వర్తించుకొని ఈ ధ్యానమందలి భావముపై మనస్సును ప్రసరింప చేయవలెను. ఇట్లు చేయుట వలన ఈ క్రింది విధమగు ఫలితములు కలుగును.

1. లౌకికమైన విషయముల నుండి మనస్సు ఈ ధ్యానపరమైన భావములకు మరలును. అట్లు మనస్సు అలౌకిక విషయములపై ప్రసరించును.
2. ఈ ధ్యానము నందు తెలుపబడిన విషయములు సాధకునకు అంతర్బహిర్ముఖముల సూచనలు కలిగియున్నవి. కొన్ని బాహ్య ప్రపంచమున పాటించవలసి యుండును. మిగిలిన వన్నియు అంతర్ముఖమున అనుభూతి చెంద వలసినవియే.
3. అంతర్ముఖమున అనుభూతి చెందవలసిన ధ్యానములలో మానవుని యందుగల దివ్యప్రజ్ఞలు, దివ్య కేంద్రములు

వివరింపబడినవి. వానియందు మనసుంచినచో మనస్సు క్రమశః అంతరంగమున దివ్యానుభూతికై సంసిద్ధమగుటయే గాక పరిశుద్ధము కూడ కాగలదు. ఈ ధ్యానములందు మిక్కుటముగా అంతర్దర్శనములు సూచింపబడినవి. అందుచే ఇవి అంతర్దర్శన ధ్యానము'లని భావింపవచ్చును. విశిష్టమైన ధ్యానములని కూడ భావింపవచ్చును.

4. ఈ ధ్యానములు సాధకుని యందలి దివ్య ప్రజ్ఞలను మేల్కొల్పి త్వరితగతిని స్వభావమున విచిత్రమైన మార్పులను కొనితేగలదు. అది వీని ప్రత్యేకత.

5. ధ్యానములను ఆంగ్లముననే పఠింపవలెను. అందలి శబ్ద తరంగములలో ఒక చక్కని అమరిక ఏర్పరుపబడినది. అవి స్వభావమున వలసిన మార్పులను కలిగింపగల శక్తి కలిగినవి. త్వరితముగ కూడ మార్పులను కలిగింపగలవు.

6. ఈ ధ్యానములు సాధకుని మనస్సును వివిధ కేంద్రములలో వర్తింపచేయును. అవి మూలాధారము నుండి సహస్రారము వరకును కూడ అందింపబడినవి. ఉత్సుకతతో కూడిన సాధకుని మనస్సు ఈ కేంద్రములను మృదువుగ స్పృశించు టచే మనసు క్రమముగ దివ్యానుభూతికి చేరువగును. మనోమయ కోశమునుండి, విజ్ఞానమయ కోశములోనికి సాధకుని ప్రజ్ఞ మరలును. అట్లు మరలుటయే మనసంతర్గత మగుట లేక సాధకుని ప్రజ్ఞ మణిపూరక కేంద్రము నుండి అనాహతమునకు చేరుట.

7. ఈ ధ్యానములందు విశ్వ విజ్ఞానమునకు సంబంధించిన అనేకానేక దివ్య సంకేతములను సాధకుడు తన శరీరము నందు దర్శించుట ఒక ప్రత్యేకత. ఇందు జ్యోతిషమునకు సంబంధించిన సంకేతములు, గణిత శాస్త్రమునకు సంబంధించిన సంకేతములు యోగశాస్త్ర సంకేతములు, క్రతు విద్యకు సంబంధించిన సంకేతములు ఇట్లనేకములు కలవు. బీజప్రాయముగ విశ్వవిజ్ఞాన విద్యకు వలసిన సమస్త అధ్యయనమునకు కావలసిన పరిచయము చేయబడును. సాధకుడు ధ్యానముల ద్వారా జ్ఞానము బడయును.

"నా యోగమున సమస్త బోధన నీ లోతట్టున నుండి నే నందింతును." అని మాస్టర్ సి.వి.వి. చేసిన వాగ్దానము ఈ ధ్యానముల ద్వారా సత్యమగును. ఈ ధ్యానములు మాస్టర్ సి.వి.వి. అందించిన సమస్తమగు కోర్సుల సమన్వయము. ఇవి నిర్వర్తించుకొను వారికి ఏ కోర్సులతోను పనిలేదు. వీటిని పరమగురువు సి.వి.వి. గారే సూక్ష్మ కక్ష్యలో మాస్టర్ ఇ.కె. గారికి సరాసరి అందించిరి. వీని దర్శనములు జరిగిన మాస్టరు గారు బహుముఖ ప్రజ్ఞాశాలియై పరమగురువుల అనుగ్రహమును పొందిరి. దివ్య ప్రణాళికలో తనదైన స్థానమును పొందిరి. ఇంతకు మించి ఈ ధ్యానముల విశిష్టత తెలుప బనిలేదు.

ఈ ధ్యానములు బాగుగా జరుగవలెనన్నచో, ఈ అనుభూతి, ఆనందము, యోగమున అభివృద్ధి కలుగవలెనన్నచో ఈ

క్రింది సూత్రములను జీవితమున అవలంబించుట వాంఛ నీయము.

1. ధ్యానమున కలుగు భావములను, బోధనలను ధ్యానా నంతరము ఒక ప్రత్యేకమైన నోట్ బుక్ నందు వ్రాసుకొన వలెను. పుస్తకమునకు ఆరంజ్ రంగు అట్ట వేసుకొనవలెను. ఈ రంగు జిజ్ఞాసువులకు సహకరించునది. పుస్తకమందు కాగితములు రూళ్ళ కాగితములైనచో మంచిది. ఏ దినమున వచ్చు భావములు, బోధనలు ఆ దినముననే వ్రాసుకొన వలెను. అందలి విషయములను ఎవరికిని తెలుపరాదు. పుస్తక మెప్పుడును సాధకునితోనే యుండవలెను.

2. ధ్యాన మెప్పుడును ఒకే స్థలమున చేయవలెను. ఒకే సమయమునకు చేయవలెను. మార్పులేమైన యున్నచో ముందు రోజు భావపరముగ మాస్టరు గారికి తెలియ చేయవలెను. ప్రార్థనా సమయమునకు ఐదు నిమిషముల ముందే ఆసీనుడవై ఆ రోజు ధ్యానమును మూడు సార్లు పఠించవలెను. అటుపైన మాస్టర్ సి.వి.వి. ప్రార్థనలు చేయవలెను.

4. దైనందిన జీవితమున కార్యక్రమము లెన్ని యున్నను మనసు యందు వానిని గూర్చిన ఆత్రుత యుండరాదు.

5. సాధకునికి సంబంధించని విషయములలో, సన్నివేశములలో తల దూర్చరాదు.

6. మనసునందు వ్యర్థముగ ఇతరులను గూర్చిన భావములను నింపుకొనరాదు.

7. ఇతరులతో ప్రసంగించినపుడు సున్నితమైన పద్ధతిలో వారిని ఉల్లాస పరచుచుండవలెను.

8. పనులు చేయుచున్నప్పుడు కూడ ఇట్టి ఉల్లాసమే తోటి వారికి కలిగించుచు, తాను పొందుచు నుండవలెను. లేనిచో పనుల తీవ్రతలో శ్రమ, విసుగు, కోపము కలుగును.

9. దైనందిన కార్యక్రమముల యందు, ఏ విషయము నందును అతి పనికిరాదు.

10. భాషణ మెప్పుడును మితముగను, ఉల్లాసముగను యుండ వలెను.

11. ఇతరుల అభిప్రాయములను సానుభూతితో వినవలెను. వెను వెంటనే ఖండింపరాదు. మన అభిప్రాయములను సున్నిత ముగ తెలుపవచ్చును.

12. ఇతరులు దేని నుద్దేశించి, ఆశించి మాట్లాడుతున్నారో వినుటకు యత్నింపవలెను కాని, ఏమి మాట్లాడుచున్నారో విను నవసరము లేదు.

13. నీ కర్తవ్యములను నిర్వర్తించుటలో మొహమాటము కూడదు.

14. సద్గురువులను ఒకరితో నొకరిని పోల్చుట ఎన్నడును చేయవలదు. ఇతరుల తప్పులెన్నుటను క్రమముగ నీ నుండి నిర్మూలించుకొనుము.

15. అడగనిదే సలహాల నీయకుము. అడిగినచో నిచ్చుటకు సందేహింపకుము. తెలియని విషయములందు సలహాల నీయరాదు.

16. భోజనము సుష్టుగ స్వీకరించవలెను. ఆహారమున పోషకముల విషయమున శ్రద్ధ వహించవలెను. తీవ్రమగు వాసన వచ్చు మసాలా, వెల్లుల్లి పదార్థములు భోజనమున వాడరాదు.

17. రోజునకు ఒక్కసారి యైనను తల స్నానము చేయవలెను. ముఖము, చేతులు, పాదములు తరచు శుభ్రపరచుకొను చుండవలెను.

18. సామూహిక భోజనముల యందు అతి క్లుప్తముగ భుజించుట ఉత్తమము. ఇది కేవలము సంఘ మర్యాద కొరకే.

19. చిన్న పొన్న అస్వస్థతలకు తరచూ మందులు వాడరాదు. ఆహారము, నిద్ర, పనులయందు సున్నితమైన మార్పును గావించుచు స్వస్థతను పొందవచ్చును.

20. ఆవేశ కావేశములకు దూరముగ నుండుటకు ప్రయత్నింప వలెను.

21. కాలమును, శక్తిని, ధనమును వృథా చేయరాదు. సద్విని యోగము చేయవలెను. లోభము కూడదు అనగా ఒళ్ళు దాచుకొనుట, బద్ధకించుట, ధనము దాచుకొనుట చేయరాదు.

నీ వొనర్చు సద్వినియోగమే నీకు బలమై నిలచును.

22. నీ వద్దకు వచ్చి పోవు ధనమునకు జమా ఖర్చులు వ్రాసు కొనుట, యోగశిక్షణ యందు ముఖ్యమైన విషయము. ఇతరుల ధనమునకు సంపదకు బాధ్యత వహింపవలసి వచ్చినచో మరింత అప్రమత్తతతో జమా ఖర్చులను వ్రాయ వలెను. ముఖమున చిరునవ్వు కలిగి యుండుము. ఇది బాహ్య శుచి అంతశ్శుచి సాధించుట వలన ఏర్పడును. లేనిచో నీ చిరునవ్వు ఇతరులకు వికారము కలిగించును.

23. నిర్వర్తించలేని వాగ్దానములు చేయకుము. వాగ్దానము చేయుట కన్న వలసిన సహాయము చేయుట శ్రేష్ఠము.

24. నీ సాన్నిధ్యము ఇతరులకు యింపై యుండవలెను కాని ఇబ్బందికరముగ నుండరాదు. దీనిని గమనించుటకు ప్రత్యేక దృష్టి కావలయును.

# అంతర్దర్శన ధ్యానములు

## MEDITATION - 1

(MARCH 21, SEPT. 22, SEPT. 23)

Remember the Giver. He gave this frame. You are the Book. I AM the one copy in existence. I AM copied from the parent manuscript.

దాతను గుర్తుంచుకొనుము. ఈ రూపము అతను యిచ్చినదే. నీవతని పుస్తకము. "నేను" ఒకడనే వున్నాను. నేను మూలమునకు ప్రతీకను.



*వివరణము :*

ఈ సృష్టి అంతకును దాత ఒకడే. అతని నుండే ప్రకృతి, శక్తి, కాలము, దేశము, రూపము ఏర్పడు చున్నది. రూపము లన్నియు అతను యిచ్చినవే. ప్రతి జీవుడును అతని రచనయే. అందరియందు తానే యున్నాడు. అందరును అతని ప్రతీకలే. అనగా అతని ప్రతిబింబములే. నీ రూపము, నీయందలి ఇంద్రియములు, నీ మనస్సు, త్రిగుణములు, చేతన, ప్రాణము అన్నియు అతడేర్పరచినవే. అన్నియు అతనేర్పరచి అందతడే యుండగ, మనమున్నాము అనుకొనుచున్నాము.

## MEDITATION - 2

(March 22, Sept. 21, Sept. 24)

Bliss is in giving and not taking. Sun gives life. He is Man. Moon receives. She is Woman. Moon has phases of waxing and waning.

ఇచ్చుటలో గల ఆనందము పుచ్చుకొనుటలో లేదు. సూర్యుడు ఇచ్చువాడు. అతడు పురుషుడు. చంద్రుడు పుచ్చుకొనువాడు. ఆమె స్త్రీ. చంద్రునకు శుక్ల, కృష్ణ పక్షములు కలవు.



*వివరణము :*

ఈ ధ్యానమున సాధకులకు ప్రధాన సూత్ర మీయబడినది. సాధకుడు తనయందు దానము చేయు స్వభావమును కోరి పెంపొందించుకొనవలెను. ఇచ్చిన కొలది మనోస్థిరత్వము పెరుగును. పుచ్చుకొన్న కొలది స్థిరత్వము తగ్గును. పుచ్చుకొనుటలో గల ఆనందము తాత్కాలికము. ఇచ్చుటలో గల ఆనందము శాశ్వతము. ఇచ్చువాడు ఊర్ధ్వముగ పెరుగును. పుచ్చుకొనువాడు అధస్సునకు దిగజారును. మొదటిది ముక్తికి మార్గము. రెండవది బంధమునకు మార్గము.

పురుషుడు పుచ్చుకొనుట నేర్చినచో జన్మాంతరమున స్త్రీ అగును. స్త్రీలు యిచ్చుట నేర్చుకొని జన్మాంతరమున పురుషు లగుదురు. స్త్రీ పురుష దేహముల యందు జన్మించుటకు గల రహస్య మిదియే.

ఎప్పుడునూ పుచ్చుకొనుట మాత్రమే తెలిసినవారు, చంద్రునివలె వృద్ధి క్షయములు చెందుచు వుందురు. పురుషత్వము, స్త్రీత్వము దేహమునకు కాక స్వభావమునకు కూడ చెందినవని తెలియవలెను.

## MEDITATION - 3

(March 23, Sept. 20, Sept. 25)

Be a giver. Be a Sun, be a Man. Live in Spirit. Yet live in Soul. Live in Mind, yet live in person. Live in body, but be a Man. Live in the outer world, but be an inner consciousness.

దాతగ నుండుము. సూర్యునిగ వుండుము. పురుషునిగ వుండుము. జీవునిగ నున్నను, ప్రజ్ఞ యందుండుము. మనసు నందున్నను పురుషునిగ నుండుము. దేహ మందున్నను మానవుడిగ నుండుము. బాహ్య ప్రపంచమున నున్నను అంతః చేతనగనే నుండుము.



*వివరణము :*

జీవితము ధీరత్వముతో నిర్వర్తించుకొనుటకు ఈ సూత్ర మీయ బడినది. ఇచ్చువాడు ధీరుడు కాని, పుచ్చుకొనువాడు కాడు. సూర్యుడు ధీరుడు. అతడు సమస్తమును పోషించుచున్నాడు. పరమ పురుషుడు కూడ నట్లే. కావున పురుషత్వమునకు సార్ధకత, రక్షణము, పోషకత్వము, దానము నందున్నది. అందువలన జీవించినచో పురుషునివలె, సూర్యునివలె దాతగ జీవించమని సూత్రము. త్యాగము నొనర్చినవారు అమృతత్త్వ స్థితి చెందుదురు. పోషించినవారు ఉద్ధారణము చెందిరి. పరమ పురుషుని వలె సమస్త మును ఇతరుల కొఱకు వినియోగించినవారు భగవంతుని హృదయమున శాశ్వత స్థానము పొంది ప్రకాశించుచున్నారు.

కావున జీవుడిగ నున్నను ప్రజ్ఞామూర్తిగ నుండుమనియు, మనసు యందున్నను పురుషునివలె ప్రకాశింపుమని, దేహమందున్నను మానవునివలె ప్రవర్తింపవలెనని, ప్రపంచము నందున్నను చైతన్య మూర్తిగ భాసింపుమని సందేశము.

## MEDITATION - 4 :

(March 24, Sept. 19, Sept. 26)

Lead me through knowledge to bliss. Lead me through strength to service. Lead me through sympathy to realisation. Lead me through love to oneness.

జ్ఞానము ద్వారా శాశ్వత ఆనందము కలిగించుము. సామర్థ్యము ద్వారా జీవుల సేవలకు స్ఫూర్తి నొసగుము. కారుణ్యము ద్వారా వికాసము కలిగింపుము. ప్రేమ ద్వారా ఏకత్వమును దర్శింప జేయుము.



*వివరణము :*

జ్ఞానము కన్న పవిత్రమైన అంశము లేదని భగవద్గీత బోధించును. పవిత్రతను బట్టి ఆనంద ముండును. ఇది ఒక రహస్యము. ఆనందము ఐహిక విషయములను పొందుటలో లేదు. ఉన్నట్లు భ్రమకొలుపును. ఎండమావుల యందలి నీరువలె ఆశ పెట్టునే కాని ఆనందమట్లు దొరకదు. దైహిక ఆనందము కన్న ఇంద్రియ ఆనందము, దానికన్న మనస్సు పొందు ఆనందము, దానికన్న బుద్ధి పొందు ఆనందము, దానికన్న జీవుడు పొందు ఆనందము వందరెట్లు ఎక్కువ అని ఉపనిషత్తులు ఘోషించు చున్నవి. జ్ఞానము వలన తాను దైవమేనని, దైవమునకు ప్రతిరూప మనియు తెలియును. అట్లు తెలియుటకన్న మించిన ఆనందము లేదు. అది శాశ్వత ఆనందము. యోగీశ్వరులు, సిద్ధులు దీనిని శాశ్వతముగ అనుభూతి చెందుదురు. కాలము, దేశము, సన్నివేశము వారి ఆనంద మునకు అవరోధము కలిగింపలేదు. దైహిక ఇంద్రియ మనోబుద్ధులను పవిత్ర మొనర్చుకొనుచు, జ్ఞానమును పొందుట సాధ్యము. అపవిత్రునకు జ్ఞాన మబ్బదు. జ్ఞానిని అపవిత్రత అంటదు. అందుచే పవిత్రత ఆధారముగ జ్ఞానమును పొందుచు ఆనందమును పొందవలెను.

సమర్థత లేనివారు సేవ చేయలేరు. సేవ చేయు స్ఫూర్తి కలవారు సమర్థతను పెంచుకొనవలెను. సామర్థ్యము పెరిగిన కొద్దీ స్వార్థము పెరుగుట కవకాశము కలదు. దానిని జ్ఞానముతో నిర్మూ లించుకొనవలెను. లోకరక్షణకై దిగివచ్చిన శ్రీరాముడు వశిష్ఠ, విశ్వామిత్ర, అగస్త్యాది ఋషుల అనుగ్రహమును పొందుచు,

సామర్థ్యము పెంచుకొని లోక రక్షకు డయ్యెను. సమర్థత సద్వినియోగ మగుటకు జ్ఞాన మావశ్యకము. అందువలన ప్రార్థన యందు జ్ఞానము గూర్చి తెలిపిన తర్వాత సామర్థ్యమును గూర్చి తెలుపుట జరుగు చున్నది. జ్ఞానము లేక పొందిన సామర్థ్యము రావణుని సామర్థ్యమువలె వికటించును. అర్జునుని జీవితము కూడ జ్ఞానము, సామర్థ్యము క్రమశః పెంచుకొనిన సత్సాధకుని జీవితమువలె గోచరించును. కర్ణుని జీవితము అట్లు గోచరింపదు. అందువలన లోకహిత కార్యముల నొనర్చు స్ఫూర్తి కలవారు జ్ఞానమును పెద్దల వద్ద పొందుచు, సామర్థ్యమును పెంచుకొనవలెనే కాని ఎట్టి పరిస్థితియందు గర్వింపరాదు.

జ్ఞానము కలిగినవారికే సత్యమైన సేవా సామర్థ్యముండును. సత్యము, స్వచ్ఛము అగు సేవ సేవకుని హృదయమును మార్దవము చేయును. అట్లు కరిగిన హృదయమే ఎదుటివారి కష్టములను అవగాహన చేసికొనును. అది హృదయ వికాసమునకు దారితీయును. అట్టి వికాసము అనన్యభక్తిని ఏర్పరచి ఆత్మానుభూతికి దారితీయును.

ఆత్మానుభూతి కలిగిన వారినుండి ప్రేమ ప్రవహించును. ప్రేమ ద్వారా ఆత్మానుభూతి, ఆత్మానుభూతి ద్వారా ప్రేమ పొందబడు చుండును.

*గమనిక :* ఈ కాలమున ప్రేమ కేవలము సిద్ధాంతముగ నుండుటకు, మత ఘర్షణలకు దారితీయుటకు కారణమిక్కడ గోచరించును. ఏకత్వము అనుభూతి చెందనిదే, ప్రేమ ప్రవహించదు. ప్రేమ, ప్రేమ అని కేకలు వేసినను ప్రేమించుట కుదరదు. జ్ఞానముతో కూడిన సేవ జీవితమున ఆచరించనిదే ప్రేమ భాసించదు.

## MEDITATION - 5

(March 25, Sept. 18, Sept. 27)

Night is my mother. Day is my father. Twilight is my Guru. Life is my friend. Death is my bedroom.

రాత్రి నా తల్లి. పగలు నా తండ్రి. సంధ్య నా గురువు. జీవితము నా మిత్రుడు. పడకగది నా మృత్యువు.



*వివరణము :*

రాత్రియందలి చీకటి వెలుగునకు ముసుగు మాత్రమే. ముసుగునకు ఆవల వెలుగే యున్నది. మాయ తొలగినచో చీకటి తొలగును. ఇహలోక రక్షణమునకు మాయ అవసరము. లేనిచో వ్యవహారములు జరుగవు. సృష్టి మాయ ఆధారముగనే జరుగుచున్నది. మాయ లేనిదే పేరు లేదు. రూపము లేదు. కుటుంబము లేదు. లోక వ్యాపారములు లేవు. లోకములే లేవు. లోకపాలకులు, దేవతలు కూడ లేరు. ఇవి అన్నియు మాయవలన ఏర్పడుచున్నవి. మాయ కవతలివాడు మాయద్వారా వీటన్నిటిగా ఏర్పడుచున్నాడు. మాయ గుర్తుండుట అదృష్టము. తల్లి గుర్తుండుట అదృష్టము. తల్లిని మరచినవాడు మాయని మరచును. మరచుట వలన అజ్ఞానమను చీకటి ఏర్పడును. అటుపై కథ అందరికిని తెలుసును.

మాయ అను తెర తొలగినచో వెలుగు అను దైవము లేక తండ్రి గోచరించును. ఆ వెలుగు కనులు కూడ చూడలేనంత వెలుగు. దానిని చూచుటకు జ్ఞానము, సేవ, భక్తి, యోగము, వైరాగ్యము, తపస్సు అవసరము. వీనివలన సమస్త సృష్టియు ఒకే వెలుగు లోని అంశములని తెలియుము. అది సర్వవ్యాపకమైనది. నామములకు, రూపములకు, మతములకు, సిద్ధాంతములకు అతీతమైనది. సమస్త సృష్టికిని తండ్రివంటిది.

మాయ నుండి వెలుగునకు చేరుటకు మార్గము అవసరము.

మార్గమును బోధించు వారవసరము. మార్గమును బోధించుచు, మార్గము నేర్పరచుచు, మార్గముగా నిలుచువాడు గురువు. అతడే సంధ్య. పై కారణమున గురు ప్రార్థనము సంధ్యలయందే తప్పక జరుగవలెనని తెలియుచున్నది. చీకటి నుండి వెలుగుకు, వెలుగు నుండి చీకటికి చేర్చునది సంధ్య. సంధ్యా మార్గము అమృతత్వ, మృతత్వ మార్గము. దీనిని తెలియకోరు వారు సంధ్యలను దీక్షగ ఉపాసించవలెను. సంధ్యావందన క్రతువునందు ప్రధానముగ ఈ రహస్యము ఇమిడి యున్నది.

జీవించుట మన సొత్తు కాదు. ప్రాణము వలన జీవనము కలుగుచున్నది. ప్రాణి యన్నను జీవి అన్నను ఒకటియే. ప్రాణము నిలచినచో జీవ వ్యాపారము నిలచును. ప్రాణము ఆధారముగనే సమస్త కార్యములు నిర్వర్తింపబడుచున్నవి. కావున ప్రాణమే స్నేహితుడు. ఇతర ప్రాణస్నేహితులు ప్రాణము తరువాతి వారే. ప్రాణమునే ప్రాణ స్నేహితుడుగ గుర్తించుము. ప్రాణమున కపకారము కలుగు ఏ మనోవ్యాపారము, ఇంద్రియ వ్యాపారము, దైహిక వ్యాపారము చేయకుము. ప్రాణమను స్నేహితుడు ఆగినచో నీ సమస్త వ్యాపారములు ఆగును. కావును ప్రాణోపాసనము నిత్యము జరుగుచు నుండవలెను.

నిద్ర కుత్సహించువాడు తమోప్రధానుడు. తమస్సు సమస్తమును హరించును. ప్రాణమును కూడ హరించును.

సోమరితనపు చేటు ఇంత అంత అని చెప్పలేము. సోమరి జీవితమున ఏమియును సాధింపలేడు. ఏ ఆనందమును పొందలేడు. వానికి కర్తవ్యమే భారము. సద్విషయముల యందు విముఖత వుండును. సత్పురుషుల యందు ద్వేషముండును. సత్కార్యములన్న కోప ముండును. శరీరము, యింద్రియములు, మనస్సు మలినముతో కప్పబడి, మలిన విషయములందు ఆసక్తి యుండును. ఇతడు మృతునితో సమానము. ఇతడు మొదటగ నేర్వవలసినది నిద్రను నియమించుట. లేనిచో అతడు మృతుడే.

## MEDITATION - 6

(March 26, Sept. 17, Sept. 28)

Virtue, not intelligence, is my goal. Ability, not fame, is my motto. Expression, not impression, is my work. Depth, not height, is my position.

నా గమ్యము సద్గుణములు, తెలివి తేటలు కాదు. నా ఆశయము సమర్ధత, కీర్తి కాదు. వెలిబుచ్చుట నా పని, నమ్మించుట కాదు. లోతులో నా ఉనికి, ఎత్తుపైన కాదు.



*వివరణము :*

ఇది సాధకునకు ముఖ్యమైన సూత్రము. కొందరు తెలివి తేటలను నమ్మెదురు. కొందరు సద్గుణములను నమ్మెదురు. శకుని తెలివిని నమ్మెను. ధర్మరాజు సద్గుణములను నమ్మెను. రావణుడు తెలివిని నమ్మెను. రాముడు సద్గుణములను నమ్మెను. హిరణ్య కశిపుడు చావు లేకుండుటకు తెలివిగ వరములను కోరెను. ప్రహ్లాదుడు శ్రమలేకయే చావును జయించెను. తెలివితేటలను నమ్మినవారికి తిప్పలు తప్పవు. సద్గుణములను నమ్మినవారికి ఆత్మ స్థైర్యముండును.

కీర్తి కోసము పాకులాడుట అవివేకము. నిజమైన సమర్థత కలిగినవారిని కీర్తి నీడవలె అనుసరించును. సమర్థత పెంచుచు ముందుకు సాగుటయే జీవితాశయము కావలెను. అర్జునుడు గురుదక్షిణ చెల్లించి గురుప్రశంసను పొందినను సమర్థతను పెంచు కొనుచునే సాగినాడు. సద్గుణోపాసనము, సమర్థత అర్జునునికి ఎనలేని కీర్తిని సంపాదించినవి. గర్వపడక, పొందిన సమర్థతకు తృప్తి పడక దానిని సతతము పెంపొందిచుకొనుట "విజయము" అను సద్గుణము నేర్పరచును. అర్జునుడు విజయుడగుటకు కారణ మిదియే.

జ్ఞానమును - విజ్ఞానమును, యోగమును - శాస్త్రమును, మంచిని - చెడును వివరించుటయేకాని, ఎదుటివానిని నమ్మించు ప్రయత్నము అజ్ఞానము. మన విశ్వాసములు, నమ్మకములు ఇతరులపై రుద్దుట పాశవికము. పశుప్రవృత్తి కలవారు మాత్రమే యిట్టి పనులు చేయుదురు. ఇది అహంకారమునకు, అజ్ఞానము నకు చిహ్నము. ఆస్తికులైనను, నాస్తికులైనను, కమ్యూనిస్టులైనను,

కాపిటలిస్టులైనను, సోషలిష్టులైనను వారి నమ్మకము యితరులపై రుద్దుట మానవుని పశుత్వమునకు చిహ్నము. రజోగుణ దోషము వలన ఇట్లు జరుగుచుండును. ప్రస్తుతమున క్రైస్తవమునకు, ఇస్లాము నకు ఈ దోషము అధికముగ నున్నది. ఏ సిద్ధాంతమైనను వివరించి జీవుల నిర్ణయములకు వదలవలెనేకాని నొక్కిచెప్పుట, బలవంతము చేయుట, బల్లగుద్ది చెప్పుట కుసంస్కారము.

సంఘమున ఇతరుల గుర్తింపుకై పాటుపడుట ఒక వ్యామోహము. ఈ వ్యామోహము మనిషిని పతనము గావించును. తా నందరికన్న గొప్పవాడు అనిపించుకొన వలెనను కుతి, తీరని దాహము వంటిది. సంఘము గుర్తింపు నీటిపై రాతవంటిది. అది క్షణికము. దానిని నమ్మినవారు మూర్ఖులు. అంతకన్న అంతఃకరణ శరీరమున గుట్టుగ జీవించుచు, జీవులకు హితము చేయుచు జీవించుట చాలా ఉత్తమము. లోపల జీవించు సాధకుడు లోతులలో నుండి దీర్ఘకాలిక ప్రణాళికలను నిర్వర్తించగలడు. వెలుపల జీవించు సాధకుడు ఎంగిలాకువలె గాలివాటపు జీవనము జీవించుచు చాల పైకెగిరి అశుద్ధమున పడును.

ఈ సూత్రమున మానవులకు సామాన్యముగ నుండు వ్యామోహములు విపులముగ విశదీకరించిరి.

## MEDITATION - 7

(March 27, Sept. 16, Sept. 29)

The deeper the lake is, the farther skies peep into it through reflection with solar and lunar eyes. The higher the cliff is, the less the fellow beings are visible and more vehement the fall is of the tide. I live in depth and not height.

సరస్సు లోతు కొలది, సూర్య చంద్రాత్మక ప్రజ్ఞ దూరాకాశము నుండి స్పష్టముగ ప్రతిబింబించ కలదు. శిఖరము ఎత్తుకొలది తోటి జీవులు దూరమగు చుందురు. ఎత్తున వున్నచో పడుట కవకాశమున్నది. ప్రాణాపాయము కూడాను. దీని ఎత్తులలో కాక లోతులలో నుందును.

*వివరణము :*

సంఘమున అందరికన్న మిన్నగను, ఎక్కువగను వుండవలె ననుకొనుట తెలియనితనము. కొండ ఎక్కినకొలది నేలమీది జీవులు చిన్నవారిగ కనిపించుదురు. శిఖరాగ్రము చేరు సరికి మానవులు చీమలు, దోమలు వలె గోచరింతురు. ఈ పెరుగుదల అహంకారపు పెరుగుదల. అది కారణముగ తోటి జీవులయందు సానుభూతి యుండదు. ఇట్టి అహంకారము శిఖరాగ్రము చేరినపుడు పతనము తప్పదు. ఎత్తునుండి పడుటవలన అపాయకరమగు దెబ్బలు తగులును. గుణములేక సంఘమున పెరుగువారందరు యిట్టి అపాయములకు లోనగుచుందురు. పండితులు సహితము సమభావము లేక పతనము చెందిన సంఘటన లెన్నియో కలవు. ఈ దారి ముళ్ళదారి.

చిన్నతనము నుండి గుణములను పెంచుకొనుచు కర్తవ్యము నందు మాత్రమే ఆసక్తి కలిగి తోటి జీవులకు సహకరించుచు జీవించు వానికి లోతులు పెరుగును. మనిషిలో లోతు పెరిగినకొలది శాంత మెక్కువగ నుండును. సరస్సులు కూడ లోతుగ నున్నకొలది నిశ్చలముగ నుండును. భూగోళమున మిక్కిలి లోతుగల సముద్రమును శాంత మహాసముద్రము అని యిందులకే పిలుతురు. మనిషికి లోతులు పెరిగిన కొద్దీ శాంత గంభీరత్వము పెరుగును. నిశ్చలత పెరుగును. ఆటుపోట్లు కలత కలిగించవు. అట్టి జీవుని అంతశ్చేతనలో సూర్యచంద్రాత్మకమగు ప్రజ్ఞలు స్పష్టముగ గోచరించగలవు. అందుచేత హెచ్చులకు పోక జీవనపు లోతులలో నుండుట ముఖ్యమని ఈ సూత్రము బోధించుచున్నది.

## MEDITATION - 8

(March 28, Sept. 15, Sept. 30, March, 20)

Do not listen to what the world says. Listen to what it needs. Listen to its heart, not its tongue. Its tongue confuses you. Its heart shows you the way and trumpets the gospel.

లోకము ఏమి చెప్పుచున్నదో వినుటకన్న, లోకమునకు ఏమి కావలయునో వినుము. దాని హృదయమును వినుము. నాలుకను కాదు. నాలుక తికమక పెట్టును. హృదయము సూటిగ తెలుపును. హృదయమందు సత్యస్పందన యుండును.



*వివరణము :*

ప్రపంచమున మాటలు నేర్చినవాడు మనిషి. మాటను పలుకుటలో సత్యము పలుకుట, అసత్యము పలుకుట నుండును. సత్యా అసత్యముల మిశ్రమ భాషణ ముండును. అట్టి భాషణమే తికమక పెట్టును. ఎదుటివారిని తికమక పెట్టి తమ పనులను సిద్ధింప చేసుకొను స్వార్థపరులు కలియుగమున ఎక్కువగ నుందురు. తికమక పెట్టుటయే తెలివిగ జీవించుచు మనస్పర్థలు, కలహములు, విరోధములు ఏర్పరచుచు కార్యసిద్ధి కావించు కొను చుందురు. వాక్కు నందు అసత్యము ఈ కాలమున పరిపాటి. సత్య భాషణము చేయు వారు అరుదు. ఎవరు ఏమి మాట్లాడినను మాటలు వెనుకవారికి వలసిన దేదియో వుండును. చల్లకు వచ్చి ముంత దాచినట్లు ప్రవర్తించు లౌకిక జనులు చెప్పు విషయము నందు మనస్సు పెట్టినచో దారితప్పుట, అధోగతి పాలగుట జరుగును. అందుచేత వారి డొంకతిరుగుడు మాటలు వెనుక వారికి ఏమి కావలయునో తెలిసి, అది నిర్వర్తించ కలిగిన దగుచో మరియు నిర్వర్తింప తగిన దగుచో నిర్వర్తించమని నిర్దేశము.

హృదయ మెప్పుడును జీవులకు వలసినది ప్రతిధ్వనించు చుండును. నాలుక లౌక్యమును ప్రదర్శించు చుండును. నాలుకను వినుట లోతులేని ప్రక్రియ. హృదయమును వినుట లోతైన ప్రక్రియ. ఇది అభ్యసించవలె ననినచో మాటాడుట కన్న వినుటను ముందు అభ్యాసము చేయవలెను. మౌనమును అభ్యాసము చేయవలెను. వ్యర్థ ప్రసంగములను కట్టిపెట్టవలెను. ఇతరుల దోషము లెన్నుట తగ్గించు కొనవలెను.

భాషించుట, వినుట వాఙ్మయ తపస్సునకు సంబంధించినవి. ఈ తపస్సు చేయనివారికి కలవరము, కల్లోలము తప్పదు.

## MEDITATION - 9

(March, 29, Sept. 14, Oct. 1, March, 19)

You remain an eternal secret. You are not showy. You shine forth for ever. You cannot contain your own joy.

నీవు ఒక శాశ్వత రహస్యము. నిన్ను నీవు ప్రదర్శించుకొనవు. కాని శాశ్వతముగ ప్రకాశింతువు. నీ ఆనందము ఉబికి, పొంగి సర్వమును వ్యాపించును.



*వివరణము :*

దైవ మెప్పుడును అవ్యక్తమే, అది తెలియపడుట సాధ్యము కాదు. తెలియుట జరిగినప్పుడు అదియే యుండును కాని తెలుసు కొనువాడుండడు. వ్యక్తి అవ్యక్తములో లయమగుటచే వ్యక్తము చేయుట కొకడుండడు. అట్టి అవ్యక్తమగు తత్త్వము సర్వము నందును ప్రకాశించుచుండును. గుణముల యందు భాసించును. కాని గుణములచే పట్టుపడదు. అహంకారము, బుద్ధి, చిత్తము లందు ప్రకాశించుచునే యుండును కాని వానిచే పట్టుబడదు. దశేంద్రియముల యందు వర్తించును కాని అందు ఇమిడి యుండదు. దైవమను తత్త్వము ఆధారముగ సమస్తమును ప్రకాశిం చును. ప్రాణము, చేతన, కదలిక, సృష్టి నిర్వహణము, సమస్తముల కదియే ఆధారమై యున్నను తానుగ వ్యక్తము కాక పై తెలిపిన అంశములుగ వ్యక్తమగుచుండును. అందువలన అది అవ్యక్తము, కాని సర్వప్రకాశము. ఈ దివ్య తత్త్వము యొక్క ఆనందమునకు అవధులు లేకపోవుట వలన తా నాధారముగ విశ్వమేర్పడి అందు తాను వ్యాపించి ఆనందించు చున్నది.

జ్ఞాని యొక్క స్థితి కూడ ఇదియే. అతడు రహస్య జీవనుడు. తాను జ్ఞాని యని తెలియనీయడు. అందరియందు ఒకడుగ నుండును. తనను తాను ప్రదర్శించుకొనడు. పొగడుకొనడు. తనను గూర్చి మాటాడడు (తత్త్వమే తానుగ నుండుట వలన). అతడు స్వయం ప్రకాశకుడు. అతని ఉనికియే పరిసర జీవులకు ఆనందము కలిగించు చుండును. వేదనలను హరించుచుండును. శాంతి

ప్రసరించుచుండును. అతని యందు తెలియని ఆకర్షణ మొకటి పరిసర జీవుల నాకర్షించు చుండును. అతని దర్శనము స్పర్శనము, అతనితో సంభాషణము జీవులు కోరుట సహజము. అతడందరి యందును తానై యుండును. తా నొకడే సమస్తముగ వ్యాపించి భాసించి యుండును.

‘‘జ్ఞాని యనగా నేనే’’ అని భగవద్గీత యందు పరమాత్మ తెలిపియున్నాడు.

## MEDITATION - 10

(March 30, Sept. 13, Oct. 2, March 18)

Your joy is unconditioned. Your bliss is my guiding star. I am painted and shaped by your own ray.

నీ ఆనందము అపరిమితమైనది. అది సమస్తమైన తృప్తిని, శాంతిని ప్రసాదించగలదు. అదియే నా జీవితమునకు చుక్కాని. నేను నీ వర్ణము. నీ కిరణము చేతనే రూపొందింపబడితిని.



*వివరణము :*

భగవంతుడి నుండియే ప్రకృతి, శక్తి, కాలము ఏర్పడినవి. అది అతని సంకల్పము. వాని నుండియే త్రిగుణములు, పంచ భూతములు ఏర్పడినవి. అష్ట ప్రకృతు లాధారముగ సమస్త సృష్టి ఏర్పడినది. దేవతలు, దానవులు, మానవులు, ఇతర భూతగణములు, గ్రహగోళములు ఏర్పడినవి. ఇందేవియు భగవంతుడు కానిది లేదు. అంతయు ఆనందము కొరకే సంకల్పముగ దిగివచ్చినది. అందేర్ప డినవారు కూడ అట్టి ఆనందము పొందవలెనని ఈ సంకల్పము యొక్క ఆశయము. అందరును అతని తత్త్వమును పుణికిపుచ్చు కున్న వారే. అందరి రూపములు అతని రూపమే. అందరును అతని వెలుగు నుండి ప్రసరించు సప్త కిరణముల ద్వారమున మలచబడిన వారే. కావున జీవరాసుల రూపములు అతని నుండియే చిత్రీకరింప బడినవి. అందతడే సప్త కిరణములతో వెలుగొందుచున్నాడు. అతడి సంతానమగు జీవుడుకూడ అతని వలెనే పరమానందము పొందు టకు అవరోధ మేల యుండవలెను. అందువలన జీవుడు తన నిజస్థితి నెరిగి ఆనందముగ నుండుట ఈ ధ్యానము సూచించు చున్నది. దైవముయొక్క ఆనంద స్వరూపమే తన జీవితమునకు ధృవతార యని, చుక్కాని యని యెఱిగి ఆనందముగ నుండుటకే ప్రయత్నించవలెను. ఆనందము హృదయస్థమై యున్నది. ఆనంద స్వరూపుని ఆరాధన ద్వారా అవి ఉప్పొంగి సమస్త నాడులయందు ప్రవహించి జీవుని ఆనందమయునిగ చేయగలదు. నందనందనుడు ఆనంద జీవనమును నిర్వర్తించి చూపినాడు. అతడే పరమానంద స్వరూపుడు. అతడిని ప్రమాణముగ నుంచుకొని జీవింప గలిగినచో జీవుడు కూడ అమితానందమున జీవించగలడు.

## MEDITATION - 11

(March 31, Sept. 12, Oct. 3, March 17)

I AM the lake and you are the Sun. The drops of water you take from my tiny frame take their seat on the ever shining throne of your bosom. They are showered again into the sacred bosom of the Great Ocean.

నేను ఒక సరస్సును. నీవు సూర్యుడవు. నా నుండి కిరణరూపమున నీవు గొను నీటి బిందువులు నీ దేదీప్యమానమగు హృదయమున నిక్షిప్తము కాగలదు. మరల నీ హృదయము నుండి అవి మహా సముద్ర హృదయమున చేరగలవు.

*వివరణము :*

నీటి బిందువులు గ్రీష్మఋతువులో సూర్య కిరణముల ద్వారా ఆకాశమును చేరుట, ఆకాశము నుండి మరల వర్షఋతువు ద్వారా భూమిని చేరుట సంవత్సరచక్రమున జరుగుచునే యున్నది. రక రకముల నీటిని సూర్యకిరణము భూమి నుండి గైకొని పరిశుద్ధి గావించి నిర్మలమగు నీటిని మరల తిరిగి భూమికి అందించుట ఇందలి విశేషము.

జీవుడు వ్యక్తిగత జీవనుడు. తన కొరకై తాను జీవించువాడు. ఇతరులతో ఎట్టి సమన్వయము లేని వాడు. సమన్వయము పూర్ణ చైతన్య స్థితియందే లభించగలదు. అంతవరకును పరిమిత భావములే కలిగి జీవించుచుండును. అపరిమితడు కాదు. సరస్సునకు పరిమితి కలదు. పరిధి కలదు. ప్రవహించ లేదు. కట్టుబడి అక్కడనే యుండును. జీవుని స్థితి కూడ నిదియే. అట్టి పరిమితత్త్వము నుండి అపరిమితత్త్వములోకి ప్రవేశించుటకు మార్గమీ ధ్యానమున సూచింపబడినది.

పరిమితుడగు జీవుడు తపో మార్గమున ఊర్ధ్వగతి చెంద గలడు. తపనే తపస్సు. దైవమును గూర్చిన తపన దేహమున తాపము కలిగించగలదు. సరిగా ధ్యానించువారికి, పూజించువారికి, ఆరాధించువారికి దేహమునందు వేడి పుట్టుట సహజము. ఇట్టి తపన (తపస్సు) ఆధారముగ జీవు నుద్ధరించుటకై దైవకిరణము

సుషుమ్న మార్గము ద్వారా దిగివచ్చి జీవుని ఊర్ధ్వలోకమునకు గొనిపోగలదు. దీనినే విష్ణు సహస్ర నామమున "వృషాకపి" అని ఋషులు ప్రశంసించినారు. దైవము దిగివచ్చి, తపన చెందువారిని అందుకొని తన హృదయమున నిలుపుకొనును. అదియే సరస్సు నందలి నీటిబిందువులు సూర్యహృదయము చేరుట.

అటుపైన పూర్ణానందభరితుడైన జీవుడు దైవ తత్త్వమును, దైవ రూపమును పొంది దైవ సంకల్పముగ భూమికి దిగివచ్చును. అతడపుడు అపరిమితుడు అని తెలుపుటకే వర్షపు బిందువులు సముద్రమును పడుటగా సంకేతింపబడినది. పరిమితమగు వ్యక్తిగత సంకల్పములు కలిగి బంధము ననుభవించుచున్న జీవునకు ఈ మార్గము ద్వారా దివ్యత్వము చెంది, అపరిమితమగు దివ్య సంకల్పుడై దిగివచ్చి, దివ్య ప్రణాళికను నిర్వర్తించుట సూచింపబడినది.

ఈ ధ్యానమున తపస్సు, స్వాధ్యాయము ప్రధానాంశములుగ హెచ్చరింపబడినవి.

## MEDITATION - 12

(April 1, Sept. 11, Oct. 4, March 16)

These are from Higher Circles. These are from whom I follow to those who follow me.

ఈ ధ్యానములు ఊర్ధ్వలోకము నుండి అందింపబడినవి. ఇది నే ననుసరించు వారి నుండి నన్ను అనుసరించు వారి కొఱకు అందింపబడినవి.

*వివరణము :*

ఈ ధ్యానము గురు పరంపర సంప్రదాయమును స్పష్టము చేయుచున్నది. శిష్యుడు గురువై తన వద్ద చేరిన శిష్యులకు బోధించు విధానమిది. తాను సద్గురువు దగ్గర నేర్చిన విద్య, తదనుష్ఠానము, అనుభూతి వికాసములను తన వెంట నడుచువారి కందించుట. ఇట్లు గురు పరంపరాగత జ్ఞానము జీవుల కందించబడు చున్నది. కలియుగమున భరత భూమియందే ఈ సంప్రదాయ మింకను పటిష్ఠముగ నున్నది. గురువును మరచిన శిష్యునకు పురోగతి లేదు. గురువును గూర్చి అమితముగ భాషించు శిష్యుడు కూడ పురోగతి చెందక వాచాలత్వమున పడును. గురువును, గురు బోధలను హృదయమున పదిల పరచుకొని గురు వందించిన నియమములను పాటించుచు జీవించు వాని నుండి గురువు ప్రకాశింప గలడు. గురుభక్తి పతిభక్తి వంటిది.

## MEDITATION - 13

(April 2, Sept. 10, Oct. 5, March 15)

Life is a pin-point of the Eternal Truth. Generalise the particular fragments in life. Get the equation between the general and the particular.

శాశ్వత సత్యమందు జీవితమొక బిందువు. జీవితమందలి వివిధ (భిన్న) విషయములను, అంశములను సమన్వయ పరచుకొనుము. ఏకత్వమునకు భిన్నత్వమునకు గల సంబంధంము నెఱిగి జీవించుము.



*వివరణము :*

ఏకత్వమున భిన్నత్వము, భిన్నత్వమున ఏకత్వము దర్శించుటయే సమన్వయము. సమన్వయ మనగా వివిధ అంశములను చక్కగా అన్వయించుకొని అవగాహనతో జీవించుట. అన్వయించుకొనుటకు శ్రద్ధ అవసరము. అట్టి శ్రద్ధతో వివిధ అంశములను పరిశీలనము గావించవలెను. అట్లు పరిశీలించినపుడు తటస్థ బుద్ధి వుండవలెను. ఇట్లు శ్రద్ధ, పరిశీలనాశక్తి, తటస్థ బుద్ధి కలిగి పరస్పర విరుద్ధ అంశములను విశదీకరించుకొన్నచో సమన్వయాత్మకమగు సత్యము గోచరించును.

పై విధముగ అన్వయించుకొనలేనివారే జీవితమున ఘర్షణ చెందుచుందురు. వారికి గల అభిప్రాయములే సత్యములని భావించు చుందురు. సత్యమునందు వివిధ అభిప్రాయములు, భిన్న అభిప్రాయములు, పరస్పర విరోధ అభిప్రాయములు కూడ ఏకత్వము చెందినవి. భిన్నత్వమునకు తావు లేదు. అదియే పూర్ణ బిందువు. అదియే జీవితము. అది శాశ్వత సత్యమందొక బిందువై విరాజిల్లుచుండును.

*"సత్యంచ, అనృతంచ సత్యమభవత్."*

నీ వెరిగిన సత్యము అసత్యము కలిసి పూర్ణసత్య మగుచున్నది అని వేదము ఘోషించుచున్నది.

## MEDITATION - 14

(April 3, Sept. 9, Oct. 6, March 14)

Thought is gold. I AM the temple. I AM the image. I build the temple. Clay is darkness and brick is light. The temple is melted into night and built in the day.

భావము బంగారము. నేను దేవాలయము. నేనే గర్భాలయ మందలి దేవుడను. నేనే దేవాలయ నిర్మాతను. మట్టి అంధకారము. ఇటుక వెలుగు. నా దేవాలయము రాత్రి కరగి పగలు నిర్మింపబడును.

*వివరణము :*

భావము బంగారము అనగా దివ్యము. దివ్య భావమే నిరంతరము కలిగియున్న జీవుడు దేవాలయము. భావ పరంపరల నాణ్యతను బట్టి దేవాలయ మగుట, కాకుండుట జరుగుచున్నది. దేవాలయ నిర్మాణమైన వెనుక కదా! దైవ ప్రతిష్ఠ. నిర్మాణ మగు చున్నప్పుడు, దైవ ప్రతిమను కూడ తయారు చేయుచున్నాము కదా! అట్లే దివ్య భావమయమైన జీవుని యందు దైవము కూడ అంగుష్ఠ మాత్ర ప్రమాణమున చతుర్భుజుడై అవతరించగలడు. అట్టి దైవము పేరుకూడ నేనే. అప్పుడు జీవునికి "అతడే నేను" అని తెలియును. అతని ప్రతిబింబమే తానని కూడ తెలియును.ఈ సమస్తము తెలియుట భావములయొక్క నాణ్యతనుబట్టి యుండును. అందు వలన భావము బంగారము. దాని నిర్మాత 'నేను' అను జీవుడు. అట్టి నిర్మాణమునకు ఫలశ్రుతి దైవముయొక్క అవతరణము.

దేవాలయ నిర్మాణమున వెలుగు, చీకట్లు అత్యావశ్యకములు. సృష్టి నిర్మాణమునకు దితి, అదితి, వినత, కద్రువ, ఉచ్ఛ్వాస - నిశ్వాస, కుడి - ఎడమ, జ్ఞానము - అజ్ఞానము రెండు మూల స్థంభములు. ద్వంద్వము లేనిదే సృష్టి లేదు. అందలి ఏకత్వమే దైవము. రెండింటియొక్క ప్రయోజనము తెలిసి రెండింటిని సమభావ ముతో సమన్వయించుకొని జీవించవలెను.

మట్టి లేనిదే ఇటుక లేదు. ఇటుక లేనిదే దేవాలయము లేదు. దేవాలయము లేనిదే దైవానుభూతి లేదు. అందువలన సమగ్ర సమన్వయ భావము మాత్రమే దేవాలయ నిర్మాణమునకు తగిన సూచన.

కేవలము మట్టి మాత్రమే అనగా అజ్ఞానము మాత్రమే యున్నచో దేవాలయ నిర్మాణము కాదు. ఇటుకగ మలచుకొనినచో అది దర్శింపనగును.

**MEDITATION - 15**

(April 4, Sept. 8, Oct. 7, March 13)

I AM gold. I build the temple. Steam of gold is my life. Fume of gold is my light. Life is gold. I AM healed. Sun is gold. Sun is life.

నేను బంగారము. నేనే దేవాలయమును నిర్మించుచున్నాను. బంగారు ఆవిరియే నా ప్రాణము. బంగారు కాంతియే నా వెలుగు. నా జీవనమే బంగారము. నేను స్వస్థుడనైతిని. సూర్యుడు బంగారము. సూర్యుడు ప్రాణము.



*వివరణము :*

సూర్యుని నుండి సూర్యకిరణముల ద్వారా సూర్య మండల మండలి జీవులకు అను నిత్యము ప్రాణము, తెలివి అను వెలుగు అందించబడు చున్నవి. సూర్యకాంతి హిరణ్మయకాంతి.

జీవుడు సూర్యుని ప్రతీకయే. సూర్యమండలమున నున్న సమస్త ప్రజ్ఞలును మానవుని యందున్నవి. తనకు తాను సూర్యుడే. నిజమునకు సూర్యునకు తనకు భేదము లేదు. ఇది తెలిసిన వారు, తెలిసినవారు.

సూర్యుడు సవితృ మండలము నుండి ప్రాణమును, ప్రజ్ఞను తా నందుకొని, తన నుండి బంగారుకాంతి ప్రసరింప చేయుచు సూర్య మండలము అను దేవాలయమును నిర్మాణము చేసినాడు. తన కిరణముల ద్వారా గోళములకు, గ్రహ గోళములకు, జీవులకు ప్రాణము, తెలివి అనునిత్యము అందించుచున్నాడు. అతనిది హిరణ్మయమగు కాంతి. అతని బింబము సత్యమును మరుగు పరచి బంగారు కాంతిగ అందించుచున్నదని వేదములు, ఉప నిషత్తులు ఘోషించుచున్నవి. అతను బంగారము. అతడందించు ప్రాణము బంగారు నీటి ప్రవాహము. అతడందించు ప్రజ్ఞ బంగారు భావము.

తాను సూర్యుడను అని భావించిననాడు జీవుడును బంగారమే. అతని జీవన నిర్మాణము కూడ బంగారు దేవాలయముగ పరిణమించును. అతనియందు ప్రాణము, తెలివి, భావము, బంగారుమయమై యుండును. అట్టివాడు పూర్ణస్వస్థుడు.

## MEDITATION - 16

(April 5, Sept. 7, Oct. 8, March 12)

Moon is silver. I AM the lake. Lake is moonlight, I AM healed. I AM silver. In me the moonbeam awakes. I AM moonlight. In me the Sun is sealed.

చంద్రుడు వెండి. నేను సరస్సు. సరస్సు వెన్నెలతో నిండినది. నేను స్వస్థుడనైతిని. నేను వెండిని. నా నుండి చంద్రకిరణ పుంజము ఉద్భవించినది. నేను వెన్నెలను. నా యందు సూర్యుడు నిక్షిప్తమై యున్నాడు.



*వివరణము :*

చంద్రుడి వెన్నెల వెండి వెన్నెల. చంద్రుడే మన మనస్సు. మన మనస్సు ఒక సరస్సు వంటిది. అనగా స్వయంప్రకాశము లేనిది. దానిపై వెన్నెల ప్రసరించినపుడు వెన్నెలతో నిండిన సరస్సువలె కాంతివంత మగును. వెన్నెలతో నిండిన సరస్సును ఊహించుకొన వలెను. పూర్ణచంద్రుని కాంతి నిర్మల ఆకాశము నుండి సరస్సుపై పడుచున్నట్లు ఊహించుకొనవలెను. సరస్సు సాధకుని మనస్సు. మనస్సు నందు నిలిచిన మానవ ప్రజ్ఞను వెండి వెన్నెలతో నింప వలెను. అప్పుడు సరస్సు నందలి కల్లోలము తగ్గి తరంగములు ఉపశమించి, ఆహ్లాదకరముగ నుండును. పై విధముగ వెండి వెన్నెలతో నిండిన మనస్సు స్వస్థత పొందును. అస్వస్థత నశించును.

పరిపూర్ణమగు వెన్నెల వెలుగుతో నిండిన మనస్సు కాంతి వంతమై తేజరిల్లును. అప్పుడు తాను కాంతివంతమగు వెన్నెల వెలుగుగ మారును. తాను అంతకు ముందు అల్లకల్లోలముగ నున్న సరస్సు. దానిని ఆహ్లాదకరము, శమనము కలిగించు వెన్నెల వెలుగుతో నింపుట మొదటి కర్తవ్యము. అది కారణముగ మనో కల్లోలము లుపశమించును. ఉపశమించిన మనస్సు వెండి వలె తేజరిల్లును. అనగా బుద్ధి ప్రచోదనమై వెండి తెరవలె వెలుగును. అట్లు వెలిగిన బుద్ధి యందు మానవ ప్రజ్ఞ స్థిరపడును. ఆ వెలుగే నేనను ఆత్మ వెలుగు. అందు సూర్యుడను ఆత్మ నిక్షిప్తమై యుండును.

పై ధ్యానమును నిత్యము శ్రద్ధాభక్తులతో నిర్వర్తించు కొనువారికి మనస్సు శాంతింపగలదు. ప్రత్యేకించి పౌర్ణమి వెన్నెల యందు ఈ ధ్యానమును నిర్వర్తించుకొన్నచో అలజడి తగ్గి మనస్సు బుద్ధికి ఉన్ముఖమై వెలుగ గలదు. మనలోని భావావేశములు (emotions) తగ్గి క్రమశః వెలుగుతో కూడిన సూక్ష్మ శరీరము కూడ నిర్మాణము కాగలదు.

## MEDITATION - 17

(April 6, Sept. 6, Oct. 9, March 11)

Mighty crown and spear I am. Crown is my head. I am the head. Spear is my back. I AM the tail. Crowned king I am. I am the shepherd. Spear-tip I am. I am the red sting. By me fear is killed, by me the serpent is killed.

నేనొక మహత్తరమైన కిరీటమును, అంకుశమును. కిరీటము నా తల, నేను నా తలయే. అంకుశము నా వెన్నెముక. నేను వెన్నెముకను కూడ. నేను కిరీటధారియైన రాజును. నేను గొఱ్ఱెల కాపరిని. అంకుశపు మొన నేను. మొనకు గల ఎఱుపు మచ్చను నేనే. భయము నాచేత సంహరింపబడినది. సర్పము నా చే చంపబడినది.

*వివరణము :*

మానవుని చైతన్యమంతయు శిరస్సు నందలి మెదడు, వెన్నెముక నందలి నాడీ చైతన్యముగ నున్నది. నిలబెట్టిన దేదీప్య మానమగు గదవలె నున్నది. పడగ విప్పిన నాగుపాముతో కూడ దీనిని పోల్చుదురు. వెలుగుచున్న శిరస్సును కిరీటమందురు. అట్లే చైతన్యస్ఫూర్తితో కూడిన వెన్నెముకను అంకుశ మందురు. శిరస్సు అంకుశముగ మానవుని యందు వ్యాపించిన చైతన్యము నేనను ప్రజ్ఞ. తల నేను, వెన్నెముక నేను, వెన్నెముక కొనను నేను అని దర్శించినవాడు తన జీవితమునకు తాను రాజు. తనకు జీవితముపై స్వామిత్వమున్నది. కిరీటధారియైన రాజువలె అంకుశము తన శక్తిగ, అతను రాజ్యపాలనము చేయగలడు. అతడు సృష్టియందు గొఱ్ఱెల కాపరివలె అమాయక జీవులను కాపాడుచుండును. తానొక గొఱ్ఱెల కాపరిగ, గోపాలకుడుగ జీవించు చుండును. అతడు మాయా మోహములను జయించి యుండును. ఈ రెండింటిని జయించిన వారికి భయముండదు. వీనిని జయించుటయే భయమును జయించుట. కాలసర్పమును జయించుట. సర్పము వలయము లకు సంకేతము. నాగుపాము ఊర్ధ్వగతి చెందిన చైతన్యమునకు సంకేతము. మొదటిది అజ్ఞానమునకు ప్రతీక. రెండవది జ్ఞాన స్వరూపము.

## MEDITATION - 18

(April 7, Sept. 5, Oct. 10, March 10)

I AM the thinker. I AM thought. I AM the knower, I AM known. I AM the seer, I AM seen. I AM he who lives, I AM life. I AM the grower, I AM grown.

నేను ఆలోచనాపరుడను, నేను ఆలోచనను. నేనే తెలుసుకొనువాడను, నేనే తెలివిని. నేను ద్రష్టను, ద్రష్ట నేనే. నేను జీవించు వాడను, జీవము నేనే. నేను పెరుగువాడను, పెరుగుదల నేనే.



*వివరణము :*

ఆలోచించినపుడు నేనను ఆత్మప్రజ్ఞయే ఆలోచనగ యుండును. అవగాహన చేసుకొనునపుడు అవగాహన కల్గించు ప్రజ్ఞగ వుండును. చూచుచున్నప్పుడు చూపుగ నుండును. మనము జీవించుట అనగా జీవముగ యున్నది ప్రజ్ఞయే. అట్లే మనము పెరుగుట, మనము తరుగుట, ఆత్మప్రజ్ఞ ఆధారముగనే జరుగు చున్నది.

ప్రజ్ఞ ఈ శరీరమున వుండుట వలననే సమస్తము జరుగుచున్నది. ఆలోచించుట, చూచుట, వినుట, రుచిచూచుట, గ్రహించుట, వివేకించుట, విశ్రాంతి పొందుట, నిద్రించుట మేల్కొనుట, ఇవి అన్నియు నేనను ప్రజ్ఞ ఆధారముగ జరుగుచున్నవి. ప్రజ్ఞ శరీరమున నిలువనిచో పై వ్యాపారము లేవియు జరుగవు. పై వ్యాపారము లన్నియు కూడ స్పందన మాధారముగ జరుగు చున్నది. స్పందన కాధారము ప్రాణము. ప్రాణమున కాధారము ప్రణవము. అది నీవే.

నీ వెవరివో నీకు తెలిసిన నీకిక భయము లేదు. నీ వ్యాపారము లన్నియు శరీర మాధారముగ జరుగుచున్నవి. ప్రజ్ఞ శరీరమును త్యజించినపుడు వ్యాపారము లేవియు వుండవు. నీ వుందువు. నీవు మాత్ర ముందువు. నీ నుండియే సమస్తము ప్రకృతి రూపమున విచ్చుకొనుచున్నది. విచ్చుకొనుట, ముడుచుకొనుట ప్రకృతి లక్షణము. ఉండుట నీ లక్షణము. అట్టి ఉండుటను ప్రతినిత్యము భావన చేయుము. అపుడు ప్రకృతి పట్టు నీపై సడలును.

## MEDITATION - 19
(April 8, Sept. 4, Oct. 11, March 9)

The saviour is coming. He comes through degrees. He is the star of the virgin, who is in charge of Nandi. Nandi is the Kailas of Moon. There she is the star of the virgin. She is the mother, she is the Grace. He is on the bull, she is on the lion. Moon is on his head, she is on the crown of fish. Moon is on his head. He is the lord of She.

రక్షకుడు వచ్చుచున్నాడు. అతడు క్రమశః దరిచేర గలడు. అతడు శ్రీ కన్య నుండి మెరయు తార. అతడా నందమునకు సంకేతము (నంది). నందత్వము సోముని సొత్తు. రక్షకుని నందత్వము కైలాస పర్వతమంత ఉత్త మోత్తమమైనది. ఆమె జగన్మాత, అనుగ్రహ రూపిణి. అతడు నంది నధిరోహించును. ఆమె సింహము నధిరోహించును. అతని శిరస్సుపై ఆనందమునకు పరాకాష్ఠగ చంద్రవంక వలె రక్షకుడుండును. ఆమె అతని శిరస్సుపై మీనముల కిరీటముగ నుండును. రక్షకుడు కాలము నుండి కన్యద్వారా దిగిరాగ ఆమె అతని సతిగ నుండును.

*వివరణము :*

ఈ ధ్యానము అత్యంత పవిత్రము. రక్షకుడు మనయందు అవతరించుట ఇందలి రహస్యము. మన యందలి పరతత్త్వమే శివుడు. అతని నాశ్రయించియే అతని సతి పవిత్రమూర్తియై విరాజిల్లు చుండును. ఆమె జగన్మాత, అతడు జగత్పిత. అతని కిరీటము వలె ఆమె భాసించుచున్నది. ఆ కిరీటముపై మీనముల సంకేతము కలదు. మీనములు, మీనరాశి తత్త్వమునకు సంకేతము. మీనరాశి సృష్టి ఆరంభమునకు అంతమునకు, సంకేతము. సృష్టి ఆరంభము, వృద్ధి, అంతము అన్నియు జగన్మాతచే నిర్వర్తింపబడుచున్నవి.

పరతత్త్వము ఆనంద స్వరూపము. అది కారణముగ అతడు నందిని అధిష్ఠించి యుండును. ఆనంద స్వరూపమే నంది. ఆమె సింహము నధిష్ఠించి యుండును. సింహ శబ్దము సృష్టి సంకేతము. ఈ శబ్దముయొక్క రూపాంతరములే హంస, హసాం సోహం, సింహిక, హింసిక. ఆమె అతనిని సృష్టిగ మలచును. అతడు "స" శబ్దమునకు సంకేతము. ఆమె "హ" శబ్దమునకు సంకేతము. అతని యందామె యుండును. ఆమెయం దతడున్నాడు. వారి కలయికయే సప్త లోకముల సృష్టి. అందుచేత ఆమె సింహాసనాసీన. సృష్టి పురోగమము, తిరోధానమును ఆమె అధిష్ఠించి యుండును. ఆమె హింసిక, అనగ అధర్మమును హింసించ కలదు. సింహిక అనగా ఆకర్షించి మాయ యందు నిలుపగలదు. ఆమె శక్తి వర్ణనాతీతము. అతని ఆనందము వర్ణనాతీతము.

రక్షకుడు సోముడే. సోముడనగా స+ఉమ. ఉమతో కూడిన వాడు. అతడు తండ్రి పాలభాగముపై మెఱయుచుండును. అతని యందు తండ్రి ఆనందము, తల్లి శక్తి పూర్ణముగ నుండును. అతడు ఆనందమునకు కైలాస పర్వతమువంటి వాడు. అతడు (రక్షకుడు) ఆమె నుండి క్రమశః దిగివచ్చును. ఆమె కన్యాత్వమునకు పరాకాష్ఠ. కన్యాత్వము పవిత్రతకు సంకేతము. మనలో పవిత్రత క్రమశః పెరుగుచున్నకొలది, అతడు మన యందవతరించ గలడు. పై కారణముగ అతని అవతరణము క్రమశః జరుగునని ఈ ధ్యానము తెలుపుచున్నది.

## MEDITATION - 20

(April 9, Sept. 3, Oct. 12, March 8)

To whose temple the Arch is starlit, In whose temple the Sun is the image of God,
To whose temple the Moon goes every month
And Brings the message out every full-moon,
And whose message the Moon sings as a word of sixteen letters,
His religion I belong to,
His temple I visit; His name I utter;
His glory I live in.
To Him I offer the lotus of my day,
To Him I offer the lotus of my night.

ఎవరి దేవాలయమున దేదీప్యమానమగు తారకలు మకర తోరణమో, ఎవరి దేవాలయమున సూర్యుడు దైవమునకు ప్రతీకయై గర్భాలయమున నుండునో, ఎవరి దేవాలయమునకు ప్రతిమాసము చంద్రుడు యేగి ఆ మాసపు సందేశము కొనితెచ్చునో, చంద్రుడు కొనివచ్చు ఎవరి సందేశము పదహారు అక్షరములతో కూడి యుండునో, అతని మతమునకు నేను చెందినవాడను. అతని దేవాలయ మును నేను దర్శింతును. అతని నామమును నే నుచ్ఛ రింతును. అతని వైభవమున నేను జీవింతును. అతనికే నా పగటి జీవితమను పద్మము సమర్పణము. అతనికే నా రాత్రి జీవితమను పద్మము సమర్పణము.

*వివరణము :*

ఈ ధ్యానము అత్యంత ప్రాచీనమైనది. తొలుత మానవుడు ఆరాధించినది సూర్యుని వెలుగునే. అతడు తారకలతో కూడిన విశ్వమునే దేవాలయముగ భావించెను. ఆ దేవాలయమునందు సూర్యబింబమునే దైవముయొక్క ప్రతిమగ భావించెను. ఆ దేవాలయము చుట్టును చంద్రుడు పదహారు రోజులకు ఒకసారి ప్రదక్షిణము చేయుచు ప్రతి పౌర్ణమికి దైవముయొక్క సందేశము అందించునని గ్రహించెను. ఆ మాసపు సందేశము పదహారు కళలతో కూడిన పదహారు (షోడశ) అక్షరముల మంత్రముగ గ్రహించెను.

సూర్య చంద్రాత్మకమగు సందేశములను గ్రహించి జీవించు చుండెను.

అట్టి విశ్వాత్మకమగు దేవాలయమునందు గల, సూర్య చంద్రాత్మక ప్రజ్ఞను, దాని సందేశమును గ్రహించి సామరస్యముతో జీవించుటే మతముగ నుండెను. ఇప్పటి మతములు అప్పుడు ఇంకను పుట్టలేదు. మత వ్యవస్థాపకులు లేరు. మత భేదములు, వర్గములు లేవు. పై తెలిపిన జీవన విధానమును పాటించెడివారు.

దేవాలయమును దర్శించుట యనగా విశ్వ దర్శనమే. అతని నామము ఉచ్చరించుట యనగా "నేను" అను ప్రజ్ఞను అను స్మరణము చేయుట. "నేను" అను సర్వాంతర్యామి ప్రజ్ఞయే, "నేను" అను జీవప్రజ్ఞగ నున్నది. కావున జీవుని జీవనము అతని వైభవమే. పగలు, రాత్రి జీవుడు అతనికి సమర్పణ చెంది, జీవించు చుండును.

పరమగురువు తమ అనుయాయుల నుండి ఆశించు అవగాహన జీవనము ఇట్టిదియే.

## MEDITATION - 21

(April 10, Sept. 2, Oct. 13, March 7)

From sleep to darkness, from darkness to no colour, from no colour to brilliant blue, from brilliant blue to brilliance pure, from brilliance pure to one colour, from one colour to three, from three to four, from three and four to seven, from three times four to twelve, from twelve to twenty four, to forty eight, forty nine, to ninety eight, to one hundred, to one thousand and a series of zeros, to lead again into the one great Zero. The world goes to sleep.

నిద్ర నుండి అంధకారములోనికి, అంధకారము నుండి అవర్ణ స్థితి, అవర్ణ స్థితినుండి తేజోమయమగు నీలములోనికి, అట్టి నీలమునుండి దేదీప్యమానమగు, నిర్మలమగు తెల్లదనములోనికి, అందుండి ఒక వర్ణములోనికి, ఒక వర్ణము నుండి మూడు వర్ణములలోనికి, మూడు నుండి నాలుగు, మూడు నాలుగు కలిపి ఏడు, అటుపైన మూడు నాలుగులు పండ్రెండు, పండ్రెండు నుండి ఇరువది నాలుగు, అందుండి నలుబది ఎనిమిది, అటుపైన నలుబది తొమ్మిది నలుబది తొమ్మిది నుండి తొంబది ఎనిమిది, వంద, వెయ్యి, మరియు అచట నుండి వరుసగా పూర్ణములు పెరుగుదల అటుపై అంతయూ ఒకే పూర్ణములోనికి, అటుపైన పరిపూర్ణము, అట నుండి నిద్రలోనికి.

*వివరణము :*

ఈ ధ్యాన మొక మహత్తర జ్ఞానము. ఇందు అంకెలు, శబ్దములు, రంగులు, షట్చక్రములు, అందలి దళములు మొత్తము, సృష్టి విచ్చుకోలు మరియు తిరోధానము తెలుపబడినది. నిద్ర నుండి నిద్రలోనికి సృష్టి ఎట్లు సాగునో తెలుపబడినది.

సృష్టి సంకల్పమునకు ముందు సమస్తమును తనయందు తా నుండుట చేత దానిని యోగనిద్రగ తెలియవలెను. యోగ నిద్ర వేరు, నిద్ర వేరు. మొదటి దానియందు ఎరుక వుండును. రెండవ దానియందు ఎరుక వున్నట్లు తెలియదు. సమస్తమును నిద్రాణమైన స్థితిలో నుండును. అన్నియును అవ్యక్తముగ నుండును. బీజము నందలి మఱ్ఱివృక్షమువలె యుండును. దీనినే చీకటి యందురు. 'చీకటి నిజమైన వెలుగు, పూర్ణమైన వెలుగు' అని తెలిసినవారే, తెలిసినవారు. Darkness is absolute Light.

చీకటికి రంగు లేదు. వాసన లేదు. లక్షణములు లేవు. దానిని గూర్చి తర్కించలేము. దానిని తెలియుట యుండదు. దానిని తెలియుట యనగా అది అగుటయే. దీనినే అవ్యక్తమని పెద్దలు శ్లాఘించిరి. అది పూర్ణమే, కాని బీజస్థితిలో యున్నది. అందు రంగులు, అంకెలు, శబ్దములు, సమస్తము నిక్షిప్తమై యున్నవి. ఏమియు లేనట్టుగ యుండి, అన్నియూ కలిగిన స్థితి ఇది.

పై తెలిపిన నలుపు నలుపో, నీలమో అనిపించును. ఒకప్పుడు ముదురు నీలముగను, మరొకప్పుడు నలుపుగను గోచరించుచున్నది. అందుండి నిర్మలమగు తెల్లదనము వ్యక్తమగును. తెలుపు రంగులకు పుట్టినిల్లుగాని తానొక రంగు కాదు. అట్టి తెలుపు నుండి మూడు వర్ణములు పుట్టుచున్నవి. అవియే ఎఱుపు, నీలము, పసుపు. ఆ మూడింటి నుండి నాలుగవది పుట్టుచున్నది. అదియే లేతాకుపచ్చ. అందుండి పై మూడును, ప్రతిబింబించి ఏడగు చున్నవి. అదియే సిందూరము, గులాబి, ఊదా (Violet). ఇట్లు ఒకటి మూడై, మూడు నాలుగగుచుండగ, నాలుగు ఏడగు చున్నది. మరియు మూడు నాలుగులు పండ్రెండగు చున్నవి. అవియే ద్వాదశాదిత్యులు, ద్వాదశ మాసములు, ద్వాదశ భావములు. పండ్రెండు ఇరువది నాలుగు అగుచున్నవి. అవియే సంవత్సర మందలి అమావాస్య, పౌర్ణములు. సృష్టి యందలి ఇరువది నాలుగు తత్త్వములు. వీని నుండియే సృష్టి పుట్టుచున్నది. సృష్టిజీవుల దేహనిర్మాణము కూడ జరుగు చున్నది. అందు మానవ దేహము పరిపూర్ణమై, ఇరువది నాలుగు తత్త్వములను పుణికి పుచ్చుకొనుచున్నది. ఈ ఇరవై నాలుగును జంటలవలె నలభై ఎనిమిది అగుచున్నవి.

పై నలుబది ఎనిమిది తత్త్వములు, నలుబది ఎనిమిది దళముల వలె మూలాధార చక్రము నుండి విశుద్ధి వరకు ఏర్పడి యున్నవి.

| | | |
|---|---|---|
| మూలాధారము | - | 4 దళములు |
| స్వాధిష్ఠానము | - | 6 దళములు |

| | | |
|---|---|---|
| మణిపూరకము | - | 10 దళములు |
| అనాహతము | - | 12 దళములు |
| విశుద్ధి | - | 16 దళములు |
| మొత్తము | - | 48 దళములు |
| | - | లేక 24 జంటలు. |

జీవునితో కలిపి 49. దీనినే 48 తరువాత 49 అని ధ్యానమున తెలుపబడినది. ఈ తత్త్వములతో కూడిన జీవుడు దేహాత్మ.

ఆజ్ఞయందు వీనికి రెట్టింపు దళములు యున్నవి. అందు వలన 49 నుండి 98 అని ధ్యానమున తెలుపబడినది. అందు జీవాత్మ పరమాత్మతో కూడివుండుట వలన 98 నుండి 100 అని తెలుపబడినది. అట్లు ఆజ్ఞయందు నిలచిన జీవుడు దైవ యోగమున యుండుటచే మనస్సును, దేహమును అధిష్ఠించి యుండును. వంద యనగా 1, రెండు సున్నాలు. ఒకటి జీవుడు, సున్నాలు రెండును మనస్సు, దేహము.

వంద, వెయ్యి అగుచున్నవి అని ధ్యానము తెలుపుచున్నది అనగా ఆజ్ఞ నుండి ప్రజ్ఞ సహస్రారము చేరినది యని అర్థము. అది వెయ్యి దళముల పద్మము. అనగా జీవుడు దైవముతో ఏకత్వము చెందెను. అటుపైన వరుసగా సప్త లోకములను అధిష్ఠించుటయే వరుసగ పూర్ణములని ధ్యానమున తెలుపబడినది. పూర్ణము లన్నియు ఒకే పూర్ణము అగుచున్నవి.

"పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే" అని వేదము తెలుపుచున్నది. సున్నకు ఎన్ని సున్నాలు కలిపినను మిగులునది సున్నయే. అటుపైన మరల ప్రళయము. దానినే ప్రపంచము మరల నిద్రలోనికి చనుచున్నదని ధ్యానము తెలుపుచున్నది.

బుద్ధిమంతుడగు సాధకుడు పై అంకెలను శబ్దముతో కూడ సమన్వయించుకొన వచ్చును. 49 శబ్దములతో దేవభాష ఏర్పడినది. అదియే సంస్కృతముగ పరిణమించినది. సంస్కృత భాషయందు 16 అచ్చులు, 25 హల్లులు, 8 శాంతములు కలవు. ఈ నలుబది తొమ్మిదినే  24 జంటలు, మరియు దేహమున నిలచిన ఆత్మ తత్త్వముగ సమన్వయించ వచ్చును. భాష, విశుద్ధి వరకే పరిమిత మని తెలియవలెను. పై కారణముగ సంస్కృతభాష మాత్రమే మానవునికి సంస్కృతి నీయగలదు. సంస్కృత భాషయే ప్రపంచ భాషలకు మాతృభాష. అందుండియే గ్రీక్, లాటిన్, అరబ్బీ భాషలు పుట్టినవి. వాటి నుండి ప్రస్తుతము పాశ్చాత్యులు భాషించు భాషలు పుట్టినవి. భరతదేశమున నున్న భాషలన్నియు సంస్కృతము నుండి పుట్టినవియే. పై కారణముగ సంస్కృతమున రచించిన స్తోత్రములు, సూక్తములు నిత్యము పఠించువారికి దేహమునందు, సృష్టి యందు గల ప్రజ్ఞలు మేల్కాంచగలవు. సంస్కృతమును నిరాక రించుట సంస్కృతిని నిరాకరించుటయే. అది కలి ధర్మము.

## MEDITATION - 22

(April 11, Sept. 1, Oct. 14, March 6)

Gods are born at Sunrise, man is born at noon.

Gods set in the West, man sets at midnight.

Gods are born in Capricorn, man is born in Aries.

Gods set in Cancer, man sets in Libra.

సూర్యోదయమున దేవతలు జన్మింతురు. మిట్ట మధ్యాహ్నమున మానవులు జన్మింతురు.

పశ్చిమమున దేవతలు అస్తమింతురు. మానవుడు అర్ధరాత్రిన అస్తమించును.

దేవతలు మకర సంక్రమణమున ఉద్భ వింతురు. మానవుడు మేషమున ఉద్భవించును.

దేవతలు కర్కాటక సంక్రమణమున అస్తమింతురు. మానవుడు తుల యందు అస్తమించును.

*వివరణము :*

కాలము నాలుగు విధములుగ మానవులచే తెలియబడినది. అవి ఈ విధముగ నున్నవి.

| 1 | 2 | 3 | 4 |
|---|---|---|---|
| సూర్యోదయము | మధ్యాహ్నము | సాయంకాలము | అర్ధరాత్రి |
| శుక్ల అష్టమి | పౌర్ణమి | కృష్ణ అష్టమి | అమావాస్య |
| మకర సంక్రమణం | విషువత్ | కర్కాటక సంక్రమణం | విషువత్ |
| డిసెంబరు-22 | మార్చి-21 | జూన్-21 | సెప్టెంబరు-22 |
| కృతయుగం | త్రేతాయుగం | ద్వాపరయుగం | కలియుగం |

ఈ పై నాలుగు విభజనలు సృష్టి ప్రారంభము, సృష్టి పరిపూర్తి, సృష్టి తరుగుదల, లయము అని తెలియవలెను. ఇవి ప్రతిరోజు నాలుగు సంధ్యలుగ గోచరించును. ప్రతి మాసము నాలుగు వారము లుగ గోచరించును. ప్రతి సంవత్సరము నాలుగు భాగములుగ గోచరించును. నాలుగు యుగములుగ కూడ గోచరించును. మానవ జీవితము నందు కూడ ఈ నాలుగును బాల్యము, యౌవనము నడి వయస్సు, ముసలితనముగ గోచరించును.

సృష్టి ప్రారంభమున దేవతలు ఉద్భవించి సృష్టికార్యము చేయుదురు. అందు మానవుని అవతరణము, సృష్టి కార్యమునకు పరాకాష్ఠ. అది మధ్యాహ్నము వంటిది. సాయంకాలమునకు క్రమశః సృష్టి తరుగుదల జరుగుచుండును. అటుపైన అర్ధరాత్రికి లయ

మగుచుండును. పై కారణముగ సూర్యోదయ కాలమును దేవతల ఉద్భవముగ భావించి, ఆరాధనము చేసుకొనవలెను. మధ్యాహ్నా మునకు దేవతా పరిపుష్టమైన పూర్ణ మానవులు చతుర్భుజుడైన విష్ణువు రూపముగ ధ్యానించవలెను. సాయంకాలము దైవకార్యము ముగింపునకు వచ్చును గనుక, సృష్టి ముగింపు- దేవతలైన రుద్రు లకు నమస్కరించుకొనవలెను. ఇదియే ప్రదోష శివారాధనముగ సంప్రదాయ మందించు చున్నది. అర్ధ రాత్రమున మానవుడు లయించును లేక నిద్రించును.

పై విధముగ మాసమునందు, సంవత్సరము నందు గమనించుట సమన్వయించుకొన వలెను. మకర మాసము దేవతా సృష్టి కారంభము కనుక అది ఒక సంవత్సరాది. మేషమున మానవు డుద్భవించును కనుక మానవుల కది సంవత్సరాది. కర్కాటకమున జరుగు మార్పును గుర్తించి, అది యొక సంవత్సరాదిగ గుర్తించిరి. ఆశ్వయుజమున జరుగు మార్పు గుర్తించి దానిని ఒక సంవత్సరాదిగ గుర్తించిరి. సంవత్సర చక్రమున ఒక బిందువును ఆదిగ గుర్తించినచో మరల అదియే అంతముగ గుర్తింపబడును. ఈ నాటికిని డిసెంబరు 22 నూతన సంవత్సర ఆరంభముగ గుర్తించు సంప్రదాయము కలదు. అట్లే మన మెరిగిన చైత్రమాసమున సంవత్సరాదిని గుర్తించుట బహుళ వ్యాప్తముగ నున్నది. మరికొందరు దసరా నుండి సంవత్సర మును గుర్తించు సంప్రదాయ మున్నది. నిజమునకు డిసెంబరు 22, ఈ కాలమున జనవరి 1 అయినది. ఇట్టి రూపాంతరము చెందుటకు కలి ప్రభావమే కారణము.

## MEDITATION - 23

(April 12, Aug. 31, Oct. 15, March 5)

Creation was planned before you came. You can plan for yourself like the plan of the creation. Creation is for all, you are one among the many. The plan of all is work, the plan of one is fate. Fate for work is ritual, work for fate is heresy.

నీవు పుట్టకముందే సృష్టిప్రణాళిక రూపొందించ బడినది. (అది విశ్వప్రణాళిక). నీవును నీ ప్రణాళికను విశ్వ ప్రణాళికా సూత్రముల ఆధారముగ ఏర్పరచుకొనవచ్చును. సృష్టిప్రణాళిక సమస్త జీవకోటి నుద్దేశించి ఏర్పరచబడినది. అందు నీ వొకడవు. అందరి నుద్దేశించు జరుగు కర్మ విశ్వ ప్రణాళిక. అందు నీ ప్రణాళిక కేవలము నిన్ను ఉద్దేశించు కొని నేర్పరచుకొనినచో అది నీకు విధియై నిలచును- బంధిం చును. అందరి నుద్దేశించి జరుగునది దివ్య కర్మ. అది క్రతువు. నిన్ను ఉద్దేశించుకొని చేయునది వ్యక్తిగత కర్మ. అది ఫలితముల నేర్పరచి బంధించును. అది అజ్ఞానము.

*వివరణము :*

సృష్టి కర్మ, తత్ప్రణాళిక జరుగుచుండగా అందులో భాగముగ కోటీ ఎనుబది లక్షల సంవత్సరముల క్రితము మానవు డుద్భవించి నాడు. సృష్టి ఈ భూమిపై మూడు కోట్ల సంవత్సరముల నుండి జరుగుచున్నది. సృష్టి ప్రణాళిక అను మహత్తరమైన యజ్ఞమునందు, ఒక అంకమున మానవుని ఆవిర్భావము జరిగినది. అతనియందు దైవము తన సమస్త శక్తిని నిలిపినాడు. తనంతవానిగ తీర్చి దిద్దినాడు. అట్టి మానవుడు సృష్టియందు ఎట్లు ప్రవర్తించవలెను? ప్రణాళికలో భాగముగ తను దిగివచ్చుటచే, తానును ఇతర జీవుల వలె సృష్టి ప్రణాళిక ననుసరించవలెను. సృష్టిప్రణాళిక యజ్ఞార్థము నిర్వహించ బడుచున్నది. అనగా జీవులందరును కర్తవ్య నిర్వహణ మున నిలచి తత్ఫలములను సృష్టి కంకితము చేయుచున్నారు. దీనినే యజ్ఞ మందురు. సమస్త దేవతలు, భూతకోటి అదే విధముగ జీవించు చున్నారు. నర్తించుచు ఆనందించుచున్నారు. మానవుడొక్కడే తద్భిన్నముగ ప్రవర్తించు చున్నాడు.

మానవుడుపై రహస్యమును గ్రహించి తన జీవన ప్రణాళిక కూడ సృష్టి ప్రణాళికవలె రూపొందించుకొనినచో ఆనందముగ నుండును. అట్లుకాక తన కొఱకని రూపొందించుకొని పనిచేయు చున్నచో అట్టి కర్మ దివ్యకర్మ కాక వ్యక్తిగత కర్మ యగును. దాని ఫలితమును తా నాశించుట వలన అవి బంధించును. తత్కారణ

ముగ అనేకానేక జన్మముల నెత్తుచుండును. అతని జీవనము అటుపైన సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలచే నియమింపబడును. బద్ధు డగును. బాధపడును. దీనినే విధి (fate) అని పిలుతురు. తా నేర్పరచు కొనిన కర్మ క్రమమే తనదైన ప్రత్యేక స్వభావముగ ఏర్పడి తనను బంధించును. స్వభావము నడిపించునట్లు నడచును. వలదని జీవుడు తెలిపినను మనస్సు వినదు. స్వభావము స్వతంత్రమై, స్వామియై, జీవుడు బానిసయై తీరిక లేక జన్మ లెత్తుచుండును. సృష్టి యందుగల జీవుడు సృష్టి ఆశయములనే తన ఆశయములుగ ఏర్పరచుకొనవలెను. అట్లు కానిచో అజ్ఞానమున బడును.

## MEDITATION - 24

(April 13, Aug. 30, Oct. 16, March 4)

Have your friend in yourself, be a friend to others;

Depend upon yourself, be dependable to others.

Do not expect but demand what is due to Him from them.

Be a guard and a guardian to the temple not for you, but for Him.

Be a guard and a gardener for your body and mind, not for you but for Him.

నీ స్నేహితుడు నీ యందే వున్నాడు. నీవు ఇతరులకు హితుడవై యుండుము. నీవు నీపైనే ఆధారపడుము. ఇతరులకు ఆధారముగ నుండుము.

నీ కొరకు ఏదియును ఆశించవద్దు. కాని దైవము కొరకై, ఇతరుల నుండి దైవమునకు అందవలసినది రాబట్టుము.

పవిత్ర దేవాలయమునకు రక్షకుడుగను, పోషకుడుగను వుండుము.

నీ కొరకు గాక అతని కొరకు అట్లు చేయుము. నీ దేహమునకు కూడ నీవు రక్షకుడుగను, పోషకుడుగను వుండుము. అదియును కూడ నీ కొరకు గాక దైవము కొరకే.

*వివరణము :*

ప్రతి జీవికిని అతని హృదయమునందే స్నేహితుడున్నాడు. అతనికన్న హితుడు కాని, సన్నిహితుడు కాని మరియొకడు లేడు. జీవి యందలి ప్రాణము తెలివిగ దైవము ఉపస్థితుడై యుండుటచే జీవ వ్యాపారము సాగుచున్నది. తనయందు దైవ మెట్లున్నాడో, తానుకూడ అట్టి విధముగనే ఇతరులతో యుండుట యోగి లక్షణము. అట్లుండుటకై ప్రయత్నించుట సాధన.

సాధకుడు తనపై తాను ఆధారపడవలెనేగాని ఇతరులపై వాలరాదు. ఇతరులపై ఆధారపడుట పరాధీనత. అది జీవుని బలహీన పరచగలదు. ఈ స్థితి నుండి స్వ అధీనతకు చేరుట కూడ సాధనాంశమే. చిన్న చిన్న విషయములనుండి తనపై తాను ఆధారపడుట మంచిది. అట్లున్నచో సహాయకులు లేని సమయ మున కూడ ఇబ్బంది కలుగదు.

ఆశ దుఃఖమునకు చేటు. ఆశించుట అజ్ఞానమే. ఆశించి నపుడు లభించకపోయినచో దుఃఖము తప్పదు. ఆశించని వానికి లభించిన దానితోనే సంతుష్టి కలుగును. అందువలన ఆశించుట అను వాసనను కర్తవ్యాచరణమను మార్గమున దాటవచ్చును. నీ కొరకై ఏదియును ఆశింపకుము. కాని దైవము కొరకై ఆశించుటకు, రాబట్టుటకు బిడయ పడకుము. ఉదాహరణకు షిరిడీ సాయిని చూడుము. ఆ మహాత్ముడు తన కొరకు ఏదియును ఆశించలేదు.

దైవము కొరకు నిష్కర్షగ రాబట్టెడివాడు. ఆశించుట లేనివాడే దైవము కొరకు రాబట్టగలడు. ఇతరులకు అది వీలు కానిది.

విశ్వమే దేవాలయము. అందు జీవుల రూపమున దైవ మున్నాడు. ఈ దేవాలయమునకు రక్షకుడుగ నుండుట యనగా తన పరిధిలో యథాశక్తి జీవులను రక్షించుటయే. జీవులకు రక్షణ కల్పించుట, పోషణ కల్పించుట భాగవత ధర్మము. సాధకుడు స్ఫూర్తితో ఇట్లాచరించవలెను. తనను తాను రక్షించుకొనుట, తనను తాను పోషించుకొనుట అనునవి సాధక లక్షణములు కావు. తా నితరులను రక్షించుచు, పోషించుచూ, జీవించుచున్నప్పుడు తన రక్షణ పోషణ దైవము నిర్వర్తింపగలడు.

అట్లే తన దేహము, మనస్సు తాను రక్షించుకొనుట, పోషించు కొనుట కూడ తన కోసము కాక దైవము కొరకే అని భావన చేయవలెను. బ్రహ్మము కొరకే నా పోషణము కూడ చేసుకొను చున్నాను. అని భావింపుమని భగవద్గీతలో శ్రీకృష్ణుడు బోధించినాడు.

*“బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।*
*బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా ॥ ” (4-24)*

## MEDITATION - 25

(April 14, Aug. 29, Oct. 17, March 3)

In His name we live, in His temple we live;
In Him verily we live until He opens His eye in us.
In His name He lives, in His temple He lives;
In Him verily He lives, as He opens His eye in us.
In the meanwhile, let us wait, let us look to Him and not to each other.
Let us call Him in all to find all in Him,
When the life is a Car festival and not a war festival.

అతని పేరున మనము జీవించుచున్నాము. అతని దేవాలయమున మనమున్నాము.

నిజమునకు అతడు మనయందు కన్ను తెరచు వరకు మనమున్నా మనుకొందుము.

అతడు మనయందు కన్ను తెరచినచో అతని పేరున అతడే యుండును. కేవలము అతడే యుండును.

అంతదనుక వేచియుందము. అతనినే ఒకరి యందొకరము చూసుకొను చుందము. ఒకరినొకరు చూసుకొనక అతనినే చూతము కాక.

అతనినే పిలుతుముగాక, అతనినే సమస్తమునందు దర్శింతుము గాక.

అప్పుడే జీవితము జగన్నాథ రథమువలె సాగ గలదు. లేనిచో అది మహా సంగ్రామమే.

*వివరణము :*

ఇది అత్యద్భుత ధ్యానము. నిజమునకు ఇంతకు మించి చేయదగున దేమియు లేదు. ఇది భాగవత సూత్రము. శ్రీకృష్ణుని చరమ సందేశము. ఇదియే నిజమైన తపస్సు, పూజ, ఆరాధన క్రతువు. ఈ భావము లేక చేయు దైవకార్యములు, పరహిత కార్యములు, జ్ఞాన బోధలు ఫలవంతములు కావు. ఇది యొక్కటి చేయగలిగినచో ఇతరములగు అనేకానేక కార్యక్రమము లవసరము లేదు. కేవలము రజోగుణ దోషముతో సాధకుడు ఎన్నోరకములైన కార్యములను చేపట్టును. అందు మునిగి తేలుచుండును. సత్త్వ గుణము ఏర్పడునంతవరకు ఈ అలసట తప్పదు.

నిజమునకు మనయందలి ప్రాణముగను, తెలివిగను దైవమే యున్నాడు. అతడే వివిధ దేవతాశక్తుల రూపమున సృష్టి నిర్మాణము, మన దేహ నిర్మాణము కావించుచున్నాడు. నిర్మించిన సృష్టియందు తానే ప్రవేశించి యున్నాడు. నిజమున కతడే మనముగ నున్నాడు. ఇది సత్యము.

అతడి మాయవలన మనమున్నా మనుకొనుచున్నాము. మన ప్రాణము, మన తెలివి, మన దేహము, మనవారు, మన సంపద అనుకొనుచున్నాము.

నిజమునకు అతని పేరన మన మున్నాము. అతడు అందించిన దేహమున మన మున్నాము. అతని ప్రాణము, తెలివి మన యందున్నవి. అతడు మనయందు కన్ను తెరచిననే కాని ఈ మాయ తొలగదు. అతడు మనయందు కన్ను తెరచుట కేవల

మనుగ్రహమే. దానికి తీరుతెన్నులు లేవు. అట్లతడు మనయందు కన్ను తెరచినచో అతడే యున్నాడని తెలియును.

మనయందు మనవలె వున్నాడని తెలియును.

అనుగ్రహము వర్షించువరకు మనమేమి చేయవలెను. ఊరకే యుండవలెనా? వుండలేము కదా! వేచి యుండుట తెలిసినను, వీలుపడని విషయము కదా! అందువలన పురుష ప్రయత్నము చేయవలెను. దైవ మనుగ్రహించువరకు అన్నిటియందు దైవమునే చూచుటకు ప్రయత్నించవలెను. విఫలుల మగుచున్నప్పటికి మరల మరల దానినే ప్రయత్నించవలెను. ఒకరి నొకరు చూచుట కాక దైవమును చూడవలెను. ఒకరి నొకరు సంబోధించుకొను నప్పుడు, ఒకరితో నొకరు సంభాషించుకొనునప్పుడు అతనినే సంబోధించు చున్నట్లు అతనితోనే సంభాషించుచున్నట్లు భావించవలెను. ఈ సాధన ఫలవంత మగుచో సమస్తమునందు అతనినే భావించుట అభ్యాస మగును- నారదుడట్లే చేసెను. బలి, అంబరీషుడు అట్లే చేసిరి. ప్రహ్లాదు డీవిషయమున అత్యుత్తమ శ్రేణి ప్రదర్శించినవాడు. భాగవతమూర్తు లందరు పై విధముగనే జీవనము సాగించిరి.

పై అభ్యాసమున జీవితమాగక సాగును. జగన్నాథుని రథము వలె సాగును. ఈ సమస్త సృష్టియే జగన్నాథుని రథము. అది సాగుచునే యున్నది. ఆగినచో అతనియందు లయమగును. అట్లే సాధకుని జీవనము సాగుచుండును. ఈ అభ్యాసము లేని జీవునికి జీవనము సాగక ఆగును. అనగా మరణించును. మరల మరల ప్రయత్నించుచు చిట్టచివరకు ఈ అభ్యాసమున చేరి ముక్తు డగును.

## MEDITATION - 26

(April 15, Aug. 28, Oct. 18, March 2)

Cure earth by food, cure water by drink,

Cure fire by heat, cure air by breath.

Cure sound by thought, cure mind by truth,

Cure is complete.

పదార్థమును అన్నముతో పవిత్రీకరించుము. నీటిని త్రాగుట ద్వారా పవిత్రీకరించుము. అగ్నిని వేడిమితో పవిత్రీకరించుము. గాలిని శ్వాసతో పవిత్రీకరించుము. శబ్దమును భావముతో పవిత్రీకరించుము. మనస్సును సత్యముతో పవిత్రీకరించుము. ఈ విధముగ పవిత్రీకరణము పరిపూర్ణ మగుచున్నది.

*వివరణము :*

పవిత్రమైన ఉపాధియే పవిత్రమైన కార్యములను నిర్వర్తించుటకు వినియోగ పడగలదు. పాత్ర శుద్ధి ముఖ్యము కదా! మానవ శరీరము, మానవునకు ఉపాధి లేక పాత్ర. ఈ ఉపాధిని ఆరు పొరలు గల ఉపాధిగ భావించవచ్చును. అందు మొదటిది దేహ పదార్థము. ఈ పదార్థము మనము భుజించు ఆహారముపై ఆధారపడి యున్నది. ఆహార పదార్థము పవిత్రముగ నున్నచో దేహ ధాతువులు కూడ పవిత్రముగ నుండును. పవిత్రతను కోరువారు మొట్టమొదటగ ఆహార విషయమున శ్రద్ధ వహించవలెను. కేవలము రుచి కొరకు భుజించువారికి దేహ పదార్థము ఆరోగ్యముగ వుండదు. ఉప్పు, పులుపు, కారము, తీపి, చేదు, వగరు తగుమాత్రముగ రుచికై వాడవలెను కాని మరియొక మార్గము ఆరోగ్యము నీయవు. అన్నము దేహమున కవసరము. రుచి మనసున కవసరము. సమగ్ర దేహ పోషణమునకై రుచియని తెలిసి భుజించుట వలన దేహ పదార్థము పవిత్రముగ నుండును. ఈ ప్రాథమిక విషయమున సగటు సాధకునకు శ్రద్ధ లేదు.

దేహమందలి రెండవ పొర నీటితో నిండియున్నది. పవిత్రమైన జలమును గ్రోలుట ప్రతి నిత్యము చేసినచో దేహమందలి మురికి నీరు బైటకు పారును. పారు నీటికి కల పవిత్రత నిలువ వున్న నీరుకు లేదు. శరీరంలో నీరు నిలువవుండుటకు మరియు రక్తము

పరిశుద్ధి యగుటకు కనీసము నాలుగు లీటర్ల నీరు త్రాగవలెనని ఆరోగ్య శాస్త్రము తెలుపుచున్నది. నీరు సమస్త జీవులను పవిత్రీ కరించ కలదని వేదము తెలుపుచున్నది. అందువలన జలముల నధికముగ గ్రోలవలెను. అట్లే స్నానము కూడ తరచూ (కనీసము రెండుమార్లు) చేయవలెను. ఇట్లాచరించినచో దేహము రెండవ పరి పవిత్రీకరింపబడును.

దేహమున వేడిమి అత్యవసరము. వేడిమి తగుమాత్రముగ నున్నచో ప్రాణము, తెలివి చురుకుగ పనిచేయగలవు. ఈ వేడిమినే వైశ్వానరాగ్ని అందురు. అది మనలోని నాలుగు ప్రాణములను అంటిపెట్టుకొని వున్నది (ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము.). ఈ వేడిమి దేహమునందు గల ఆహారమును, జలమును సమముగ పచనము చేసి దేహ పుష్టిని కలిగింప గలదు. ఇందులకు అంతర్ముఖముగ అగ్నిని ఆరాధించవలెను. అగ్ని ఆరాధన మనగ గాయత్రి ఉపాసనము, ప్రాణాయామము, సూర్య నమస్కార ములు ఇత్యాదులు. వీటి వలన వేడిమి పరిపుష్టముగ నుండి దేహమును ఆరోగ్యవంతముగ నుంచును. రోగములు దరి చేరవు.

శ్వాస ద్వారా నాలుగవ పొరయైన వాయువును పవిత్రీకరించు కొనవచ్చును. అప్పుడు దేహమున పంచ వాయువులు పవిత్రము లగును. వేడిమికూడ కలుగును. మృదువుగ దీర్ఘముగ నెమ్మదిగ లోతుగ మూడు శ్వాసలు గావించుము. విరామ మిచ్చుచు మరల

మూడు శ్వాసలు చొప్పున ప్రతి నిత్యము ఒకే ఆసనమున నిర్వర్తించు కొను వారికి పంచ శ్వాసలు పవిత్రీకరింపబడి, పంచ ప్రాణములు పరిపుష్టముగ నుండును. పంచ ఉపప్రాణములు కూడ పుష్టిగ నుండును. దేహము తేలికగ నుండును. దేహము బరువు సమముగ నుండును. హెచ్చుతగ్గు లుండవు.

మన శబ్దోచ్చారణము, భావ పవిత్రతను బట్టి వుండును. పవిత్రమగు భావములను ప్రయత్నముతో నేర్పరచుకొనవలెను. సద్గ్రంథ పఠనము, సత్పురుషుల సాన్నిధ్యము, సత్సంగీతము, సద్బోధా శ్రవణము అలవరచుకొనువారు ఉచ్చరించు శబ్దములు పవిత్రముగ నుండును. పవిత్రముగ భాషించువారికే ఐదవ పొర యందు ఆకాశ శరీరము పవిత్రముగ నుండును. ఈ పవిత్రతను చేరినవారే ఆకాశ శరీరమును పొందుట కర్హులు. ఇచ్చట తెలుప బడినది కేవలము మాట పవిత్రత కాదు. భావ పవిత్రత.

అటుపైన ఆరవ పొర యగు మనస్సు. ఇందు మానవ ప్రజ్ఞ స్థితిగొని యున్నది. మనో పవిత్రత కేవలము సత్యభాషణము వలననే కలుగును. ఇది చివరి మెట్టు. క్రింది ఐదు పొరలు పవిత్రీకరించు కొను వారికి సత్యసాధన సులభము. అట్లు కానిచో దుర్లభము. ఐదు పొరల పవిత్రత లేనప్పుడు వున్నది చూచుట కాక తాము చూచినదే వున్నది యనిపించు చుండును. ఇది మనో వికల్పము. ఒక సన్నివేశమును గమనించునపుడు దేహ పొరల పవిత్రతను

బట్టి ఎవరి అవగాహన వారికి కలుగుచున్నది. వారి వారి అవగాహన వారికి సత్యముగ కనిపించును. ఇట్టి వారు చూచుట యందు, వినుట యందు తరచూ పొరబడు చుందురు. కావున యథార్థ దృష్టి పొందుటకు దేహమందలి పదార్థము, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము పవిత్రీకరించుకోవలెను. అట్లు పవిత్రీకరించుకొన్నచో అపోహలు, అనుమానములు, అసూయలు, ఈర్ష్య, ద్వేషము క్రోధము, మోహము క్రమ్ముకొనవు. సత్యసాధన ద్వారా సత్య దర్శనము గావించుచు జీవించువారు సత్యవంతులై పరిపూర్ణులు కాగలరు.

## MEDITATION - 27

(April 16, Aug. 27, Oct. 19, March 1)

Up the ladder creeps the serpent. Self-opposing coils harmonised. Ascending the vertical bore of the eternal center.

సర్పము నిచ్చెనను ఎగబ్రాకు చున్నది. పరస్పర విరుద్ధ భావములు సమన్వయ మగుచున్నవి. నిలువుగొట్టములో నెగబ్రాకుచు శాశ్వత కేంద్రమును చేరుచున్నది.



*వివరణము :*

మానవ శరీర నిర్మాణము సృష్టి పరిపూర్ణతకు చిహ్నము. అందు సమస్త లోకములు వున్నవి. శిరస్సున ప్రజ్ఞాలోకము కలదు. ఉదర మందు శక్తి లోకములు కలవు. కుక్షియందు భూలోకము కలదు. ఇట్లు భూః, భువః, సువర్లోకములు మానవ శరీరమున నిక్షిప్తమై యున్నవి. అందు దైవమును కలదు. మూల ప్రకృతియు కలదు. జీవుడును కలడు.

దేవతా ప్రజ్ఞలు దిగివచ్చుటకు, మానవ ప్రజ్ఞలు దేవలోకము చేరుటకు మార్గము కలదు. ఊర్ధ్వము నుండి అధస్సునకు, అధస్సు నుండి ఊర్ధ్వమునకు అవరోహణ, ఆరోహణములు చేయుటకు మార్గమున్నది. ఈ మార్గమునే నిచ్చెన యందురు. ఈ నిచ్చెనకు ప్రధానముగ ఆరు మెట్లు కలవు (జీవుడుండు స్థితితో కలిపి ఏడు). వివరించుకొన్నచో అవి 49 మెట్లుగ కనపడును (7×7).

ఈ సమస్తమును దైవతత్త్వ మాధారముగ మూల ప్రకృతి నిర్మాణము చేయుచున్నది. దీనినే కుండలిని చైతన్య మని కూడ నందురు. దానిని సద్గ్రంథముల యందు పాముతో పోల్చిరి. ఈ చైతన్యము ఊర్ధ్వగతి చెందగలదు. అది ఊర్ధ్వముఖ మైనప్పుడు జీవుడు కూడ ఊర్ధ్వముఖు డగును. అధోముఖ మైనప్పుడు జీవుడు కూడ అధోముఖుడగును. ఈ సర్పము నిచ్చెన లెక్కుచున్నది యనగా మూల ప్రకృతి అనుగ్రహమున జీవుడు ఊర్ధ్వముఖు డగుచున్నాడని అర్థము.

జీవుడు ఊర్ధ్వముఖుడు అగుచున్నది కొలది, అతనియందు పరస్పర విరుద్ధ భావములు సమన్వయింపబడు చుండును. ఘర్షణ తగ్గుచుండును. సమస్తము తన అవగాహన యందు సమన్వయింప బడి ప్రశాంతత చిక్కును. జీవితమందు ద్వంద్వములు మెండుగ గోచరించును. అవియే ఘర్షణమునకు కారణము. చైతన్యవంతు డగుచున్నకొలది ఘర్షణ లేని జీవన ముండును. చైతన్యవంతుడగు చున్నాడనగా కుండలిని సర్పము నిచ్చెన ఎక్కుచున్నదనియే అర్థము. ఈ నిచ్చెన పరతత్త్వమను ఒక శాశ్వత కేంద్రము నుండి ఏర్పడినది. ఆ కేంద్రము నుండి మూల ప్రకృతి జనించి తన త్రిగుణములతో ఏడు మెట్ల నిచ్చెనలు తయారుచేసి జీవులను ప్రవేశపెట్టును. అవరోహణము చెందిన జీవులు మరల మూల ప్రకృతి అనుగ్రహము చేతనే ఆరోహణము కూడ చేయగలరు. అట్టి ఆరోహణమును ఈ ధ్యానము సూచించుచున్నది.

## MEDITATION - 28

(April 17, Aug. 26, Oct. 20, Feb. 28)

Loosening the spirals of Karma, the serpent shines winged and escapes through the bore of the Sun's body from above the eyebrows. Henceforth the serpent is the winged messenger of the Gods. He is Mercury.

కర్మ వృత్తములను వదులు చేసుకొనుచు సర్పము కాంతివంతమై ఊర్ధ్వగతి చెందుచు, ఎగురుచు సూర్య దేహమునందలి గొట్టము ద్వారా భ్రూమధ్యము నుండి విముక్తి నొందు చున్నది. అప్పటి నుండి రెక్కలు గల దివ్య సర్పమై దైవదూత యగు చున్నది. దైవ దూతలకు దైవదూత నారద మహర్షి.

*వివరణము :*

కర్మ వృత్తములు అసంఖ్యాకములు. కామ్యకర్మ ఈ వృత్తముల నేర్పరచు చుండును. అవియే జీవుని జన్మల తరబడి బంధించును. బంధింప పడ్డ జీవుడు బంధ విముక్తిని కోరును. కొన్ని జన్మలకు బంధ విముక్తికి సూత్రము నిష్కామ కర్మ, పరహితము అని తెలియును. అట్టి తెలిసినవానికి స్ఫూర్తి నిచ్చుటకు నిష్కామ కర్మము, పరహితము నిర్వర్తించు ఆచార్యుని దర్శనమగును. అతడాచరించి చూపుట వలన మార్గము సుగమ మగును. స్ఫూర్తి నందిన జీవుడు పై రెండు సూత్రముల నాధారముగ జీవించుట వలన కర్మ వృత్తముల బంధము వదలుచుండును. తత్కారణముగ జీవ చైతన్యము బ్రహ్మదండమున సుషుమ్న నాడి నాధారముగ గొని ఊర్ధ్వగతి చెందుచు కాంతివంత మగును. సూర్య దేహము యొక్క గొట్టమనగా మానవ దేహమందలి బ్రహ్మదండమే. అది ఆజ్ఞ నుండి మూలాధారము వరకు గల వెన్నెముక యందు యున్నది. ఆ దండమందు కుడి ఎడమలగ పింగళ, ఇడ నాడులు గలవు. వాటి మధ్యమున నిట్ట నిలువుగ సుషుమ్న నాడి కలదు. అందు సన్నని దారమువలె చిత్రిణి నాడి కలదు. ఈ నాడియందే చైతన్యము ఎగబ్రాకును. ఎగబ్రాకు చైతన్యమును కుండలిని చైతన్యమని, కుండలిని సర్పమని తెలుపుదురు. ఇది ఊర్ధ్వగతి చెందుటకు హఠ యోగము, రాజయోగము భరతదేశమున ముఖ్య విద్యలుగ ఏర్పరచిరి. ఇవి ఋషు లందించిన ఉత్తమోత్తమ విద్యలు.

ఇందు రాజవిద్యా మార్గమున కర్మ నిష్కామము గావించుకొనుట, పరహితమే జీవితముగ నేర్పరచుకొనుట, సంకల్పములను సన్య సించుట, దివ్యత్వమును భ్రూమధ్యముపైన ధ్యానము చేయుట తెలుపుదురు. భగవద్గీతయందు శ్రీకృష్ణుడు ఈ యోగమునే అందించి నాడు. హఠయోగము కాని రాజయోగము కాని గురు ముఖముగ సులభముగ నేర్వవచ్చును.

పై విధముగ క్రమశః కర్మబంధములు శిథిల మగుచుండగ జీవచైతన్యము ఊర్ధ్వగతి చెందుచూ నుండును. ఊర్ధ్వగతి చెందుచు నుండగ కాంతి పెరుగును. చైతన్యము భ్రూమధ్యము నుండి కూడ ఊర్ధ్వగతి చెందుటయే గొట్టము నుండి బయలు వెడలుట. అపుడు జీవుడు దేవతల వలె చతుర్భుజుడగును. ఆకాశమున సంచారము చేయగలుగును. క్రొత్తగ ఏర్పడిన రెండు భుజములు రెండు రెక్కలవలె గోచరించును. గొట్టములో నున్నప్పుడు అది సర్పమని, గొట్టము నుండి బయల్వెడలినపుడు అది రెక్కలు గల దివ్య సర్పమని ధ్యానము తెలియజేయుటలో గల అర్థమిదియే.

అట్లు దివ్యత్వము చెందిన జీవుడు దైవదూత యగును. అనగా దివ్య ప్రణాళికలో భాగముగ దేవతల వలెనే తానును పనిచేయును. అట్టివారే యోగులు, సిద్ధులు, ఋషులు, మహర్షులు, రాజర్షులు, బ్రహ్మర్షులు వీరందరియందు బుధ చైతన్యము పనిచేయు చున్నది. గ్రహములలో బుధుడు తటస్థుడు. దైవదూత.

సృష్టిలో అట్టి వారందరికిని తలమానికమగు దైవదూత నారద మహర్షి. అతనిని బుధుడని కూడ సంకేతింతురు. అతడు దైవదూత లకు కూడ దూత. నారదుని అనుగ్రహము వలననే జీవుడు తుది మెట్టును కూడ అధిరోహించి బ్రహ్మము కాగలడు. అనగా ముక్తుడు కాగలడు. వాల్మీకి, వ్యాసుడు, ప్రహ్లాదుడు, ధృవుడు, అంబరీషుడు మొదలగు అసంఖ్యాకములగు భాగవతమూర్తులకు తుది నుపదేశము కావించిన త్రైలోక్య గురువు నారద మహర్షి.

## MEDITATION - 29

(April 18, Aug. 25, Oct. 21, Feb. 27)

The tongues of the serpent are raised from the stings of the scorpion. The tongues of the serpent are the wings of the eagle. Moon bears serpents. Sun enters eagle.

సర్పము నాలుకలు తేలు కుట్టు స్వభావము నుండి ఉద్ధరింపబడినవి. సర్పము నాలుకలు గరుత్మంతుని రెక్కలైనవి. చంద్రుడు సర్పములను ధరించును. సూర్యుడు గరుత్మంతుని యందు ప్రవేశించును.



*వివరణము :*

పాశవిక తత్త్వము గల మానవుడు తేలువలె కుట్టుచు విషము గ్రక్కును. అతని మాటలు, చేష్టలు ఇతరులను తీవ్రముగ బాధించును. సన్మార్గము ననుసరించి సత్సాధన చేయు మానవుని యందు క్రమశః పుట్టుట, కాటు వేయుట వంటి ప్రవర్తన నుండి బయల్వెడలును. సాధన తీవ్రమగు కొలది, విషము గ్రక్కు సర్పము నాలుకలు మార్పు చెంది గరుత్మంతుని రెక్కలవలె మారును. అనగా తన ప్రవర్తనను భాషణముల యందు మార్పు కలిగి అవి తనను ఉద్ధరించు సాధనములుగ మారును. ఏ మానవుడైనను అతని మాట, చేత, శ్రద్ధాభక్తులతో ఉద్ధరించుకొన్నచో అవి తిరిగి అతని ఉద్ధరించగలవు. అనగా మాట, చేత అధమ స్థితిలో పాము నాలుకల వలె పనిచేయగ ఉత్తమ స్థితిలో అవియే రెక్కలై జీవుని ఉత్తమోత్తమ స్థితికి చేర్చగలవు. సాధారణ సర్పము ఈ విధముగ రెక్కలు గల దివ్యసర్ప మగుచున్నది. గొంగళిపురుగు సీతాకోకచిలుక అగుచున్నది. కుట్టుట, కాటు వేయుట అను స్వభావములకు తేలు, సర్పము సంకేతములు. రెక్కలు గల పక్షులు, ఎగురగల సీతాకోకచిలుకలు దివ్యత్వమునకు సంకేతములు.

మానవ చైతన్యము ఉదర వితానమునకు క్రిందుగ మణి పూరకము నందు, స్వాధిష్ఠానము నందు, మూలాధార మందు స్థితి గొన్నచో, అట్టి మానవుడు మనసునకు లోబడి ప్రవర్తించును. మనస్సు తనకేమి కావలయునో తెలుపును, తన అవసరములు

తెలుపును. స్వార్థ చింతనము, దేహ పోషణము దాని స్వభావము. తన శ్రేయస్సుకై ఇతరులను హింసించుట, దుఃఖపెట్టుట మన యందలి మనసే చేయుచున్నది. ఇచట మనసనగా మన స్వభావము. మనయందలి చంద్రుడు. అందువలన చంద్రుని యందు పాములు గలవని చంద్రుడు పాములను ధరించునని ఈ ధ్యానము సంకేతించు చున్నది.

ఉదర వితానమునకు పైనగల కేంద్రములలో మానవ చైతన్యము స్థితి గొన్నచో అతడందరి శ్రేయస్సును ఆలోచించును. తన శ్రేయస్సు కన్న ఇతరుల శ్రేయస్సు ముఖ్యమని భావించును. పరహితమే జీవనముగ ఆచరించును. అట్టివాడు క్రమముగ ప్రపంచ బంధముల నుండి విముక్తుడగుచు, గరుడ పక్షివలె ప్రపంచమున కతీతముగ నుండుచు, ప్రపంచమున కుపయోగ పడుచుండును. అట్టి వానియందు ఆత్మస్థితి గొనును, నడిపించును. సూర్యుడు గరుడుని చేరుటగా దీనిని, ధ్యానము తెలుపుచున్నది.

ముందు తెలుపబడిన ధ్యానములలో దేహమున గల గొట్టము, నిచ్చెన తెలుపబడినవి. జీవప్రజ్ఞ గొట్టమున కడుగున వున్నప్పుడు జీవ స్వభావము విషజంతువులవలె నుండును. అటుపైన పశు స్వభావము, మానవ స్వభావము, దివ్య స్వభావము, గొట్టములో ఊర్ధ్వముగ పెరుగుతున్నకొలది ఏర్పడుచుండును. అట్లేర్పడుటకు వలసిన రెండు ముఖ్య పరికరములు సంస్కార యుతమగు మాట, చేత అని తెలియవలెను.

## MEDITATION - 30

(April 19, Aug. 24, Oct. 22, Feb. 26)

The path of I AM is in eternal darkness. Darkness is the variegated serpent of the nether worlds. The music of the nether worlds blinds the lyre with music of the seven stringed lyre of Apollo. I bore the darkness into the spectrum of variegated light.

జీవుని అన్వేషణ మార్గము ఈ ప్రపంచమున అంతము లేని చీకటిగ గోచరించును. ప్రపంచమున ఈ చీకటి అంతర్హితముగ చిత్రవిచిత్రములతో కాల సర్పముచే అల్లబడియున్నది. సప్తతంతువైన దివ్యసృష్టి సప్తతంతువైన కాల స్వభావపు ఆకర్షణలచే కప్పబడి యున్నది. ఈ కాలమను సర్పమును అవగాహన చేసుకొని సప్త వర్ణముల దివ్య సృష్టిలోనికి చొచ్చుకొని పోయెదను.

*వివరణము :*

సృష్టియందలి జీవుని ప్రయాణము అగమ్య గోచరము. అది మాయా బద్ధము. అజ్ఞాన పూరితము. అజ్ఞానమే చీకటి. అజ్ఞానము వలన జీవుడు అనేకానేక మోహములు చెందుచుండును. భ్రమలు భ్రాంతులు పొందుచుండును. సృష్టివింతలు ఇంత అంత అని తెలుపలేము. అందెప్పుడును అనుభవింపవలసినవి మెండుగ కనిపించును. అనుభవించినపుడు తాత్కాలిక తృప్తియే కాని శాశ్వత మగు పరితృప్తి యుండదు. పొందిన తృప్తి భ్రాంతివలె మాయమై మరల కోరికను పుట్టించు చున్నవి. మరల కోరిక కలిగించు తృప్తి తాత్కాలికమే కదా! పంచేంద్రియములు, మనస్సు ఎండమావుల వంటి భ్రాంతి మయమగు అసంఖ్యాక విషయముల యందు జన్మల తరబడి ఇట్లు జీవుని మోహమున బంధించును.

ఇది యంతయు కాలము రూపమున ప్రకృతి ఏర్పరచిన ఇంద్రజాలము. ఈ ఇంద్రజాలమునకు ఆధారము చైతన్యమే. అది మూల ప్రకృతి. దానికాధారము అవ్యక్తమగు తత్త్వము. ఇట్లు తత్త్వము నాధారముగ మూల ప్రకృతి చైతన్యపుటల్లిక ఒకటి ఏర్పరచును. దీనిని మంద్రజాల మందురు. ఇది ఆధారముగ ఇంద్రజాలపు సృష్టి ఏర్పడుచున్నది. కావున జ్ఞానమను దీపముచో జీవుడు తెర తొలగింపు చేసుకొనుటయే ఈ ధ్యానమందిచ్చిన హెచ్చరిక. ఇందు తెలుపబడిన ఆకర్షణలే ప్రపంచ మందలి ఆకర్షణీయమగు సంగీతము.

అది దివ్య పురుషుని సప్త తంతువుల వీణాగానమును మరపించుచున్నది అని తెలుపబడినది. దివ్య పురుషుని అవతారమును 'అపోలోగ' గ్రీకు దేశస్థులు ఆరాధింతురు. అతడెప్పుడును ఏడు తంతువుల వీణ (Lyre) నొకదానిని ప్రయోగించు చుండెడివాడు. అంతకు పూర్వము దివ్యపురుషుడు శ్రీకృష్ణుడుగ అవతరించినప్పుడు కూడ సప్త రంధ్రములతో కూడిన వేణువుతో జీవులను మంత్ర జాలములోనికి ఆకర్షించినాడు కదా! అట్టి సప్త తంతువుల దివ్య జ్ఞానమునకు ఉన్ముఖమైనవారు ఇంద్రజాలము నుండి తరించి మంత్రజాల మార్గమున దివ్య వైభవమునందు నిలిచిరి కదా! కనబడు సృష్టియందలి దివ్యత్వమును దర్శించుటయే మంత్రజాల మార్గమని తెలిసి అట్లు దర్శించుట అభ్యాసము చేయుటయే ఈ ధ్యాన మందించు సుళువు.

## MEDITATION - 31

(April 20, Aug. 23, Oct. 23, Feb. 25)

Vena, the Gandharva, is wiping off the pictures of the subconscious mind on the walls of my nature with the hieroglyphs of sounds from his seven stringed lyre.

వేనుడను గంధర్వరాజు తన సప్తతంతువైన వీణ నుండి సప్త సంకేతములుగ గాంధర్వ శబ్దములను గావించుచు చిత్తము నంటి పెట్టుకొని వున్న కర్మవాసనల సమస్తమును తుడిచివేయు చున్నాడు.

*వివరణము :*

గంధర్వులు సృష్టికతీతమైన సంగీత ప్రజ్ఞులు. గంధర్వ గానము జీవులను సృష్టికతీతమైన ముక్తస్థితికి చేర్చగలదు. ఈ గాన మందరికిని వినపడదు. సృష్టియం దీగానము నుపదేశించువాడు సద్గురువు నారదు డొక్కడే. (నారదుని గూర్చి ముందు తెలుపబడిన ధ్యానము లలో కొంత అవగాహన ఇవ్వబడినది.)

వేనుడను గంధర్వరాజు జననమరణ మార్గమున కధిపతి. అనగా మరణము నుండి జననమునకు గల దారి తెలిసినవాడు. నిద్ర నుండి మెలకువకు గల దారి తెలిసినవాడు. ప్రళయము నుండి సృష్టికి గల దారి తెలిసినవాడు. ఈ దారి పరమ రహస్యము. ఇది తెలిసినవాడు సమస్తమును తెలిసిన వాడగును.

జనన మరణము లన్నియును జీవుని కర్మానుగుణముగ జరుగుచున్నవి. ఈ కర్మవాసన లన్నియు జీవుని చిత్తము నంటి పెట్టుకొని యుండి జీవుని స్వభావముగ సన్నివేశముల యందు, జీవుని వశపరచుకొని ప్రవర్తించు చుండును. అనగా వానిపై జీవునికి స్వామిత్వము లేదు. కర్మవాసనా బలము జీవుని కన్న బలమైనది. అందువలననే జీవుడు తనను తాను నియమించు కొనలేడు. తన ప్రవర్తనముపై తాను స్వామిత్వము పొందలేడు. కావున స్వామిత్వము కలవా డెవడైనను సహాయము చేయవలెను. అట్టి సహాయకుని సద్గురువని పిలుతురు. సద్గురు వనగా వేనుని అనుగ్రహింప చేసుకొనినవాడు. అందుచేత జనన మరణములు అతడి అధీనమున నుండును. అనగా వేనుని సహకార ముండును. సద్గురువు

అనుగ్రహించినచో అట్టి జీవునికి మరణ భయము లేదు. కర్మవాసనలు లేవు. అతని అనుగ్రహ విశేషమున కరుగ గలవు. ఈ కార్యమును వేనుడే నిర్వర్తించు చున్నాడు. అతనికి సద్గురువు ఒక వాహిక.

వేనుని ప్రజ్ఞ మన దేహమున సహస్రారము నుండి ఆజ్ఞా కేంద్రము వరకు వ్యాపించి యున్నది. ఆజ్ఞ నుండి మూలాధారము వరకు సుషుమ్న మార్గమున ఆ ప్రజ్ఞ ప్రసారము కాగలదు. ఇట్లు ఏడు కేంద్రముల యందు వేనుని ప్రజ్ఞా ప్రసారము జరిగినచో సప్త కేంద్రములు మేల్కాంచి వేనుని గంధర్వ గానమునకు ఉన్ముఖమై తేజరిల్లును. సప్త కేంద్రముల ద్వారా ప్రసరించు వేనుని ప్రజ్ఞ జీవుని యందు వివిధ కేంద్రములలో నున్న వాసన లన్నింటిని తుడిచి పెట్టి వేయును.

సహస్రారము నుండి ఆజ్ఞకు గల వేనుని మార్గము మానవ దేహమున కుంభరాశి భావముగ తెలుపబడినది. ఈ రాశి భావమున కధిపతి వరుణుడు. అందుచేత మహా భారతమున వేదవ్యాస, మహర్షి "వేన" అనునది వరుణుని రాజ ప్రసాదమున నున్నదని తెలిపిరి. ఈ నదీ ప్రదేశమున త్రిరాత్రములు ఉపవసించినచో పరమ పదమునకు జీవుడు చనగలడని కూడ తెలిపినాడు. ఉదయము, సాయంత్రము ఈ నదీ ప్రవాహమును స్మరించుట సర్వ శ్రేయో దాయక మని కూడ అనుశాసన పర్వమున తెలిపినాడు.

ఈ ప్రవాహమునే పరమగురువు మాస్టరు సి.వి.వి. మరియొక మారు జీవులకు సంతర్పణము గావించుటకై అవతరించినారని తెలిసినవారికి తెలియును.

## MEDITATION 32

(April 21, Aug. 22, Oct. 24, Feb. 24)

Serpent ‘K’ loosens its skin. The pictures of past Karma on the walls of its skin are peeled off. Karma neutralised.

కాల సర్పము తన పొలుసులను వదులు చేయుచున్నది. పూర్వ కర్మపు వాసనలుగ నున్న పొలుసు వలువబడు చున్నది. కర్మము పరిష్కరింపబడినది.

*వివరణము :*

కాలము రూపమున జీవుని సంచిత ప్రారబ్ధకర్మ దేహము నంటిపెట్టుకొని యుండును. కర్మ వాసనలతో కూడిన దేహము జీవుని బంధించును. కాలము రూపమున కర్మ మనుభవింపబడు చుండును. పూర్వకర్మానుభవము నిచ్చు కాలమునే కాల సర్ప మందురు. అది తరచూ కాటు వేయుచుండును. అనగా బాధించు చుండును. దీనిని cronos (క్రోనోస్) అను సర్పముగా గ్రీకులు పలికిరి. దీని పొలుసు అత్యంత బలమైనది. సులభముగ ఈ పొలుసు వదలదు. కర్మానుభవముననే ఇది క్రమముగ వదులగుచు పూర్తిగ అనుభవించినపుడు వదలబడును.

సర్పము పొలుసు వంటిదే మానవుని దేహము. అది వదలక జీవుని బంధించు చుండును. కర్మగుడైన జీవుడు మరణించినను దేహాత్మ భావనచే మరల మరల దేహమును పొందుచుండును. దేహబంధము. కర్మము పరిష్కరింపబడునంత వరకు తప్పదు. నిష్కామముగ కర్మము నిర్వర్తించుట నేర్చి ఆగామి కర్మను పరిష్కరించుకొనవచ్చును. దైవమును, గురువును ఆశ్రయించి సంచిత కర్మమును పరిష్కరించుకొన వచ్చును. ప్రారబ్ధ కర్మము మాత్రము అనుభవింపవలసినదే. పై విధముగ కర్మ పరిష్కరింపబడి నప్పుడే దేహబంధము వదలి విదేహుడు కాగలడు. విదేహునకు కర్మ బంధము లేదు. అతని కర్మము దివ్యమై వర్తించును.

సర్పము లన్నియు తమ తమ పొలుసులను వదలలేవు. అట్లే మానవు లందరును విదేహులు కాలేరు. కారణము కామమే. అనగ స్వార్థ చింతన. తన కొరకు జీవించుట. దీని నుండి బయల్ప డుటకే భగవంతుడు, కర్మము నిష్కామము కావలెనని బోధించి నాడు. కర్మము నిష్కామమైనపుడు పొలుసు వదులుటకు వీలగును.

నాగుపాము పొలుసులను వదులుచున్నది. అందువలననే దానిని దివ్య సర్పముగ గుర్తించిరి. సర్పములు వేరు, నాగులు వేరు. సర్పములు సామాన్య జీవులవంటి వారు. నాగులు శుద్ధ పురుషులవంటి వారు. సర్పదేహము సర్పమును బంధించును. నాగ దేహము నాగును బంధించదు. అది పొలుసు వదిలినపుడు కాంతివంతమగు దేహము కన్పట్టును. సిద్ధపురుషుడు కూడ అట్టి కాంతివంతమగు దేహము ధరించి యుండును. కర్మము నందు జీవునికి గల దృష్టియే ఈ వ్యత్యాసమును కలిగించుచున్నది.

ఈ ధ్యానము పూర్వకర్మ వాసనలను గుర్తించి దైవ బలముతో తొలగించుకొనుటకై ఈయబడినది.

## MEDITATION - 33

(April 22, Aug. 21, Oct. 25, Feb.23)

Karma is neither postponed nor purged but neutralised.

కర్మమును హరించుటయే కాని, దానిని వాయిదా వేయుట కాని, త్వరితముగ అనుభవింపచేయుట కాని కాదు.

*వివరణము :*

ఈ ధ్యానము అగస్త్యాంశ సంభూతులైన మాస్టర్ సి.వి.వి. గారు అందించినారు. ఇది భృక్తరహిత తారక రాజయోగమని వారు తెల్పిరి. నూతన యోగమని కూడ తెలిపిరి. ఇందలి నూతనత్వము సంప్రదాయబద్ధులగు పండితులకు అవగాహన కాదు. దివ్య సంకల్పముగ మానవ జాతిని త్వరిత గతిని పరిణామము గావించి తరింపు నిచ్చుటకు ఊర్ధ్వ లోకముల నుండి ఈ కాలమున దిగివచ్చిన యోగమిది. ప్రాచీన సిద్ధాంతములకు కొంత భిన్నముగ నుండుటచే దీనిని పండితులు, సంప్రదాయవాదులు అంగీకరింపరు. సృష్టి దైవవశమున నడచు చుండును. దైవమే జీవుల ననుగ్రహింప సంకల్పించినచో అవరోధము లేమి యుండును? అనుగ్రహమునకు తీరుతెన్నులు లేవు. అనుగ్రహింపబడిన వాడు త్వరితముగ పరిణతి చెందునని సద్గ్రంథములు తెలుపుచునే యున్నవి. అయినను అంగీకరింపనివారు మూర్ఖులు.

కర్మము అనుభవింపవలసినదే అనునది సాధారణ సత్యము. అనుగ్రహింపబడినవాడు దైవవశమున కర్మమును విచిత్రముగ దాట గలడు. కుంటివాడు పరిగెత్తుట గ్రుడ్డివాడు చూచుట, గొడ్రాలు గర్భిణియై ప్రసవించుట ఇత్యాదివి దైవానుగ్రహమునకు తార్కాణ ములు. దైవము అనుగ్రహించుటకు కూడ ఆంక్షలు పెట్టువారు కలరు. వారి నందరిని త్రోసిపుచ్చి దైవము అనుగ్రహించుట కోకొల్ల లుగ జరిగినవి.

దైవము తన సాన్నిధ్యము నిచ్చినచో ఇనుము అయస్కాంతముగ మారినట్లుగ జీవుడు ఉత్తమ పరిణామము పొందగలడు. "నా సాన్నిధ్యమున నిలువుము. నిన్ను పాపముల నుండి రక్షించి, విడిపించి ముక్తస్థితి యందుంచుదును." అనునది భగవంతుని వాగ్దానము. అట్టి సాన్నిధ్యమును మరల గొనివచ్చి సంతర్పణము చేసిన మహర్షి మాస్టరు సి.వి.వి. దివ్య ప్రణాళికలో భాగముగ ఇది జరిగినది. వారు మరల అందించినది కూడ సాన్నిధ్య మార్గమే.

"ప్రతి ఉదయము, సాయంత్రము నన్ను నీ లోపలికి ఆహ్వానించుకొనుము. నా సాన్నిధ్యమున నిలచి నాకు సమర్పణముగ కార్యము లన్నియు చేయుము. నీ కర్మమును నేను సరిదిద్ది, నిన్ను విదేహుని గావింపగలను. నీవు పొందు కష్ట సుఖములు నేనే అందించు చున్నానని భావింపుము. నా యందు నీ మనస్సు అర్పించి జీవింపుము. కర్మము, నీ కర్మమును వాయిదా వేయను. అట్లని ప్రస్తుతమునకు గొనివచ్చి ఇబ్బంది కలుగజేయను. దానిని నేను హరింతును." అని వాగ్దానము చేసినారు.

పై మహా వాక్యములు సంప్రదాయబద్ధులైన జీవులు నమ్ముటకు శక్యము కాదు. అందువలన మాస్టరుగారు "మీకా నమ్మకమును కలిగించువాడను కూడ నేనే" అని పలికినారు. వారందించిన కర్మహరణ మార్గము. భృక్తరహిత తారక రాజయోగము.

## MEDITATION - 34

(April 23, Aug. 20, Oct. 26, Feb. 22)

Wash Karma in space. On the deep blue slate paint ever-elevating colours, ever at the feet of the Master in the Vaishakha valley.

నిశీధి నీలమున కర్మమును కడుగుము. నీలమగు మనోఫలకముపై ఉత్తమము, ఊర్ధ్వము అగు రంగులను చిత్రీకరించుము. పై సమస్తమును వైశాఖలోయ యందలి పరమగురువు పాద పద్మముల సాన్నిధ్యమున నిర్వర్తించుకొనుము.



*వివరణము :*

పూర్వ కర్మము వాసనా రూపమున జీవుని చిత్తము నంటి పెట్టుకొని యుండును. కాలము, దేశము ననుసరించి సన్నివేశము లందు కర్మ వాసనా విత్తనములు జీవుని ప్రేరేపించి స్వభావపరమైన కర్మమును నిర్వర్తింప చేయును. జీవుడు వివశుడై తెలిసియు స్వభావమున చిక్కుపడును. మాట, చేతలలో తొందరపాటు, వంకర తనకు తెలిసియే నిర్వర్తించు చుండును. కోపము రాకూడదను కున్నను వచ్చుచుండును. అసూయ రాకూడ దనుకున్నను వచ్చు చుండును. చిరాకు పడుట, నిరాశ నిస్పృహలు, భయము ఇత్యాది వన్నియు బలవత్తరముగ జీవునిచే నిర్వర్తింపబడు చుండును. తెలిసియు ఇట్లే ప్రవర్తించితినే అని పలుమార్లు అంతరంగమున బాధ పడుచుండును. దీనికి కారణము తనకన్న తన స్వభావమునకు బలమెక్కువ అగుటయే.

పై స్థితి నుండి సాధకుడు ఉద్ధరింపబడుటకు చిత్తమునకు బల మేర్పడవలెను. అది కర్మాధీనము కాక దైవాధీనము గావలెను. అనగా స్వభావము కాక బుద్ధి పనిచేయవలెను. అట్లు జరుగుటకు ఉత్తమమగు రంగులను ధ్యానించుటొక మార్గము. ముత్యములు, రత్నములతో పొదగబడిన బంగారుకాంతులీను ఆభరణములను ధరించిన శుభమూర్తిని ధ్యానించుట. ఇందులకే గాయత్రి ధ్యానమున కూడ ఇది సూచింపబడినది.

ముక్త (ముత్యము రంగు), విద్రుమ (ఎరుపు), హేమ (బంగారు రంగు), నీల (నీలము), ధవళ (తెలుపు, ఈ పంచ వర్ణము లను ధ్యానించుట తెలుపబడినది. అట్లే శ్రీరాముని, శ్రీకృష్ణుని, విష్ణుమూర్తిని నీలకాంతులతో తేజరిల్లుతున్నట్లుగ ధ్యానించుట తెలుపబడినది. శివుని తెలుపుగను, పార్వతిని పసుపుగను, లక్ష్మిని బంగారు రంగుగను ధ్యానింపమని తెలిపిరి. పూజా సమయమున పసుపు, కుంకుమ, అక్షతలు మరియు ఉత్తమ వర్ణముగల పుష్ప ములు వాడుట సంప్రదాయముగ నిచ్చిరి.

గులాబి రంగు, సిందూరము, బంగారము, నీలము, తెలుపు వర్ణములను ధ్యానించు చిత్తమునకు మొదట ఉపశమనము కలుగును. అటుపైన చిత్తము భౌతిక విషయముల నుండి సూక్ష్మలోకములలోనికి తరలింపబడును. దివ్య దర్శనములు, దివ్యానుభూతులు కలుగును. భౌతికమును తగులుకొనుట తగ్గును. సూక్ష్మమున ప్రవేశించుట పెరుగును. నిశీధి నీలమున స్థిరపడుట జరుగును. అట్టివాని చిత్తమును పూర్వకర్మము సులభముగ ప్రేరేపింపలేదు. వర్ణముల ధ్యానముచే బలపడిన బుద్ధి స్వభావము నుండి కలుగు ప్రేరణలను చాలవరకు అదుపు చేయును.

పై ప్రయత్నమును ధ్యాన రూపమున చేయుచున్నప్పుడు, తానొక ప్రశాంత ప్రదేశమున నున్నట్లు భావించుట వలన పరిసర భావముల నుండి చిత్తము విడివడును. అటుపైన తాను నమ్మిన

సద్గురువు పాదపద్మముల సాన్నిధ్యమున నున్నట్లు భావించినచో పరిసర, సమకాలిక భావముల ప్రభావము తగ్గును.

ఈ విధముగ ఈ ధ్యానమున మూడు రహస్యములు తెలుపబడినవి.

1. తాను పుణ్య ప్రదేశమున నున్నట్లు భావించుట (పుణ్య నదీతీరము, పుణ్య పర్వత శిఖరము, పుణ్యవనము).
2. సద్గురువు చరణ సన్నిధిని వున్నట్లు భావించుట.
3. ఉత్తమ వర్ణములను ధ్యానించుట.

పై మార్గమున చిత్తము ఊర్ధ్వమగును. అనగా స్థూలము నుండి సూక్ష్మమునకు చేరును.

## MEDITATION - 35

(April 24, Aug. 19, Oct. 27, Feb. 21)

The imprints of subterranean caves of your consciousness are illuminated by the heartful colours of Kundalini at the feet of the Master. Elevate yourself in the presence of the Master with the colours of the seven-fold wings of the serpent. Nothing is impossible to you. Sinning is impossible to you. Sin is your shadow, lead it into the beam of the light of the Guru. Namaskarams. Verily, verily we are in you.

పరమ గురువు పాదపద్మముల సాన్నిధ్యమున నీ అంతరంగమున గల గుహలలోని మహా చైతన్యనము నెరిగింప బడినదై హృద్యమగు కుండలిని చైతన్యము దివ్యకాంతులను వెదజల్లుచున్నది. పరమగురువు సాన్నిధ్యమున సప్త వర్ణపు రెక్కలతో కలిగిన కుండలినీ సర్పము ద్వారా నిన్ను నీవు ఉద్ధరించుకొనుము. నీకసాధ్య మనునది లేదు. నీవిక పాపము లను చేయలేవు. అది నీడయై నిలచును. దానిని పరమ గురువు వెలుగు లోనికి గొనిరమ్ము. నమస్కారములు. నీయందు నిజముగ మేమున్నాము.

*వివరణము :*

ఈ ధ్యానము ప్రశస్తమైన ధ్యానము. జీవుని ఇంద్రియ ప్రవృత్తులు, చిత్తము, స్వభావము దాటి లోలోపల శుద్ధ చైతన్య మున్నది. అదియే మనో ప్రవృత్తుల కాధారము. సద్గురు పాదస్పర్శ వలన ఈ శుద్ధ చైతన్యము వెలిగింపబడి కుండలినీ శక్తి మేల్కాంచుట జరుగును. సద్గురువు ఒక జ్యోతివంటి వాడు. అతడు సాధకుని హృదయాంతరాళాలలో కల చైతన్యమును స్పృశించగలడు. అట్లు స్పృశించుటచే జీవచైతన్యము కూడ వెలిగింపబడును. తత్కారణ ముగ హృద్యమగు (ఆకర్షణీయమగు) రంగులతో కుండలిని మేల్కొంచి ఊర్ధ్వగతి చెందుచుండును. దాని ననుసరించిన జీవుడు కూడ ఊర్ధ్వగతి చెందగలడు. ఈ ఊర్ధ్వ మార్గమున ఏడు కేంద్రములు కలవు. ఒక్కొక్క కేంద్రమును స్పృశించుచు కుండలిని చైతన్యము ముందుకు సాగుచుండగ కేంద్రమందలి చక్రములు పద్మములై వికశించును. అవి కుండలిని అను సర్పమునకు గల రెక్కలవలె భాసించును.

సద్గురువు పాదస్పర్శ కుండలినీ చైతన్య ఉద్బోధము లభించిన సాధకులకు అసాధ్య మనునది యుండదు. సర్వము సుసాధ్యమే. అతనిని పాప మంటదు. కాని నీడవలె వెంట యుండును. ఆత్మ పరిశీలన మార్గమున దానిని గమనించి సద్గురువు అను వెలుగునకు సమర్పణ చేసినచో క్రమశః పాపము దగ్ధము కాగలదు. సద్గురువు

సాన్నిధ్యమున నిలచిన సమయమున పాప భావములు జనింపక వేచియుండును. కాని నశింపవు. అవి నశింపవలె నన్నచో జీవుడు ఆత్మపరిశీలన మార్గమున వానిని గుర్తించి సద్గురువునకు సమర్పణ చేయవలెను. గురు కృపచే పాపములు త్వరితముగ నశింపగలవు.

పై మార్గమున జీవించు సాధకునకు క్రమశః మనో బుధ్యహంకారములు జీవ చైతన్యమున లీనమగును. అపుడు జీవుడు చేయు నమస్కారము సిద్ధించినట్లు లెక్క. అపు డతనియందు దైవము, గురువు శక్తి నిండి యున్నవి. అతడు వారి యందుండును.

## MEDITATION - 36

(April 25, Aug. 18, Oct. 28, Feb. 20)

A serpent sits in lotus. Lotus dances on ripples of the waters of life. Nara is water, Nari is serpent, Narayana is the Master.

సర్పము కమల మందున్నది. కమలము జీవజలముల తరంగములపై నాట్యమాడు చున్నది. జీవజలములే నారములు. సర్పము నారి. నారాయణుడు సర్పమునకు స్వామి.

*వివరణము :*

నారాయణు డనగా జలముల మార్గము. అవి ఊర్ధ్వ ముఖముగను, అధోముఖముగను యానము చేయును. జీవ జలములను నారము లందురు. జీవజలముల ఉత్తరాయణ, దక్షిణాయన పథముల నడిపించు స్వామి నారాయణుడు. నారముల బిందువులే నరులు లేక జీవులు. నరులనగా నశింపనివారని కూడ అర్థము. జీవజలములు జీవచైతన్యము కూడ. అది మహా చైతన్యము. నారాయణుడు మహా చైతన్యమును నడిపించుటయే జీవన తరంగములు. అందు ఉద్భవించునది సృష్టి. అదియే కమలము. సృష్టి కతీతమగు మహా చైతన్యము సృష్టియందు కాల స్వరూపముగ ఇమిడి యున్నది. అదియే కమల మందలి సర్పము.

పై విషయముల వలన ఈ క్రింది విధముగ విశదపరుచుకొన వచ్చును. సృష్టియందలి కాలము పద్మమందలి సర్పము. పద్మము సృష్టి పద్మము. మహా చైతన్యము తరంగముల నాట్యమాడుచున్నది. మహా చైతన్యము జలము. అందలి తరంగములు అయనములు. సర్పమునకు, కమలమునకు, తరంగములకు, జలములకు స్వామి నారాయణుడు.

## MEDITATION - 37

(April 26, Aug. 17, Oct. 29, Feb. 19)

Lake-beetle adjustments. Lake and beetle are in the Lotus. Lotus is in the lake, beetle is in the Lotus. Beetle sings, man melts, God crystalises.

సరస్సు, భ్రమరముల సర్దుబాట్లు. సరస్సు, భ్రమరము కమల మందున్నవి. కమలము సరస్సునందున్నది. భ్రమరము కమల మందే యున్నది. భ్రమరము గానము చేయును. మానవుడు కరిగి, దైవము స్థిరపడును.

*వివరణము :*

సరస్సు జీవజలములకు సంకేతము. మరియు మహా చైతన్యమునకు కూడ సంకేతము. కమలము అందుండేర్పడు సృష్టికిని, మానవునకును సంకేతము. (మానవుడు సృష్టిలో గల సృష్టి ప్రతీకయే కదా!) భ్రమరము సృష్టి యందలి స్పందనమునకు సంకేతము. స్పందనము చేయు గానము ఓంకారము.

సరస్సు నుండి పుట్టిన కమలమందు సరస్సు నందలి జీవ జలమే వ్యక్తిత్వము చెందును. అనగా మహా చైతన్యము నుండి ఒక వ్యక్తి ఏర్పడుట. (గోధుమ పిండి నుండి ఒక గోధుమ రొట్టె ఏర్పడినట్లు) వ్యక్తిగత చైతన్యము అహంకారము, బుద్ధి, చిత్తము ఇంద్రియముల యందు యుండును. అందే స్పందనము కూడ యుండును. పిండి నుండి రొట్టె తయారుచేయుట సులభమే కాని మరల అది పిండి యగుట కష్టము. ఎందువలన అనగా కాల్చబడిన రొట్టె అహంకార మను నూనెతో వేరగును కనుక. వేరైనను మరల ఏకమగుటకే వ్యక్తి ప్రజ్ఞయందు స్పందనము కూడ యున్నది. స్పందనమను భ్రమరగీతము నందు అనురక్తి కలిగిన జీవుడు మరల దైవమను మహా చైతన్యమున స్థిరపడగలడు. ప్రతి జీవుని యందు భ్రమరగీతము రూపమున దైవానుగ్రహమున్నది. దాని యందు కేవలము రక్తి కాక అనురక్తి గావలెను. అనగా నిరంతరము కావలెను. దైవము జీవులను సృష్టించి మరల తనను చేర్చుకొనుటకు ఏర్పరచు కొను ఉపాయమే స్పందన మని తెలియవలెను.

## MEDITATION - 38

(April 27, Aug. 16, Oct. 30, Feb. 18)

All-round development, all round development. Ardent development. Art development. Advent of Master.

సర్వతోముఖ వికాసము. పరిపూర్ణ వికాసము. ఆర్ద్రతతోకూడిన వికాసము. కళావికాసము. మాస్టరు అవతరణము.

*వివరణము :*

పరమగురువుల మార్గము ప్రాచీన మహర్షుల మార్గమే. అది సనాతనము. ఈ మార్గమున జీవుడు సమస్త రంగములందు పరిపూర్ణుడు కావలెను. అనగా విద్య, సంఘము నందు సమర్థత, శరీర పుష్టి, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగము, కుటుంబ పోషణము, సంఘసేవ, సంగీతము కలిగి యుండవలెను. అంతేకాక వీనియందు నైపుణ్యము కలిగి యుండవలెను. దీనిని సర్వతోముఖ వికాసమందురు. ఇట్టివాని జీవితము విచ్చిన కమలము వలె వికాసము చెంది, అతనికి, సంఘమునకు కూడ ఆనందదాయక మగును. ఇట్టి బహుముఖ వికాసము వలన మానవుడు పరిపూర్ణుడుగ పరిగణించబడును.

జీవితమున పై రంగములలో ఒకటో రెండో విషయముల యందు వికాసము కలుగగనే మానవుడు తాను పరిపూర్ణుడనని గర్వపడుచున్నాడు. సంఘము కూడ అట్లే శ్లాఘించుచున్నది. కమలమందలి ఒకటి రెండు దళములు వికసించినచో దానిని వికాసము అనలేము కదా! అట్లే జీవుడు తన అలసత్వము చేత ఒకటి రెండు విషయములయందు సమర్థత కలుగగనే పూర్ణుడు కాలేడు. ఋషి మార్గము కోరునది సర్వతోముఖ వికాసము. అది మానవునికి సాధ్యమే. దానికి వలసినది కృషి, శ్రద్ధ మరియు పూర్ణవికాసము చెందవలెనను ఆర్ద్రత.

పై కారణముగ వికాసమును రెండు విధములుగ ఈ ధ్యానము వివరించుచున్నది. 1) సర్వతోముఖ వికాసము. 2) వాని పరిపూర్ణత. దానికి వలసినది ఆర్ద్రత. ఆర్ద్రత యనగా భక్తిశ్రద్ధలతో కూడిన నిరంతర కృషి. అప్పుడే మానవుడు మహర్షి మార్గమున నడచుచున్నట్లు లెక్క. వికాసము కళావంతమగుట వికాసమునకు పరాకాష్ఠ. ఈ మార్గముననే అతడు పరమగురువు కాగలడు. ఈ మార్గమునకు అధినాయకుడు శ్రీకృష్ణుడు.

శ్రీకృష్ణుడు పూర్ణ పురుషుడు, పురాణ పురుషుడు. అతడు గానము చేసెను, నాట్యమాడెను, పరాక్రమము చూపెను. సౌష్ఠవమైన శరీరము కలిగియుండెను. భక్తి, జ్ఞాన, వైరాగ్య యోగములందు పరిపూర్ణతను చూపెను. బహుకుటుంబియై కూడ సమర్థతతో నిర్వహించెను. సంఘమున కెనలేని సేవ చేసెను. సామాన్యుల నాదరించెను. అతనియందు సర్వవిద్యలు భాసించెను. చివరకు రాజకీయము కూడ నడపెను.

విద్యలు కళలుగా మానవుని నుండి ప్రకాశించుట ఆ విద్యకు పరిపూర్ణత. 64 విద్యలు 64 కళలుగా శ్రీకృష్ణుని నుండి మాత్రమే వికసించినవి. అది కృష్ణుని పూర్ణత్వము. సాధకునకు ఈ ధ్యానము జన్మ జన్మముల ఆశయముగ నిలువవలెను.

## MEDITATION - 39

(April 28, Aug. 15, Oct. 31, Feb. 17)

Ant-Man-Brahma. Ant around man. Man around ant. Man Ant Eagle. Mantle. Ant to Brahma, Abraham.

చీమ, మనిషి బ్రహ్మము. మానవుని చుట్టును చీమ. చీమ చుట్టును మానవుడు. మనిషి, చీమ, గద్ద. వెలుగు. చీమ నుండి బ్రహ్మము, అబ్రహ్మ.

*వివరణము :*

ఈ ధ్యానము ఆంగ్లపద విన్యాసముతో కూడినది. పదముల యందలి శబ్దములను నైపుణ్యముతో పలుకుచు రహస్య భావములను సులభముగ ప్రకటించుట జరిగినది. ఇట్టి నైపుణ్యము సంస్కృత ఆంధ్రములలో కవులు మిన్నగ చేయుదురు. ఇందలి పదముల అర్థముకన్న నిర్దేశింపబడిన భావమునకు ప్రాధాన్య మీయవలెను.

"*చీమలో, బ్రహ్మలో శివకేశవాదులలో*" అని త్యాగయ్య కీర్తించినట్లు చీమ, మానవుడు, బ్రహ్మ అందరియందు బ్రహ్మమే నిండి యున్నాడు. బ్రహ్మ యనగా సృష్టికర్త. బ్రహ్మము అనగా సృష్టికర్తను కూడ సృష్టించినవాడు. అతడు అంతర్యామి చీమనుండి బ్రహ్మ వరకు ఆరోహణ పథము వున్నది. బ్రహ్మనుండి చీమ వరకు అవరోహణ పథమున్నది. ఈ పథమున ఒక చిక్కు వున్నది. పథము ఉర్ధ్వగతి చెందు వలయాకార (spiral) మార్గము. దీనినే అనూరాధ యందురు. ఈ మార్గమున జీవుడు వలయముల తిరుగుచున్నను, ఊర్ధ్వముఖ మార్గమున నడచును. ఈ వలయమునకును సంసార వలయమునకును భేదమున్నది.

సంసార వలయమునందు వలయముగ తిరిగినపుడు తిరుగుటకు ముందు తా నెట్లుండెనో తిరిగిన తరువాత మరల అట్లే వుండును. ఇది పునరావృత్తి మార్గము. జన్మల ఎత్తుట, పుట్టుట,

చచ్చుట. చీమ నుండి మనిషి వరకు పెరిగి మరల అహంకారము కారణముగ చీమ వరకు దిగజారు విధానము. ఈ మార్గము వలయాకార మార్గమేకాని ఇందులో ఊర్ధ్వగతి పొందుటకు వలసిన విద్య లేదు. పుణ్యములు చేయుచు మానవునివరకే దిగి అహంకరించి పాపములు చేయుచు చీమ దోమల జన్మలెత్తుట పురాణ విదితములే. ఇందు అంతర్యామి స్మరణ లేకపోవుటయే ఊర్ధ్వగతి లేకపోవుట.

సృష్టి ద్వంద్వ సూత్రముతో ఏర్పడినది. దాని నధిగమించ వలె నన్నచో, దాని నధిష్ఠించిన అంతర్యామి స్మరణయే ముఖ్యము. మంచిచెడులు, పాపపుణ్యములు, సుఖదుఃఖములు, స్వర్గ నరకములు మొదలగునవి అంతర్యామికి లేవు- అంతర్యామిని ఉపాసించు వానికి కూడ నుండవు.

పై అంతర్యామి స్మరణ వలయ మార్గమునకు ఊర్ధ్వగతి కలిగించ కలదు. వలయములుగ తిరుగుచు ఆకాశమున చేరు జీవచైతన్యమునకు గద్ద (గరుత్మంతుడు) సంకేతము. అందువలన సంసార చక్రమున పడివున్న అనేక జీవులకు గద్ద నడవడిక పరిష్కారము చూపును. గద్ద మార్గమున ఆకాశపు వెలుగులను చేరవచ్చును. అపుడు శరీరము కూడ వెలుగైపోవును. బ్రహ్మను దాటి బ్రహ్మముగా వచ్చును. వారే వశిష్ఠాది ఋషులు.

## MEDITATION - 40

(April 29, Aug. 14, Nov. 1, Feb. 16)

Leo, jungle with the cub. Jacob. The sign is royal, Israel.

సింహరాశి అడవిలోని సింహపు పిల్ల. అతడే యాకోబ్. ఈ రాశి రాజు వంటిది. ఇది దేవయాని రాశి.

*వివరణము :*

యూదు మతము వారందరును ఇశ్రాయీలు అని పిలువబడుదురు. వారి సంప్రదాయమున దివ్య పురుషులలో యాకోబు ముఖ్యుడు. ఆంగ్లమున ఇతనిని జాకబ్ అని పిలుతురు. యూదు మతము వారందరు తాము దైవసంతతి యని నమ్ముదురు. వారి జ్ఞాతులందరు అరబ్బులు. వారిని పితృయాన పథమునకు సంబంధించిన వారని భావింతురు. యాకోబు అను ప్రజ్ఞ అనాహత పద్మమునుండి సహస్రారమునకు, మూలాధారమునకు గల సుషుమ్న మార్గము. "య" అను శబ్దము తంత్రమున సహస్రార దళ పద్మమునకు సంకేతింపబడెను. "క" అను శబ్దము అనాహత పద్మమునకు సంబంధించినది. "బ" యను శబ్దము స్వాధిష్ఠాన పద్మ సంబంధితము. సుషుమ్న మార్గము దేవయాన మార్గము. ఇది యోగ జీవనులకు విదితమే. సంసార జీవులు పితృయాన మార్గమున పుట్టుచు, చచ్చుచు యుందురు. సుషుమ్న మార్గమే రాజమార్గము. రాజయోగము ద్వారా రాజమార్గమున జీవులు మొదట హృదయమను సింహపు గుహయందు ప్రవేశించవలెను. అందలి సింహము 'సోహం' అని గర్జించు చుండును. హృదయ గుహయందు ప్రాథమికముగ సాధకుడు దర్శించునపుడు ఈ గర్జన చిన్నదిగ నుండును. అందువలన అది గుహయందు గల సింహపు పిల్ల యందురు. సాధన కారణముగ అది పెరుగ గలదు. ఇందలి సింహము గుహ హిరణ్మయ కాంతులతో నిండియున్నది. ఈ కాంతులకు కేంద్రము గుహకు ఊర్ధ్వమున గల రంధ్రమే. ఆ రంధ్రము నుండి సోహము అను శబ్దము ఆధారముగ ఎగబ్రాకినచో

సుషుమ్న మార్గమున సహస్రారము చేరవచ్చును. అదే విధముగ హృదయము నుండి స్వాధిష్ఠానము, మూలాధారము కూడ చేరవచ్చును. భారతీయ వాఙ్మయమున కపిలునివలె యూదు దేశమున "యాకోబు" ప్రజ్ఞ నీ విధముగ భావింతురు. ఈ ప్రజ్ఞను చేరుటకు సింహరాశి రాశులలో రాజు. సింహరాశి మార్గము దేవయాన మార్గము. ఇజ్రయిల్ దేశస్థులు ఈ సాధనా విధానమును ప్రధానముగ పాటించు చుండెడివారు. తత్కారణముగ పశ్చిమ దేశముల యందు ఈ మార్గము నెలకొల్పుట జరిగినది. ప్రస్తుతము మరుగున పడినది.

పై అవగాహన కలిగిన తరువాత ఈ ధ్యానము చేసినచో అర్థవంతముగ నుండును. క్లుప్తముగ సింహము అనగ గుహ యందుండెడిది. దాని శబ్దము సోహము. ఆ శబ్దము ననుసరించినచో సుషుమ్న యను రాజమార్గము దొరుకును. అది దేవయాన మార్గము. ఆ మార్గమున రాజయోగి కావచ్చును. అపుడు దిగి వచ్చి మహత్కార్యములను నిర్వర్తింపవచ్చును.

దేవయాన పితృయానముల కథ మన పురాణమున వర్ణించబడి యున్నది. ఈ కథ అమృతత్త్వమును వివరించును. మృతసంజీవని విద్య ఇందలి రహస్యము. ఈ విద్యకు గురువు శుక్రాచార్యులు. ఆయన సప్తకేంద్రములలో హృదయమునకు అధిపతి. మృతసంజీవని విద్యయందు సిద్ధిపొందిన జీవుడు దివ్యశరీర ధారియై అమృతత్త్వమును చెందును. కచదేవయాని కథ ఈ సందర్భమున పఠించి అవగాహన చేసుకొనుట ముఖ్యము.

## MEDITATION - 41

(April 30, Aug. 13, Nov. 2, Feb. 15)

Man is Isiah, Messiah. Man is the Cross. Macrocosmos. Moses. Mount.

మానవుడు ఈశ్వరుడే. అతని యందలి ఈశ్వరాంశయే దేవదూత. మానవుడు చతుర్భుజుడు. బ్రహ్మాండమంతయు అతని యందున్నది. అతడు మోశాయ్. అతడే శిఖరము.

*వివరణము :*

సృష్టి యందు మానవ సృష్టి పరాకాష్ఠ. అతడు సృష్టి ప్రతీక. అతని యందు సమస్త గ్రహగోళములు, దేవాసురులు, యక్షరక్షసులు గలరు. అహంకారమున అతడు జీవుడగు చున్నాడు. అహంకారము లేనిచో ఈశ్వరుడే. నిరహంకారి యగు మానవుడు ఈశ్వర సమానుడైన దేవదూత. అహంకరించుటచే అతడు సృష్టి బద్ధుడగుచున్నాడు. మానవుడు చతుర్భుజుడు కూడను. అతనియందలి సత్యము, చైతన్యము, వివేకము, మనస్సు అతని చతుర్భుజములు. చతుర్భుజము లన్నియు వికసించిననాడు అతడు ఈశ్వరుడగును. లేనిచో బద్ధుడగును. ప్రస్తుతము మానవుడు మనస్సే ప్రధానముగ జీవించుచున్నాడు. వివేకము వచ్చిపోవుచుండును. తాను చైతన్య స్వరూపుడనని, శాశ్వతుడనని మానవునకు తెలియవలసి యున్నది. అట్టి అనుభవైక జ్ఞానమే జ్ఞానము. ఇట్టి తెలిసినవాడు సృష్టి ప్రవాహము నుండి రక్షింపబడును. ''మోశాయ్'' (మోజెస్) అనగా ఈదు భాషలో ప్రవాహము నుండి రక్షింపబడిన వాడని అర్థము. సృష్టి ప్రవాహమున రక్షింపబడిన వాడు దివ్యజీవనుడు. అతడు మానవులలో వుత్తముడు. అనగా శిఖరమని అర్థము.

ఈ విధముగ మానవు డీశ్వరుడు. దేవదూత. అతడు చతుర్భుజుడు. బ్రహ్మాండ స్వరూపము. అతడు సృష్టికతీతముగ నిలబడగలడు. సృష్టి యందు శిఖరము వంటివాడు అని అవగాహన చేసుకొనవలయును.

## MEDITATION - 42

(May 1, Aug. 12, Nov. 3, Feb. 14)

All names together utter the name of God. A prophecy thinks from darkness to light. Prophecy is fulfilled. Abraham, Moses, Isiah, Jacob put together form Jesus.

సర్వ నామముల సమగ్ర రూపమే దైవము. చీకటి నుండి వెలుగునకు కొనివచ్చునదే దివ్యవాక్కు. అబ్రహాము, మోజెస్, ఈశయ్య, జాకోబ్, జీససుగా కూడి గోచరింతురు.

*వివరణము :*

సృష్టియందు ఏర్పడిన సమస్త రూపములు దైవమే. రూపము లేర్పడిన తరువాత నామము లేర్పడినవి. రూపము లేని నామము లేదు. సమస్త నామములు రూపములను గుర్తించుట కేర్పరచిన సౌకర్యము. 'విశ్వం విష్ణుః' అని శ్రుతి తెలుపుచున్నది. కావున సమస్త రూపముల సమగ్రత్వమును ధ్యానించుటే విష్ణు ధ్యానము. సృష్టి ప్రారంభము నుండి స్థితికి వచ్చుటకు, స్థితి యందు పరిణామము చెందుటకు దైవమే అవసరమును బట్టి అవతారము నెత్తుచుండును. మత్స్యము, కూర్మము, వరాహము, నరసింహము, వామనుడు, పరశురాముడు, రాముడు, బలరాముడుగ అవతారము దాల్చెను. తానే పూర్ణపురుషుడుగ శ్రీకృష్ణుడై దిగివచ్చెను. కృష్ణుని యందు సమస్త అవతారములు సంగమించినవి. అట్లే యూదు మతమునకు సంబంధించి అబ్రహం, మోసెస్, ఈశయ్య, జాకోబ్ అను దైవదూతల అంశలు ఏసు నందు సంగమించినవి. తరువాతి అవతారములలో ముందు అవతారములు ఇమిడిపోవును. కావున విబేధములను పాటింపక సమస్త దైవదూతల రూపమున నున్న దైవమును, నిన్ను అనుగ్రహించుచున్న నీ గురు రూపమున చూడుము.

## MEDITATION - 43

(May 2, Aug. 11, Nov. 4, Feb. 13)

Trace bridge from the eye of the bull to the tongue of the serpent. It is the rod of the messenger of God. From Taurus to Aquarius the head £ (symbol) the rod points the path. From Scorpio to Leo the tail ascends. The Z form of Kundalini through eons. Z is the half swastika. Z to A, Zero to Aries.

వృషభాక్షము నుండి సర్పజిహ్వకు గల వంతెనను వెదకుము. అది భగవంతుని సందేశము నందించు దండము. వృషభము నుండి కుంభమునకు ఈ దండము తల భాగము దారిచూపును. వృశ్చికము నుండి సింహమునకు ఈ దండము యొక్క తోక ఎగబ్రాకును. ఈ మార్గము "ఎ" అక్షరము వలె అనాదిగ గోచరించు చున్నది. ఎ అర్థ స్వస్తికము. ఎ నుండి జు (అ)కు శూన్యము నుండి మేషమునకు.

*వివరణము :*

వృషభాక్ష మనగా మనలోని మూడవ నేత్రము. సర్పముజిహ్వా యనగా మూలాధారము. ఇందు మొదటిది మనలోని వృషభరాశికి పైన, రెండవది మనలోని వృశ్చికరాశికి క్రిందుగ నున్నది. అనగా భ్రూమధ్యము పైనుండి మూలాధారము క్రింది వరకు ఒక మార్గమున్నది. ఇదియే సుషుమ్న మార్గము. ఇది బ్రహ్మదండ మందున్నది. ఇది దివ్యదండము. భగవంతుని సందేశ మందించు దండమిది. దీనినే మంత్రదండమని కూడ నందురు. దీనిని వెదకుట, గుర్తించుట, తెలుసుకొనుట, అనుభూతి చెందుట ఆధ్యాత్మిక సాధకుల ధ్యేయము. ఈ మొత్తము మార్గమంతయు జ్యోతిశ్చక్రమున వృషభము పైనుండి వృశ్చికము దిగువ వరకు నిట్టనిలువుగ నుండును. ఈ రెండు రాశులను మనయందు అన్వయించుకొని సూటియైన సుషుమ్న మార్గమున అనుసంధించుకొనుట ఒక ఉపాయము. (మాస్టరు ఇ.కె. రచించిన 'స్పిరిచ్యువల్ ఎస్ట్రాలజి'లో వివరములకు చూడుడు.) వర్తుల మార్గమున వృషభము-కుంభము, వృశ్చికము - సింహము ఈ మార్గమునకు సంబంధించిన మూల స్థంభములు. ఇవి స్థిర రాశులు.






వృషభాక్షము నందు మానవుని మూడవ కన్ను వున్నది. దానికి పైన కుంభము నందు శివుని మూడవ కన్ను యున్నది. శివుని మూడవ కన్ను నుండి మన మూడవ కన్ను వరకు దివ్య సందేశము అందుకొని మంత్రదండము ద్వారా దానిని భూలోకమునకు కొని వచ్చుట మహర్షులు నిర్వర్తించు కార్యము. సాధారణ మానవులందు ఈ దండము నిర్మాణమై యుండదు. దీనిని నిర్మించుకొనుటయే యోగవిద్య. ఈ మంత్రదండ మందలి అధోభాగము (తోక) వృశ్చికము నుండి సింహము వరకు యుండును. అనగా మనలో మూలాధారము నుండి ఉదర వితానము వరకు యుండును. ఈ రెండు కేంద్రములను కలిపినచో స్వస్తిక మందలి నాలుగవ వంతు ఏర్పడును. వృషభమును, కుంభమును కలిపినచో దండము యొక్క ఊర్ధ్వ భాగమున స్వస్తికము యొక్క మరియొక నాలుగవ భాగ మేర్పడును. రెండవ చిత్రమునందు చూపినట్లుగ ఈ రెంటిని కలిపినచో స్వస్తికము యొక్క అర్ధభాగ మేర్పడును. అనగా అర్థ స్వస్తికము మనయందుగల దివ్యదండము. దానిని నిటారుగ ఏర్పరచుటయే యోగము. అది మొదటి చిత్రమున చూపబడినది. “స్వస్తికమనగా స్వస్థతను చేకూర్చునది. స్వస్థత యనగా నిజ స్థానమున యుండుట. స్వస్థానమున నుండుట. అర్ధ స్వస్తికము సగము స్వస్థత యని తెలుపును. మనస్సు నందు జీవించువారు అర్థ స్వస్థితులు. ప్రజ్ఞ యందు జీవించువారు పూర్ణ స్వస్థికులు. యుగముల తరబడి మానవులు అర్థ స్వస్తికులే యని ఈ ధ్యానము

తెలుపుచున్నది. యోగము ద్వారా పూర్ణత్వము పొందుడని తెలుపుచున్నది. పూర్ణత్వము యందున్న వాడికే సృష్టి మొదలు, తుది తెలియగలవు.

ఈ ధ్యానము అత్యంత గంభీరము. దీని అవగాహనకు ద్వాదశ రాశుల జ్యోతిశ్చక్రము తెలియవలెను. మానవుల యందలి ప్రజ్ఞా కేంద్రములకు జ్యోతిషరాశులతో గల సంబంధము కూడా తెలియవలెను.

## MEDITATION - 44

(May 3, Aug. 10, Nov. 5, Feb. 12)

A to Z read scripture written. It is written in the cave temples of your body. Z to A you read in the picture writing of the future. The wheel is reversed.

‘ఎ’ నుండి ‘జడ్’ వరకు 26 అక్షరములతో రచింపబడిన సృష్టియే మూలగ్రంథము. ఈ రచన అంతయు నీ శరీరమందలి రహస్య గుహలలో నిక్షిప్తమై యున్నది. ‘జడ్’ నుండి ‘ఎ’ వరకు నీ దేహమందలి రచనను వెనుకకు చదువుము. అది నీ భవిష్యత్తు. అపుడు చక్రము తిరోధానము చెందును.

*వివరణము :*

శబ్దము లన్నియు 'అ' నుండి 'క్ష' వరకు సంస్కృత భాష యందు తెలుపబడినవి. 16 అచ్చులు, 25 (5×5) హల్లులు, 8 శాంతములతో 49 అక్షరములు కలిగి సప్తసప్తిగా (7×7) సంస్కృత మేర్పడినది. ఇది దేవభాషగా కీర్తి నందినది. ఈ అక్షర శబ్దము లన్నియు సృష్టి నిర్మాణమునకు తోడ్పడి ఏడు లోకములుగ సృష్టి నిర్మాణము జరిగినది. మరల ప్రతి లోకమందు ఏడు అంతర్లోక ములుగ కూడ నిర్మాణము చేసినవి. మొత్తము నలుబది తొమ్మిది (49) లోకములు నలుబది తొమ్మిది (49) అక్షరములు. ఈ అక్షరములను మాతృకలు అని కూడ సంబోధింతురు. కేవలము సంస్కృత భాషయందే ఈ అమరిక గమనింపదగును. ఇతర భాషలలో ఇన్ని అక్షరములు లేవు. అవి అన్నియు సంస్కృతము నుండి ఏర్పడినవే కాని సంస్కృతముతో సరిసమానమైనవి కావు. సంస్కృతిని పెంచెడి ఏకైక భాషగాన ఈ భాషను సంస్కృతము అనిరి.

మానవ శరీరమందు సప్త కేంద్రము లున్నవి. అందు పద్మము లున్నవి. పద్మమునందు, కేంద్రమునందు పై తెలుపబడిన అక్షరముల శబ్దములు స్పందించుచుండును. ప్రతి కేంద్రమందలి ప్రతి దళమునకు తత్సంబంధిత శబ్దములు మంత్ర శాస్త్రమును తంత్ర శాస్త్రమును దర్శింప చేయుచున్నవి. ఉదాహరణమునకు

హృదయ కమలమున గల 12 దళములు ''క'' అక్షరము నుండి ''ఠ'' అక్షరము వరకు ఏర్పడి యున్నవి. అందువలన ఈ కమల దర్శనము అనుభూతి కలిగినవారు కఠ యోగులు అని పేర్కొనబడి నారు. కఠ ఉపనిషత్తు కూడ ఈ విద్యను రహస్యముగ బోధించును.

ఇట్లు మూలాధారము నుండి సహస్రారము వరకు గల పద్మముల యందలి అక్షరములను అనుభూతి పరముగ తెలిసినచో సాధకుడు పూర్ణయోగియే. సృష్టి చక్రమునుండి తరించును.

## MEDITATION - 45

(May 4, Aug. 9, Nov. 6, Feb. 11)

In Aries the serpent is Kumara. In Scorpio the serpent is Saturn. In Cancer the serpent is Python. Python is typhoon.

మేష మండలి కుండలినీ చైతన్యము కుమారుడు. వృశ్చిక మండలి కుండలినీ చైతన్యము శనిదేవత. కర్కాటక మండలి కుండలినీ చైతన్యము కొండచిలువ. అది తుఫాను వంటిది.

*వివరణము :*

కుండలిని చైతన్యము మనయందలి మేషరాశి చేరినచో అది ఆజ్ఞాచక్రము నందున్నట్లు జీవప్రజ్ఞ ఆజ్ఞా కేంద్రమున నున్నచో అతనికి తన జీవితముపై స్వామిత్వముండును. ప్రపంచమున ఏదియును అతనికి భ్రమ, భ్రాంతి, మోహము, మాయ కలిగింపవు. దైవము మానుష రూపమున నున్నప్పుడు యిట్లుండును. జీవుడు దైవమును చేరినప్పుడు కూడ యిట్లే వుండును. మేషమున అతను కుమారుడు అని చెప్పుటలో అతడు దైవ కుమారుడని తెలియ వలెను. సుబ్రహ్మణ్యస్వామి, సనక సనందన సనత్కుమారులు, నారదులు అట్టి కుమారులలో ప్రథములు.

వృశ్చికము నందున్న కుండలినీ చైతన్యము బంధింపబడిన జీవప్రజ్ఞ అది మూలాధారమున నుండును. ఆ ప్రజ్ఞను దేహము, పంచభూతములు, పంచేంద్రియములు, మనస్సు బంధించి యుండును. ఆ బంధనము అజ్ఞానము వలన ఏర్పడును. బంధనమే శని. ఇట్టి ప్రజ్ఞకు శని ఇచ్చు సందేశము నిష్ఠానియమములు. నిష్ఠతో, నియమ పరిపాలనముతో మాత్రమే ఈ ప్రజ్ఞ ఊర్ధ్వగతి చెందగలదు. మేషము చేరిన ప్రజ్ఞ రాజు కాగ వృశ్చికము చేరిన ప్రజ్ఞ బందీకృతుడైన రాజువంటి వాడు. ఇతడు అంతః శత్రువులను జయించిననే కాని రాజు కాలేడు.

కర్కాటక మందలి కుండలినీ చైతన్యము తుఫాను వంటిది.

కొండచిలువ వంటిది. ఆవేశ కావేశములు మెండుగా కలిగి తనకు తన పరిసరములకు ఒక తుఫాను వంటి వాతావరణము కలిగించు చుండును. తుఫాను ముందు ప్రశాంతత యుండును. తుఫాను తరువాత ప్రశాంతత యుండును. తుఫాను యున్నప్పుడు మాత్రము స్వల్ప కాలములో సమస్తమును ధ్వంసము చేయకలదు. ఇట్టివారు తమ కభిప్రాయములు కలిగినప్పుడు వాటిని పలికి తీరవలెనను బలీయమగు ఆవేశ ముండును. మాట, చేత, ఆ సమయమున భయంకర వాతావరణమును సృష్టించును. అటుపైన చింతించును. వారి లోపలి నుండి కలుగు తుఫాను వారు నియమించుకొనలేరు. అది కారణముగ దుఃఖము చెందుచుందురు. వీరు కొండచిలువవలె తమకు కలిగిన భావములను తామే మ్రింగుట నేర్చుకొనవలెను. మ్రింగుటకు కొండచిలువ సంకేతము. ఎంత పెద్ద జంతువునైనను మ్రింగు సామర్థ్యము కొండచిలువకు కలదు. ఇట్లు తమకు జరిగిన అన్యాయమును సహించుట, తమ భావములను వ్యక్తము చేయక దైవ స్మరణమున నిలచి, దైవమునకు సమర్పించుట చేయగలిగినచో వీరి సహజమైన మాతృ స్వభావము ప్రపంచము గుర్తించి, గౌరవించి పూజించును. వీరికిని ప్రశాంతత చిక్క కలదు. లేనిచో వీరి జీవితము తుఫానులతో కూడిన ప్రయాణముగ నుండును.

ఈ రాశుల స్వభావము నెరిగి జీవించుట ఉత్తమము.

## MEDITATION - 46

(May 5, Aug. 8, Nov. 7, Feb. 10)

Eagle and serpent. Matter and serpent. Master and servant. Master and savant. Physical serpent. Astral servant. Divine savant. Celestial saint.

గరుత్మంతుడు- సర్పము. పదార్థము - సర్పము, ఈశ్వరుడు- సేవకుడు. ఈశ్వరుడు - విజ్ఞాని, భౌతిక సర్పము - కామమయ సేవకుడు. దైవ విజ్ఞాని - పరమహంస.



*వివరణము :*

అథో లోకము లందలి సర్పమే ఊర్ధ్వ లోకమందలి రెక్కలు గల దివ్య సర్పముగను, గరుత్మంతుడిగను, జ్ఞానము సంకేతించును. ఊర్ధ్వము నుండి అధస్సు వరకు గల దారిని సర్పముగా పేర్కొనుట కూడ శాస్త్రజ్ఞానమే. ఊర్ధ్వమున గల దివ్యత్వమే అధస్సున పదార్థ మగును. ఈ పరివర్తనము జరుగు మార్గము కూడ సర్పముగ సంకేతించబడినది. సృష్టియందు, మానవునియందు ఈ సర్పపు దారిని కుండలిని చైతన్య మందురు. సర్పమునకు ఊర్ధ్వమున ఈశ్వరుడు, అధస్సున పదార్థము యుండును. ఊర్ధ్వమున గల ప్రజ్ఞ ఈశ్వరుడే. అధస్సున గల ప్రజ్ఞ సేవకుడు. ఈ సేవకుడు అనాగరికపు మానవుడిగ ప్రయాణము ప్రారంభించి పరిణామము చెందుచు మానవుడై, వివేకియై, విజ్ఞానియై, సాధువై, యోగిగ నిలచెను. అట్టి యోగి క్రమశః పరమహంస అగును. ఋషి యగును. రాజర్షి యగును. మహర్షి యగును. యతి యగును. అవధూత యగును.

ఇందు ప్రప్రథమమున పదార్థమే సమస్తమని భావించి స్వార్థ చింతనను కలిగి తన కొరకు ఇతరులను హింసించు స్వభావము కలవాడు, భౌతికమైన విషసర్పమువంటి వాడు. పరిణామ క్రమమున అతడు క్రమముగ సేవకుడగును. సాధు స్వభావము అలవడును. అటుపైన క్రమముగ పెరుగును. అందువలన ఈ ధ్యానము "ముందుగ సేవకుడ వగుము" అని సూచించు చున్నది. సేవ కారణముగనే సాధుత్వ మబ్బును. సాధువునకే విజ్ఞాన ముదయించును. అది జ్ఞానముగ పరిణామము చెందును. క్రమశః ఈశ్వరుడు కాగలడు.

## MEDITATION - 47

(May 6, Aug. 7, Nov. 8, Feb. 9)

Not to learn but to realise. Not to acquire but to expand. Not to possess but to permeate. Not to secure but to sacrifice.

చదువుట కాదు, ఆకళింపు చేసుకొనుట. పోగేసుకొనుట కాదు, వ్యాప్తి చెందుట. పొంది వుండుట కాదు, వితరణ చేయుట. రక్షించుకొనుట కాదు, త్యాగము చేయుట.

*వివరణము :*

ఈ సాధన మార్గము నిశ్చలముగ నిలువదలచు వారికి ముఖ్యము. యోగ మార్గమున ఈ గుణములు అత్యంత వృద్ధికి తోడ్పడును.

గ్రంథ పఠనము అందరును చేయుదురు. దానిని ఆకళింపు చేసుకొనువారు కొందరే. శ్రద్ధా భక్తి కలిగి విద్యయే దైవమని భావించి పఠించవలెను. తెలుపబడిన విషయము ఆకళింపగుటకు దైవాను గ్రహము, గురువనుగ్రహము, గ్రంథకర్త అనుగ్రహము అత్యంత అవసరము. సరస్వతీదేవిని, గణపతిని, శ్రీకృష్ణుని, వ్యాసుని హృదయమున స్మరించి భరత వాఙ్మయమును పఠించవలెను. పఠనమునకు ప్రశాంత వాతావరణ మవసరము. దీపము, అగరువత్తి వెలిగించుకొని దివ్యమూర్తులను స్మరించినచో క్రమశః వారి సాన్నిధ్య మున పఠించుట జరుగును. అపుడు గ్రంథ మాకళింపై స్ఫూర్తి నివ్వగలదు. లేనిచో మేధస్సున ఏమియును ఇమడదు. అట్లే రామాయణము చదివినప్పుడు శ్రీ సీతారామలక్ష్మణులను, హను మంతుని, వాల్మీకి మహర్షిని స్మరించి పఠనము గావింపవలెను. ప్రతి దినము ఒకే సమయమున పఠించుట అలవర్చుకొన్నచో కాలము రూపమున దైవ మనుగ్రహించును. శ్రద్ధతో కూడిన పఠనము నకు ఇవి అవసరము. ఆకళింపైన విషయము మనో వికాసమును కలిగించుటయే కాక ఆచరణాత్మకమైన విషయముల యందు స్ఫూర్తిని, బలమును చేకూర్చును.

ప్రోగు చేసుకొనుట, దాచుకొనుట కన్న పదిమందికి పంచుట వ్యాప్తి చెందుట యోగమునకు అత్యంత ఆవశ్యకము. ఈ అభ్యాసము

కర్మ నివృత్తి గావించుట కుపయోగించుము. కర్మ బంధములు సడలును. తనకై ప్రోగు చేసుకొని దాచుకొనువాడు కర్మ బంధమును పెంచుకొను చున్నాడు. ఇతరులకై వినియోగించువాడు. కర్మ బంధములను సడలించుకొను చున్నాడు. పంచిన వారికి పెరుగుదల యుండును. పెంచుకొను వానికి బంధము లుండును. అందువలన యోగమున యోగజీవన మవలంబించు వారు పెంచుకొనుట కన్న పంచుకొనుట నేర్చుకొనవలెను.

దాచుకొనుట, దాగుకొనుట, తనను తాను రక్షించుకొనుట అవివేకము. ప్రోగు చేసిన ఆస్తులను, కీర్తిని, పరివారమును రక్షించు కొనుటలో జీవి సతమత మగుచున్నాడు. పంచువానికి, పరుల హితమునకై జీవించువారికి రక్షణ సహజముగ కలుగును. త్యాగము చేయువానికి పరిపూర్ణ రక్షణ యుండును. ఇది సృష్టి ధర్మము. ధనము, కీర్తి ప్రోగుచేసుకున్నను పోవుచున్నది. పరివారము కూడ ధనమును, కీర్తిని బట్టియే. ఈ మార్గము నమ్మినవాడు ఎండమావు లను నమ్మినవాడు. పరహితునకు ధనము, కీర్తి, పరివారము అప్రయత్నముగనే లభింప గలదు. శాశ్వతమై నిలువ గలదు.

రక్షించుకొనుటకాక పరిరక్షించుట నేర్వవలెను. పరిరక్షించు వాని రక్షణ దైవమే కలుగచేయును. ఈ విషయమునకు సంబంధించి భాగవతమున యొక పద్యమున్నది.

*ధనము వీధిపడిన దైవవశమున నుండు*
*పోవు మూలనున్ననైన*
*అడవి రక్షలేని యబలుండు వర్ధిల్లు*
*రక్షితుండు మందిరమున జచ్చు.*

## MEDITATION - 48

(May 7, Aug. 6, Nov. 9, Feb. 8)

Matter, Mind Master. Matter is the South pole. Master is the North pole. Mind is the equator.

మట్టి, మనస్సు, మాస్టరు. మట్టి దక్షిణ ధృవము. మాస్టరు ఉత్తర ధృవము. మనస్సు భూమధ్యరేఖ.

*వివరణము :*

సృష్టి యందు భౌతికలోకము పదార్థమయము. పదార్థము పరమార్థము నుండి దిగివచ్చిన చిట్టచివరి లోకము. దాని నిర్మాణముతో సృష్టి పరిపూర్తి యగును. అందుచేత పదార్థము దక్షిణ ధృవము. పరమార్థము ఉత్తర ధృవము. పరమార్థము నుండి పదార్థము వరకు వరుసగా ఏడు లోకము లున్నవి. అవి వరుసగా 1. సత్యలోకము, 2. తపోలోకము, 3. జనోలోకము, 4. మహర్లోకము, 5. సువర్లోకము, 6. భువర్లోకము, 7. భూలోకము. ఇందలి మహా లోకము లేక మహత్తు సృష్టి మనస్సు. ఇది దివ్యమైనది. మధ్యస్థ మైనది. నాలుగవది. ఈ లోకమునకు పైన మూడు లోకములు కలవు. క్రింద మూడు లోకములు కలవు. పై లోకములు ప్రజ్ఞామయ ములు. క్రింది లోకములు ద్రవ్యమయములు (పదార్థమయములు). అనగా కారణ, సూక్ష్మ, భౌతిక ద్రవ్యములు కలవి. పై మూడు లోకములను ఆధారముగ మహత్తు క్రింది మూడు లోకములుగ ప్రతిబింబింప చేయును. అందువలన ఇది భూమధ్యరేఖతో పోల్చబడినది.

గోళము నందలి ఉత్తర దక్షిణ ధృవములు, భూమధ్యరేఖలను కూడ పై విధముగ అన్వయించి అవగాహన చేసుకొనవచ్చును. మనము చూచు భూమి భౌతిక కక్ష్యలోనిది. దీని చుట్టును ఆరు పొర లున్నవి. మొత్తము ఏడు. ఇందలి నాలుగవ పొరలో మహర్లోక

ముండును. ఏడవ పొరపైన ఉత్తర ధృవ ముండును. అట్లే క్రింద దక్షిణ ధృవ ముండును.

మానవునిలో కూడ ఏడు లోకములు, ఏడు పొరలు కలవు. వీని ననుసంధానము చేయుచు ఏడు కేంద్రములు కలవు. మానవుని శిరస్సు పైభాగము పరమాత్మ స్థానము. మూలాధారము పదార్థ స్థానము. నాలుగవదియైన బుద్ధిలోకము లేక అనాహత కేంద్రము మహర్లోకము. మానవుడు సాధారణముగ క్రింది నుండి మూడవది యైన మనోలోకమున నుండును. అది కారణముగ పశువువలె తన దేహమునకు కావలసినది మాత్రమే ప్రోగు చేసుకొనుచు మరణించును. నాలుగవది అయిన బుద్ధిలోకము చేరినచో మానవుడిగ ప్రవర్తించ గలడు. అతనికి ప్రజ్ఞామయ లోకములు, ద్రవ్యమయ లోకములయొక్క వినియోగము తెలియును. రెండింటిని సమముగ ఆదరించి గౌరవించి యోగివలె జీవించుము.

## MEDITATION - 49

(May 8, Aug. 5, Nov. 10, Feb. 7)

Matter-Mind-Master is the rod of rotation. The Earth rotates. The rod spins time. Rotation is time.

పదార్థము, మనస్సు, ఈశ్వరుడు ఆవృత్తముగ తిరుగు ఒక దండము. భూమి తిరుగును. ఆవృత్తముగ తిరుగు దండము కాలమును పేనును. కదురు (Spining Spindle) వలె పేనును. భ్రమణమే కాలము.



*వివరణము :*

భ్రమణము కాలముయొక్క గుణము. కాలము వర్తులాకార ముగ భ్రమించు చుండగ సృష్టిదండము (బ్రహ్మదండము) పరమార్థము నుండి పదార్థము వరకు సృష్టిని పేను చుండును. తత్కారణముగనే భూమి తిరుగుచుండును.

ఈ భ్రమణమున ఊర్ధ్వము నుండి అధస్సుకు, అధస్సు నుండి ఊర్ధ్వమునకు దారులు కలవు. అవి బ్రహ్మదండమున నుండును. అందు ముఖ్యమైన మజిలీలు లేక స్థావరములు మూడు. మొదటిది ఈశ్వరుడు, రెండవది మనస్సు, మూడవది పదార్థము. ఈశ్వరుడి నుండి పదార్థము వరకు ఒక దారి పేనబడుచుండగ పదార్థము నుండి ఈశ్వరునకు మరియొక దారి పేనబడుచుండును. మొదటిది అవరోహణ మార్గము, రెండవది ఆరోహణ మార్గము. ఈ మార్గము లను పేనునది కాలము బ్రహ్మదండము. దీనినే కాల దండమని కూడ అందురు. ఈ దండము తిరుగుచుండగ కాలక్రమమున సృష్టి, స్థితి, లయములు జరుగుచున్నవి.

మనయందు కూడ బ్రహ్మదండ మున్నది. అందు సుషుమ్న నాడి యున్నది. దానికి కుడి ఎడమలుగ పింగళ, ఇడ నాడులు పేనబడి యున్నవి. ఇడ నాడి అవరోహణ మార్గము. పింగళ నాడి ఆరోహణ మార్గము. సుషుమ్న నాడి యోగమార్గము. యోగులు తమయందలి సుషుమ్న ద్వారా ఆరోహణము, అవరోహణముకూడ చేయగలడు. ఇతరులు సృష్టి చక్రమున తిరుగుచుందురు.

ఈ ధ్యానమున యోగదండము దాని భ్రమణము ఊర్ధ్వ, అధో మార్గములు లోతుగ, దీర్ఘముగ భావించవలెను.

## MEDITATION - 50

(May 9, Aug. 4, Nov. 11, Feb. 6)

Rotation is time. Revolution is period. Time is in rotation. Matter is in periodicity. Time hatches matter.

భ్రమించునది కాలము. తన చుట్టు తాను తిరుగునది వ్యవధి. కాలము భ్రమణము నందుండును. పదార్థము ఒక వ్యవధి, గడువు కలిగి యుండును. కాలము పదార్థమును పొదుగును.

*వివరణము :*

కాలభ్రమణ మనంతము. భ్రమణము వలన కాలము లెక్క లేర్పడుచుండును. భ్రమణము ఊర్ధ్వముఖము, అధో ముఖముగా జరుగుచుండగా అందు పుట్టిన పదార్థము పరిమిత కాలము కలదై ఏర్పడుచు, నశించుచు నుండును. పదార్థమునకు గడువు లేక పరిమితి కలదు. పదార్థము తన చుట్టూ తాను తిరుగుచు నుండును. కాలము సర్వమును త్రిప్పును కాని తాను తిరుగదు. త్రిప్పెడు వాడు తిరుగడు కదా! కాలచక్రము సృష్టిని త్రిప్పుచుండును. అందేర్పడిన పదార్థము పరిమిత గడువు కలదై ఏర్పడుచు నశించుచు నుండును.

ఉదాహరణకు రంగుల రాట్నము త్రిప్పువాడు పిల్లలను రాట్నమెక్కించి కొన్ని చుట్లు త్రిప్పి వదలును. మరల కొందరు ఎక్కుట, తిరుగుట చేయుచు నుందురు. ఇట్లు అనంతముగ త్రిప్పున దొక్కటియే. అందు తిరుగువారలకు ఆది, అంతము వుండును. హాని, వృద్ధులుండును. అలాగే కాలము త్రిప్పుచుండగ లోకములకు గడువులు ఏర్పడుచుండును. త్రిప్పుటను రొటేషన్ (Rotation) అందురు. అందు తిరుగువానికి గల గడువును పీరియడ్ (Period) అందురు. వీరికి పరిమితమైన గడువు వుండును.

గడువులలో తిరుగువానికి తనచుట్టు తాను తిరుగు లక్షణ మేర్పడుచున్నది. రెవల్యూషన్ (Revolution) అనగా తన చుట్టు

తాను తిరుగుటయే. మంగలివాని కుర్చీవలె అది తిరుగుచుండును. తన చుట్టూ తాను తిరుగునవి నశించక తప్పదు. ఈ గుణము కలవారందరు స్వార్థపరులై నశింతురు. జనన మరణ చక్రమున పడి వారు శాశ్వతత్త్వమును మరతురు. తమ కొరకు తాము పని చేసుకొను వారందరు ఇట్టివారే. వీరి జీవితమునకు గడువేర్పడును. అట్లుకాక ఇతరుల కొరకు శ్రమ పడువారు గడువును, వ్యవధిని దాటుచుందురు. వారిని కాలస్వరూపుడగు అనంతుడు అనుగ్రహించును.

ఈ ధ్యానమున రొటేషన్, రెవల్యూషన్, పీరియడ్ అను పదములను మౌలికముగ అర్థము చేసుకొనవలసి యున్నది.

## MEDITATION - 51

(May 10, Aug. 3, Nov. 12, Feb. 5)

Matter turns atom, atom turns matter. Matter time adjustment. Matter turns man. Man becomes Master. Matter becomes mind. Mind becomes Master.

పదార్థము అణువగును. అణువు పదార్థమగును. పదార్థము, కాలము సర్దుబాటు. పదార్థము మానవుడగును. మానవుడు మహాత్ముడు (మాస్టర్) అగును. పదార్థము మనస్సగును. మనస్సు మహాత్ముడు (మాస్టర్) అగును.

*వివరణము :*

ఈ ధ్యానము నందు పరిణామ దశలు కాల మాధారముగ ఎట్లేర్పడుతున్నవో తెలుపబడినవి. అణువుల సముదాయమే పదార్థము లేక వస్తువు. వస్తువు మరల అణువులుగ మార్పు చెంద గలదు. కాలక్రమమున అచేతనమగు పదార్థము సచేతనము కాగలదు. సచేతన పదార్థము అచేతన మగును. *(సాశనానశనే అభి)* రాతి మీద సతతము పారు నీరు కారణమున నాచు మొక్కలు ఏర్పడుచున్నవి. అందుండి వృక్షము లేర్పడుచుండును. అందుండి జంతువులు, మానవులు ఏర్పడుచున్నారు. మానవులకు మనసు ఏర్పడుచున్నది. అటుపైన బుద్ధిమంతులు, విజ్ఞానవంతులు ఏర్పడు చున్నారు. ఆపైన మహాత్ము లేర్పడుచున్నారు. మానవుని యందేర్పడిన మనస్సే వికాసము చెందగ మహాత్ము డగుచున్నాడు. పదార్థము సచేతన మగుట, సచేతన పదార్థము నందు మనస్సు పుట్టుట, మనస్సు వికాసము చెంది మహాత్ములు పుట్టుట, ప్రధానమైన మజిలీలు. ఈ విధముగ కాలభ్రమణమున పదార్థము పరమార్థ మగుచున్నది. అట్లే పరమార్థము పదార్థ మగుచున్నది. అంతయు కాలము చేయు సర్దుబాటు. కాలమే దైవము. ఆరోహణ, అవరోహణ క్రమమునకు కాలమే ఆధారము. కాలమే అన్నియు చేయుచునుండును.

## MEDITATION - 52

(May 11, Aug. 2, Nov. 13, Feb. 4)

Solar pole, polar soul. The higher pole is the soul. Soul is the centre. Pole is the pivot.

సూర్యాత్మక ధృవము. ధృవాత్మక జీవుడు. జీవుడు ఉత్తర ధృవము. జీవుడు కేంద్రము. ధృవము ఇరుసు.

*వివరణము :*

మానవులకు గాని, భూగోళమునకు గాని, సృష్టి గోళమునకు గాని సూర్యాత్మకమగు ధృవముండును. అందే జీవాత్మకుడు విశ్వాత్మకుడు కూడ వ్యాపించి యుండును. ధృవమందు ఉత్తర భాగమున ఆత్మ వసించియుండి, చతుర్వ్యూహములుగ మొత్తము గొట్టమును వ్యాపించి యుండును. వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహములు చతుర్వ్యూహములు. అందు వాసుదేవ తత్త్వము విశ్వవ్యాపక ఆత్మతత్త్వము. సంకర్షణ తత్త్వము ఒక గోళమునకు, ఒక మానవ రూపమునకు కేంద్ర ప్రజ్ఞగ, అహంకార ప్రజ్ఞగ, జీవాత్మగ, విశ్వాత్మ నుండి స్థితిగొనును. సృష్టి గోళమునకు సంకర్షణ ప్రజ్ఞగ బ్రహ్మదేవుడున్నాడు. సూర్య గోళమునకు సంకర్షణ ప్రజ్ఞగ సూర్యుడు వున్నాడు. భూగోళ ప్రజ్ఞగ సనత్కుమారుడున్నాడు. మానవ ప్రజ్ఞగ ఒక్కొక్క మానవుడున్నాడు. ఇట్లు విశ్వాత్మ ప్రజ్ఞయే ప్రతి లోకమందలి, లోకస్థుల ప్రజ్ఞగ యున్నాడు. సంకర్షణ వ్యూహము కారణముగ కోటానుకోట్లు జీవులు ఎవరికి వారుగ వున్నట్లుగ భావింతురు. ఉన్నది ఒకే విశ్వాత్మయైనను, సంకర్షణ వ్యూహము కారణముగ ఎవరికి వారుగ భావింతురు. అటుపైన ప్రద్యుమ్న వ్యూహముగ సంకర్షణ నుండి బుద్ధిలోకము లేర్పడు చుండును. ప్రతి జీవునియందు తగు మాత్రము బుద్ధి దైవ మేర్పరచి సృష్టియందు జీవించుటకు తోడ్పాటు గావించినాడు. ఇది కారణ ముగ ఆత్మ సంరక్షణము, వృద్ధి జీవుడు గావించుకొను చున్నాడు.

ప్రద్యుమ్న వ్యూహమునందు అనిరుద్ధ వ్యూహ మేర్పడుచున్నది. అనగా బుద్ధి ఆధారముగ మనస్సు ఏర్పడి దేహేంద్రియముల ద్వారా జీవుడు ప్రకాశించుట. ఇట్లు మొత్తము శిరస్సు నుండి వెన్నముక కొన వరకు నాలుగు వ్యూహములుగ జీవుడు వ్యాపించి యున్నాడు.

| | | |
|---|---|---|
| విశ్వాత్మ (వాసుదేవుడు) | - | ఆత్మ తత్త్వము |
| సంకర్షణుడు | - | అహంకారము |
| ప్రద్యుమ్నుడు | - | బుద్ధి |
| అనిరుద్ధుడు | - | దేహేంద్రియములు, మనస్సు |

ఇట్లు చతుర్వ్యూహములు శిరస్సు నుండి మూలాధారము వరకు వ్యాపించి యుండగ ఆత్మ తత్త్వము శిరస్సు నందుండును. అదియే కేంద్రము. దాని నుండి ఏర్పడిన ధృవము ఇరుసువలె తిరుగుచు చతుర్వ్యూహములను, రూపమును ఏర్పరచుచున్నవి. ఈ ఇరుసు తిరుగుటకు కారణము కాలము అని ముందు ధ్యానములో చెప్పబడినది.

## MEDITATION - 53

(May 12, Aug. 1, Nov. 14, Feb. 3)

Soul is lunar. Pole is Solar. Soul reflects pole, it is full moon. Soul merges in pole and it is new moon. Pole is light, soul is life. The serpent unwinds the coils. Key and hook. Man is key, mind is hook. Pole is light, life is hook. Rotation of the clock opens the lock.

జీవుడు చంద్రాత్మకుడు. ధృవము సూర్యాత్మకము. జీవుడు ధృవమును ప్రతిబింబింపచేయును. అది పౌర్ణిమ. జీవుడు ధృవమునందు లయము చెందును. అపుడది అమావాస్య. ధృవము వెలుగు. జీవుడు ప్రాణము. సర్పము చుట్టలను సడలించుచుండును. తాళపు చెవి, కొక్కెము. మానవుడు తాళపు చెవి, మనస్సు కొక్కెము. ధృవము వెలుగు, ప్రాణము కొక్కెము. కాలభ్రమణము కాలమును తెరచును.

*వివరణము :*

జీవుడు చంద్రాత్మక ప్రజ్ఞ అని తెలుపబడినది. విశ్వాత్మ నుండి త్రిగుణముల ద్వారా ఏర్పడిన ప్రత్యగాత్మ జీవుడు. అందుచేత అతనిని ఆత్మ భావములు, త్రిగుణములు నడిపించు చుండును. ఉత్తర ధృవము (సహస్రారము) గుణముల కతీతమైన దైవము. జీవుడు దైవము నుండి తెలివిని, ప్రకృతి నుండి ప్రాణమును పొందుచున్నాడు. ప్రకృతి నుండి ఏర్పడు త్రిగుణముల నుండి ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులను పొందుచున్నాడు. ఇట్లు పొందు జీవుడు చంద్రాత్మకముగ నుండును. అనగా తనయందు దైవము, ప్రకృతి, వెలుగు, ప్రాణము, శక్తులు భాసించును. అవి తనవి కావు. చంద్రుని వెలుగు చంద్రునిది కాదు కదా! అట్లే జీవుడును. తనదనుకొనుట వలన అహంకార మేర్పడును.పై కారణముగ జీవుడు చంద్రాత్మకమని, అతనికి ఊర్ధ్వమూలమైన ధృవము సూర్యాత్మకమని తెలుపబడినది.

చంద్రుని యందు ప్రతిబింబించిన వెలుగు భూమికి చేరును. అపుడది పూర్ణిమ. అట్లే జీవునియందు ప్రతిబింబించిన తెలివి ప్రాణము. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులు దక్షిణ ధృవమున లేక మూలాధారమున ప్రతిబింబించును. ఉత్తర ధృవము శిరస్సునందు గల ప్రజ్ఞలు హృదయమందలి జీవునియందు ప్రతిబింబించగ జీవుని నుండి అతని దేహమునందు ప్రతిబింబించును. పై విధముగ

జరిగినపుడు శిరస్సు నందలి సమస్త ప్రజ్ఞలు దేహము నందుకూడ ప్రతిబింబించును. పౌర్ణమి నాడు భూమి ప్రకాశించినట్లే, జీవుని దేహము కూడ ప్రకాశము చెందగలదు. అపుడతడు పూర్ణుడు లేక పూర్ణ ప్రజ్ఞావంతుడు. అతనికి శిరస్సు నుండి మూలాధారము వరకు సమస్తము ప్రకాశవంతమై దేహము కూడ కాంతులను వెదజల్లు చుండును.

జీవుడు సహస్రారమును, ఆపైన ధృవమును చేరినచో అపుడు చంద్రుడు సూర్యునితో చేరినట్లుగును. అది అమావాస్యయే. అనగా తాదాత్మ్య స్థితి. అపుడు జీవుడుండక దేవుడే యుండును. పై కారణముగనే అమావాస్య పరమశివుని పరముగను, పౌర్ణిమను అమ్మవారి పరముగను ఋషులు కీర్తించిరి.

ధృవమునందు యున్నది గుణాతీతమగు వెలుగు. అందు సమస్త సృష్టిప్రజ్ఞలు ఇమిడి యున్నవి. ప్రాణము త్రిగుణము లేర్పడినపుడే ఏర్పడును. అనగా ప్రకృతి పురుషుల సమాగమము కారణముగ ప్రాణము పుట్టుచున్నది. దీనిని పరిశీలించిన ఋషులు ప్రాణమునకు మూలప్రకృతియే మాతృస్థానమని తెలిపిరి. అందువల ననే అమ్మవారిని కీర్తించినపుడు ప్రాణేశ్వరి, ప్రాణనాడి, ప్రాణదాత్రి అని స్తోత్రము చేయుచుందురు. ప్రకృతి గుణముల నుండి ఉద్భవించిన జీవుడు ప్రాణమే ఆధారముగ జీవించును. నిజమునకు జీవుడు ప్రాణస్పందనాత్మకుడే. జీవుడు ప్రాణ మాధారముగ జీవించగ,

ప్రాణము ప్రకృతి ఆధారముగ ఏర్పడుచున్నది. ప్రకృతి పరమాత్మని సంకల్పమై యుండుటవలన పరమాత్మ ఆధారముగ నుండును. కావున పరమాత్మ నిరాధారుడు. అతని నాధారముగ చేసుకుని మూల ప్రకృతి పుట్టినది. మూల ప్రకృతిని నాధారముగ చేసుకొని ప్రాణ మేర్పడుచున్నది. ప్రాణము నాధారము చేసుకొని జీవు డేర్పడుచున్నాడు. త్రిగుణాత్మకుడగు జీవు డాధారముగ దేహ మేర్పడు చున్నది. అందు ప్రాణము స్థూలముగ నుండును. జీవుని యందు ప్రాణము సూక్ష్మముగ నుండును. మూల ప్రకృతి యందు సూక్ష్మాతి సూక్ష్మముగ జనించును. అందువలన విశ్వాత్మ చైతన్యమును, జీవుడు వెలుగుగను, ప్రాణముగను పొందుచున్నాడు. అతనియందు తెలివి, ప్రాణము రెండు సూత్రములుగ యున్నవి. ప్రాణ మాధార ముగ తెలివియను ధృవమును పట్టుకొని, ఆలంబనము చేసుకొని జీవించును. దీనినే జీవుని శిరస్సునయున్న ధృవమున, తెలివియను వెలుగు యున్నదని జీవుడు ప్రాణ స్పందనాత్మకుడని ఈ ధ్యానము సూచించుచున్నది.

కాలమను సర్పము పరిభ్రమించుచుండగ సర్పపు చుట్టలు సడలునని మరియొక వాక్యము. అనగా కాలక్రమమున జీవుడు పరిణామము చెందుచుండగ అతని బంధనములు సడలునని యర్థము. పరిణామము చెందుటకు వలసిన తాళపుచెవి జీవుడే. తానెరిగిన సమస్త జ్ఞానము తనపై ప్రయోగము చేయుటయే పరిణామము చెందుటకు మార్గము. కాలక్రమమున జీవుడిది తెలియగలడు. వేదమునందు ఆరు తాళములు తెలుపబడినవి.

ఈ తాళములను తెరుచుటకు ఒకటే తాళపుచెవి యున్నది. అదియే జీవుడు. 1. శిక్ష, 2. కల్పము, 3. నిరుక్తము, 4. ఛందస్సు, 5. వ్యాకరణము, 6. జ్యోతిషము అను వేదాంగములను జీవుడు అభ్యసించి తనపై ఆ వేదాంగముల జ్ఞానము ప్రయోగించినచో తన యందలి షట్చక్రములు పద్మములుగ విచ్చుకొని జీవుడు సహస్రా రము చేరుటకు ఉపకరించును. అందువలన తాళము చెవిగ జీవుని ఈ ధ్యానమున పేర్కొనుట జరిగినది. ఈ తాళము చెవి, కొక్కెము నకు తగిలించినచో ఉపయోగము లేదు. జీవుని యందు కొక్కెము ఎక్కడ వున్నది? మనసే కొక్కెము. అది భ్రమ, భ్రాంతి, మొహము, రాగము, తృష్ణ, మరపు, అజ్ఞానములను ఏర్పరచును. మానవుడు మనస్సను కొక్కెమునుండి విడివడుటకు బుద్ధి ప్రచోదనమే శరణ్యము. బుద్ధి ప్రచోదనమైనచో కర్తవ్యము నెరిగి పరిణామమున ఊర్ధ్వముఖముగ ప్రయాణము చేయగలడు. ఇట్లు ఆజ్ఞా చక్రమును చేరినవారికి త్రిగుణములను దాటి సహస్రారమున దైవముతో నేకత్వము చెందినపుడు ప్రకృతి జనిత మైన ప్రాణమను కొక్కెము, అడ్డు తగల గలదు. ఉన్నతోన్నతమైన స్థితికి చేరిన జీవుడు ప్రాణ బంధమును కూడ దాటి ప్రకృతి అనుగ్రహ ముతో బ్రహ్మత్వమును పొందగలడు. అట్టివాడే బ్రహ్మర్షి యగు వశిష్ఠులు. తానట్టి వాడు కావలెనని విశ్వామిత్రుడు విశ్వప్రయత్నము చేసి బ్రహ్మర్షి అయ్యెను. వశిష్ఠుడు, అగస్త్యుడు సహజ బ్రహ్మర్షులు. ఇది అంతయు జీవునకు కాలభ్రమణమున (యుగముల పర్యంతము) తెలియ గలదు.

## MEDITATION - 54

(May 13, July 31, Nov. 15, Feb. 2)

Lock and key adjustments. Space expands. Horizontals meet verticals. Mind crosses matter. Time unfolds time. Life creates life. Father creates son.

తాళము, చెవి సర్దుబాట్లు. ఆకాశ వ్యాపనము. అడ్డు రేఖలు నిలువు రేఖలను కలియుట. మనస్సు పదార్థమును దాటుట. కాలము నుండి కాలము విచ్చుకొనుట. ప్రాణము నుండి ప్రాణము విచ్చు కొనుట. తండ్రి కుమారుని సృష్టించుట.

*వివరణము :*

తాళము అనగా బంధములని, తాళముచెవి సత్సాధకుడైన మానవుడని ముందు ధ్యానమున తెలుపబడునది. అడ్డురేఖలు ఇంద్రియముల నుండి బాహ్యమునకు ప్రయాణించు మనస్సుకు చిహ్నము. సామాన్య మానవుడు సతతము బహిర్గతుడుగా నివసించును. మనస్సు ఇంద్రియముల ద్వారా దేహముతో బాహ్య ప్రపంచముననే ప్రవర్తించుచుండును. మరల ఇంద్రియములు బైట ప్రపంచము నుండి విషయములను ఇంద్రియముల ద్వారా మనస్సు పొందుచు ప్రతిస్పందించు చుండును. ఇట్లు కేవలము బాహ్య జీవనముతోనే మానవుని జీవితము వ్యయమై పోవును.

ఇట్టి జీవుడు యోగ సాధన ద్వారా ఇంద్రియ వ్యాపారముల నరికట్టినచో మనసంతర్ముఖమగును. ఇది ఒక తాళము తెరచుట వంటిది. అంతర్ముఖమైన మనస్సు అంతఃకరణమగు బుద్ధియందు ప్రవేశించు సమయమున ఊర్ధ్వమగును. అది ఇట్లు ఊర్ధ్వమగుట అడ్డురేఖలను నిలువురేఖలు కలియుటగ ధ్యానము తెలుపుచున్నది. మనస్సు బుద్ధిని చేరినచో మరియొక తాళము విడివడును. మనస్సు నకు పదార్థపు అనురక్తి వీడి విజ్ఞానము ప్రజ్ఞానము అగు లోకముల విహరించుటకు ఉత్సహించును. అపుడు ఇంద్రియములను, దేహమును కర్తవ్యమునకే వినియోగించుచు మిగిలిన సమయ మంతయు విజ్ఞాన లోకముల విహరించును, వ్యాపించును కూడ.

ఆకాశమనగా వెలిగింపబడినది.అపుడు సాధకుని మనస్సు ఆకాశము వలె వ్యాపించును. అది బుద్ధియై వెలుగును. బుద్ధి ఆత్మ తత్త్వమును చేరుచుండ కాలము విచ్చుకొని సత్సాధనకు కాలము దొరకును. అనగా జ్ఞానోపాసనకు, స్వాధ్యాయమునకు సమయ మనుకూలించును. కాలము బంధింపదు. బుద్ధి ఆత్మ తత్త్వమునకై ఎగబ్రాకుచుండగ స్థూల ప్రాణమునుండి జీవుడు సూక్ష్మ ప్రాణములోనికి ప్రవేశించును. ఈ విధముగ స్థూల ప్రాణ బంధమును కూడ వీడును. ఆత్మ సాక్షాత్కారమున దివ్యుని వలె వెలుగును. దైవకుమారుడని గుర్తింపబడును. ఈ పయనమున మనసు పదార్థమును వీడుట, కాలము అనుకూలించుట, ప్రాణము దారి నిచ్చుట అనునవి, బంధచ్ఛేదన సంఘటనలు. అపుడు జీవుడాత్మవంతుడై దైవమువలె ప్రకాశించును. అపుడు దైవము నుండి పుట్టినవాడని జీవునికి అనుభూతమగును.

## MEDITATION - 55

(May 14, July. 30, Nov. 16, Feb. 1)

Space is globe. Time is spiral. From globe spiral springs. With spiral the globe fills. Space and time are the knower and the known.

చోటు గోళముగ నున్నది. కాలము లతవలె ఊర్ధ్వము నుండి అధస్సునకు చుట్టలు చుట్టలుగ అల్లుకొని యున్నది. చోటు నుండి కాలము ఉద్భ వించుచున్నది. కాలపు టల్లికతో చోటు నిండినది. తెలుసుకొనునది చోటు. తెలియబడునది కాలము.

*వివరణము :*

భగవత్ తత్త్వము చోటు వంటిది. నిజమున కది చోటే. అందు అన్నియు నున్నవి. లేనిది లేదు. ఉన్నది పోదు. సమస్తము కాలక్రమమున వ్యక్తమై మరల కాలక్రమమున అవ్యక్త మగుచున్నది. వ్యక్తమైనట్లు కనపడుచున్నది. అవ్యక్త మగుట యనగా స్థూలము నుండి సూక్ష్మము చేరుట. సూక్ష్మము నుండి సూక్ష్మతర మగుట, చోటగుట. ఇట్లు కాలపుటల్లికలో తత్త్వము సృష్టి గోళములోను, సృష్టి దేహములుగను, సృష్టి జీవులుగను దిగివచ్చు చుందురు. మరల ఈ తత్త్వమే ఆరోహణ క్రమమున జీవుడు తనను తాను వెదకి కొనుచు తత్త్వమును చేరును. తత్త్వమన్నను, చోటు అన్నను, పరతత్త్వమన్నను చోటే! వున్నది చోటు, అదియే సత్యము. అది అవస్థితి చెందినపుడు ఏడు దశలలో పదార్థమగును. ఇది కాలము యొక్క అవరోహణ మార్గము. మరల కాలము యొక్క ఆరోహణ మార్గమున తనను తాను తెలుసుకొనుటకు ప్రయత్నించి ఏడు దశలలో తెలుసుకొనును.

ఇట్లు తెలుసుకొనువాడు దేహమందలి చోటు. వానిని జీవుడందురు. అతడు కాలము యొక్క తీరుతెన్నులు తెలియుచు తనను తాను చేరును. తెలుసుకొనువాడు చోటు తెలియ బడునది కాలము. కాలమును తెలిసినవాడు సమస్తమును తెలిసినవాడు.

## MEDITATION - 56

(May 15, July 29, Nov. 17, Jan. 31)

Space is globe, universe is lotus. Globe unfolds into lotus. Space unfolds into universe. Globe is potential lotus.

ఆకాశము (లేక చోటు) గోళాకారము. సృష్టి పద్మాకారము. గోళమే పద్మముగ వికసించును. చోటే సృష్టిగ వికసించును. గోళము పద్మ గర్భితము.

*వివరణము :*

ఏమీ లేనట్టుగ మన చుట్టును, పైన, క్రింద వ్యాపించిన చోటు సమస్తమును సూక్ష్మముగ ధరించి యుండును. చోటు గోళముగ నున్నది. అందుండి పుట్టు సృష్టికూడ సృష్టిగోళముగ ఉద్భవించి వికసించును. సృష్టిగ వికసించును. వికసించిన సృష్టిని పద్మమందురు. వికసించని సృష్టి గోళముగ నుండును. చోటు నుండి సృష్టిగోళము ఏర్పడగ సృష్టిగోళముల నుండి సృష్టి గోళము విచ్చుకొని అందుండి అసంఖ్యాకములైన సూర్యగోళములు, గ్రహగోళ ములు సప్తసప్తిగ వికసించుచున్నది. సృష్టియందు పుట్టు భూతకోటి అంతయు కూడ ముందు గోళముగ నేర్పడి అటుపై వికసించు చుండును. విత్తనము గోళాకారము. పక్షులు, జంతువుల నుండి పుట్టినటువంటి అండములు గోళాకారములు గర్భస్థులైన శిశువు మొదట గోళాకారమే. అటుపైన అందుండి వెన్నెముక ఏర్పడి కన్ను, ముక్కు, కాలు, చెయ్యి ఏర్పడుచున్నవి. సృష్టికి పూర్వము సృష్టి యందు గోళాకారము ప్రధాన స్థానమున నిలచియున్నది దీనినే పూర్ణమని కూడ అందురు. చోటు పూర్ణము. అందుండి దిగి వచ్చిన వన్నియు మొదట పూర్ణములే. అటుపైన కమలములు. పై కారణముగ పూర్ణ రూపములను, కమలములను ఆరాధన చేయు సంప్రదాయము ఏర్పడినది. వికాసము చెందినపుడు కమలము, అంతర్హితముగ నున్నప్పుడు గోళములు అని తెలియవలెను.

## MEDITATION - 57
(MAY 16, JULY 28, NOV. 18, JAN. 30)

Man in globe. Lotus is in man. The heart of space is man. The heart of man is space. The heart of space is the centre. The heart of man reflects the circumference.

మనిషి గోళాకారమగు చోటుయందు వున్నాడు. పద్మము మనిషి యందున్నది. చోటు గోళము యొక్క హృదయమే మానవుడు. మానవుని యొక్క హృదయమే చోటు. చోటు గోళముయొక్క హృదయము. సృష్టికి కేంద్రము. మానవుని హృదయము పరిధిని ప్రతిబింబించు చున్నది.

*వివరణము :*

చోటు నందు మానవుడున్నాడు. మానవుని హృదయమందు మరల చోటు వున్నది. చోటు నందు పుట్టిన మానవుని యందు చోటున్నది. సముద్రము అల యందున్నది. అలయందు సముద్ర మున్నది. అల సముద్ర మందుండుటచే సముద్రము అల యందున్నది. నిజమునకు అల సముద్రమే. అల తత్త్వము సముద్ర తత్త్వమే. సముద్రము స్థితి భేదముచే అల యగుచున్నది. స్థితి భేదము కలిగినను అల మూలము సముద్రమే కదా! స్థితి బేధము వలన అలకు ఎగిరిపడు గుణ మేర్పడినది. అట్టి గుణములకు అతీతముగ సముద్ర మున్నది.

పై విధముగనే చోటు నుండి మానవు డుద్భవించినాడు. మానవుని హృదయమున నున్నది చోటే. మానవుడు మూలమున చోటే అయినను, సప్త కేంద్రములు, సప్తధాతువులు గల పద్మముగ వికసించు చున్నాడు. ఈ వికాసమునకు కారణము అతని కేంద్రమున నున్న చోటే. కేంద్రము నుండి పరిధికి విచ్చుకోలు జరుగును. మానవుని హృదయము నుండి, అతని గుణముల రూపము విచ్చుకొనుచున్నవి. అందువలన మానవునియందు, కమలమువలె విచ్చుకొను ప్రవృత్తి కలదు. ఆ ప్రవృత్తి అతని హృదయమున నున్నది. ఆ హృదయము చోటే.

చోటు సృష్టిగ విచ్చుకొనినపుడు దానికి పరాకాష్ఠగ మానవు

డేర్పడుచున్నాడు. సృష్టియందు మానవుని ఆవిర్భావము సృష్టియొక్క పరిపూర్ణత. సప్తలోకములతో కూడిన ప్రతిసృష్టిగ మానవుని ఏర్పాటు చేయుటయే సృష్టి లక్ష్యముగ తెలియవలెను. అందుచేత అతడు సృష్టి హృదయము. అట్లే మానవుడు తన హృదయ మందలి చోటును తెలియుట అతనికి లక్ష్యము, గమ్యమును కూడ. మానవుడు సృష్టికి పరిధి. మానవునికి సృష్టి పరిధి. సృష్టి వ్యాపనము ప్రజ్ఞ పదార్థముల యొక్క క్రీడగ మానవుని యందు పరిణతి చెందును. మానవుడు తనయందలి ప్రజ్ఞ పదార్థములు సమన్వయించుకొని తన నిజ స్వరూప మెరిగి పరిణతి చెందును. పై విధముగ వీరిరువురును ఒకరికి ఒకరు పరిధి. అట్లే ఒకరి కొకరు కేంద్రము. అల, సముద్రము ఉదాహరణము బాగుగ అవగాహన చేసుకొనినచో ఈ ధ్యానము అవగాహన కాగలదు.

## MEDITATION - 58

(MAY 17, JULY 27, NOV. 19, JAN. 29)

Serpent unwinds into spiral. Globe of space unfolds into lotus. Serpent of time unwinds into spiral. Serpent is in lotus. Lotus is in globe. Globe is in mind.

కాలసర్పము చుట్టలు విప్పుచున్నది. సృష్టి గోళము పద్మమువలె విచ్చుకొనుచున్నది. విచ్చుకొను కాలమున లతవలె వర్తులాకారముగ ప్రాకుచు పద్మకోశములను నేర్పరచు చున్నది. అట్లేర్పరచుచు పద్మము మొత్తమునందిమిడి యున్నది. పద్మము గోళమందున్నది. గోళము మనస్సు నందున్నది.

*వివరణము :*

వేదమునందు కాలమును సర్పముగ సంకేతించిరి. అది వర్తులాకారముగ చుట్టలు విప్పుచుండగ మన్వంతరములు, యుగములు, అధోముఖముగ ఏర్పడుచున్నవి. అట్లేర్పడుచున్నప్పుడు దాని నాధారము చేసుకొని సప్తలోకముల సృష్టి అధోముఖముగ ఏర్పడును. సత్యయుగము (కృతయుగము) నుండి కలియుగము వరకు కాలము దిగివచ్చు చుండగ, సత్యలోకము నుండి భూలోకము వరకు సప్త కోశములుగ సృష్టిపద్మము వికసించు చుండును. స్వాయంభువ మనువు నుండి స్వారోచిష, ఉత్తమ, తామస, రైవత, చాక్షుష, వైవస్వత మనువు లేర్పడగ ఏడు మన్వంతరములలో ఏడు లోకముల సృష్టి దిగివచ్చు చుండును. ఇది అంతయు వేదాంగమగు కల్పమున వివరింపబడినది. ఇట్లు అండాకారముగ నున్న సృష్టి ఏడు కోశములు (అరలు) గల పద్మము వలె వికసించును. ఇది అవరోహణ క్రమము. ఇది అంతయు కాలము కనపడక నిర్వర్తించుచున్నది. కాలము ఇన్ని కోశముల యందు వ్యాపించి యున్నది. సృష్టియందు కాలమే దైవమని, కాలరూపమున దైవమే సృష్టియందు అంతర్యామిత్వము చెంది యున్నాడని మన ఋషులు, గ్రంథములు ఘోషించు చున్నవి. అందువలన అంతర్యామి యగు కాలస్వరూపమును ఆరాధించుచు సృష్టియందు జీవించుట కర్తవ్యమై యున్నది.

మానవునియందు కూడ సప్తలోకములు సప్త ప్రజ్ఞలుగ నున్నవి. అవి సహస్రారము నుండి మూలాధారము వరకు ఏర్పడి యున్నవి.

మరల మూలాధారము నుండి సహస్రారము చేరుటయే, కలియుగము నుండి కృతయుగము చేరుటగను, వైవస్వత మనువు నుండి సావర్ణి మనువుల ద్వారా ఆదిని చేరుటగను తెలియవలెను. కాలమునకు ఆరోహణ, అవరోహణ క్రమములు గలవు. అవరోహణ క్రమమున సృష్టిగోళము సృష్టిగ విచ్చుకొనును. ఆరోహణ క్రమమున సృష్టిపద్మము మరల గోళమగును. ఈ విచ్చుకొనుట, ముడుచు కొనుట సమస్తము నందును దర్శించవచ్చును. అట్లు దర్శించిన వానియందు, సృష్టి పుట్టుక, వృద్ధి, లయము కూడ దర్శింపబడును. అట్టివారే బ్రహ్మ ఋషులు- వారి మనస్సున సృష్ట్యాది అంతముల మొత్తము కథ భాసించగలదు. అదియే ప్రతి జీవుని గమ్యము. అటుపైన కేవలముండుటయే యుండును.

## MEDITATION - 59

(May 18, July 26, Nov. 20, Jan. 28)

Man is bound in Chakra. Chakra breathes out lotus. Lotus delivers serpent. Serpent is Kundalini. Lotus is Padma. Chakra is the wheel. The wheel rotates.

మానవుడు చక్రమున బంధింపబడి యున్నాడు. చక్రము, నిశ్వాస నుండి పద్మము నేర్పరచు చున్నది. పద్మము కుండలినిని ప్రచోదనము చేయుచున్నది. సర్పము కుండలిని. పద్మము వికాసము. చక్రము కాలవలయము. వలయము ఆవర్తనములు చేయును.



*వివరణము :*

దైవాంశ సంభూతుడగు జీవుడు త్రిగుణముల ద్వారమున దేహమున బంధితు డగుచున్నాడు. పంచప్రాణములు, పంచేంద్రియ ములు, పంచభూతాత్మక మగు శరీరము అతడు పొందునపుడు అందు బంధింపబడుట జరుగును. అట్లు జీవుడు దేహమున నిబద్ధు డగుచున్నాడు. నిబద్ధము చేయు కేంద్రములు చక్రములవలె పని చేయును. ఒకే కాలచక్రము నుండి అనేకానేక ఆవర్తనము లేర్పడి నపుడు కాలచక్ర మాధారముగ జీవుడవరోహణ చెందుటకు, అందు నిబద్ధు డగుటకు వివిధ ఆవర్తనములతో కూడిన చక్రములను మానవుడి సూక్ష్మ శరీరమున దేహ నిర్మాణ సమయమున దేవత లేర్పరచిరి.

జీవుడు అవరోహణ మార్గమున పదార్థమయ ప్రపంచమునకు ఆకర్షితు డగుచున్నంతకాలము దేహబద్ధత యుండును. మరల మరల దేహములు ధరించుట యుండును. చక్రముల ద్వారా బంధింపబడుట యుండును.

పరిణామ క్రమమున జీవుడు పదార్థము నుండి పరమార్థము వైపునకు ఆకర్షింప బడుచున్నప్పుడు చక్రములు నిశ్వాస చేయుట యుండును. నిశ్వాస ముక్తిమార్గము. యోగ సాధనము ద్వారా ప్రాణాయామాది ప్రక్రియలలో నిశ్వాసాభ్యాసమున క్రమముగ సాధకుని యందలి షట్చక్రములు నిశ్వాసనా బలముచే పద్మముల

వలె విచ్చుకొనుట జరుగును. చక్రము బంధనము స్వభావముగా గలవి. పద్మము వికాసము స్వభావముగా గలది. యోగవిద్య జీవుని వికాసము కొరకే. యోగసాధనా మార్గమున మనోమయ, విజ్ఞాన మయ కోశములు వికాసము చెందుచుండగ, చక్రములు పద్మములు కాగలవు. తత్కారణముగ బంధములు సడలింపబడును. జీవుని చైతన్యము సుషుమ్న ద్వారా ఊర్ధ్వగతి చెందుచుండును. ఊర్ధ్వగతి చెందు చైతన్యము తెల్లని నాగుపాము ఎగబ్రాకు చున్నట్లుండును. ఇదియే కుండలిని చైతన్యమని యోగమున తెలుపుదురు. వికసించునది పద్మము. వలయముల నేర్పరచునది చక్రము. కాలచక్ర వలయము నుండి అనేకానేక ఆవర్తనములు కూడ ఏర్పడును.

## MEDITATION - 60

(May 19, July 25, Nov. 21, Jan. 27)

Ten times ten. The wheel rotates. Three wheels from one wheel. A total of four wheels. Three above and four below. Seven wheels rotate in three directions. 7 and 3 is ten.

పదిపర్యాయములు పది. చక్రము భ్రమించుచున్నది. ఒక చక్రము నుండి మూడు చక్రములు. మొత్తము నాలుగు. మూడు పైన, నాలుగు క్రింద. ఏడు చక్రములు మూడు విధములుగ భ్రమణము. 7 మరియు 3 కలసి పది.

*వివరణము :*

పది (10) ఋగ్వేదమున పరిపూర్ణమగు అంకె. ఎనిమిది ప్రకృతులు, తొమ్మిదవదైన మూల ప్రకృతికి ఆధారముగ నుండు తత్త్వమును పది అందురు. పరమపురుషుడందురు. పరిపూర్ణత్వ మందురు. ఆ తత్త్వము సృష్టి కతీతముగ నున్నది. పది, పది అవతరణములు కూడ చెందియున్నది. పదియే పదిమార్లు అవరోహ ణము చెందినచో ఈ కనపడుతున్న సృష్టియగును. మరల ఆరోహణ క్రమమున తానుగ నుండును.

ఈ అవరోహణము, ఆరోహణము కాలభ్రమణమున జరుగును. అందువలన సృష్టియందలి దైవము కాలమే. పది అవతరణములు ఈ క్రింది విధముగ నున్నవి.

1. కాలము (దైవము), 2. మూల ప్రకృతి లేక అదితి, 3. రజస్సు (అహంకారము), 4. తమస్సు (మనస్సు), 5. సత్త్వము (బుద్ధి), 6. ఆకాశము (శబ్దము), 7. వాయువు (స్పర్శ), 8. అగ్ని (చూపు), 9. జలము (రుచి), 10. పృథివి (వాసన).

ఒక చక్రము నుండి మూడు చక్రములు పుట్టినవి అనగా కాలచక్రము ఆధారముగ మూల ప్రకృతి నుండి మూడు గుణముల చక్రము లేర్పడుట. రజస్సు, తమస్సు, సత్త్వము వాటి వాటి లక్షణముల ననుసరించి రకరకములుగ సృష్టిక్రియ జరుపుచు

నుండును. ఈ మూడు గుణముల సృష్టిని స్థూలముగ మూడు లోకములని కూడ అందురు. వీటినే భూః, భువః, సువః లోకము లందురు. అనగా పదార్థమయము, శక్తిమయము, ప్రజ్ఞామయము అగు లోకములని అర్థము. పదార్థమయ లోకమున శక్తి, ప్రజ్ఞ కూడ వున్నప్పటికిని పదార్థ మెక్కువుగ నుండుటచే దానిని భూలోక మందురు. అట్లే మిగిలిన రెండు లోకములందు కూడ వరుసగ శక్తి, ప్రజ్ఞ మిగిలిన వాటికన్న మిన్నగ నుండును.

ఈ మూడు గుణములు, మూడు చక్రములుగ వాటి వాటి వేగములతో తిరుగుచుండుగ, వీటి కలయికల వలన ఏర్పడునది నాలుగవదిగ నుండును. అదియే సృష్టి. డికాక్షన్, పాలు, పంచదార- ఈ మూడును కలిసినపుడు కాఫీ తయారగుచున్నది కదా! అటులనే సృష్టి మూడు గుణముల దారములతో అల్లబడుచున్నది. కాఫీకి తనదైన అస్థిత్వము లేదు. అది మూడు విషయముల కలయిక నుండి పుట్టినది. అట్లే సృష్టికి తనదైన అస్థిత్వము లేదు. అది మూడు గుణముల ఆధారముగ ఏర్పడుచున్నది. ఈ నాలుగవది యగు సృష్టి చక్రము మూడింటిపై ఆధారపడును.

పై తెలుపబడిన నాలుగవ చక్రము పరిభ్రమించు చుండగ అందుండి మరల పై మూడు ప్రతిబింబించి మరియొక మూడు చక్రములుగ తిరుగును. అట్లు మొత్తము ఏడు చక్రములుగ తిరుగుచు ఏడు లోకముల సృష్టి ఏర్పడుచున్నది. ఈ ఏడు

లోకముల సృష్టి మూడు గుణముల విన్యాసమే. పై విధముగ త్రిమూర్తులు, సప్తలోకములు, తానుగనే ఏర్పడి యున్నదని దాని అంకె పదియని పెద్దలు పలుకుదురు. ఇదియే దశావతారములు. పదిని మించియున్న తత్త్వము పదిగ అవతరించి యున్నాడని తెలియచెప్పుట. దీనినే పురుష సూక్తమున *'అత్యతిష్ఠ ద్దశాంగుళమ్'* అని అందురు.

## MEDITATION - 61

(May 20, July 24, Nov 22, Jan. 26)

Seven wheels in three Lokas. Twenty-one wheels. The twenty second is I AM. I AM is more than nought, less than one. Twenty-one plus I AM divided by seven is the value of Pi.

మూడు లోకములలో ఏడు చక్రములు. ఇరువది ఒక్క చక్రములు 22వది 'నేను'. నేను సున్న కన్న ఎక్కువ. 1 కన్న తక్కువ. 21 మరియు నేను, 7చే భాగింపబడినచో వ్యాసమగును. (వ్యాసుడగును.)

*వివరణము :*

భూః, భువః, సువర్లోకములు స్థూలముగ సృష్టి లోకములు. 7 లోకములుగ చెప్పదలచినప్పుడు భూలోకమని, భువర్లోకమని, సువర్లోకమని, మహర్లోకమని, జనోలోకమని, తపోలోకమని సత్య లోకమని తెలుపుదురు. ఈ లోకము లన్నియు త్రిగుణములతో చేయబడినవియే. మొదటి మూడు లోకములందు పదార్థ మెక్కువుగ నుండును. తరువాత రెండు లోకములందు శక్తి ఎక్కువగ నుండును. తరువాత రెండు లోకముల యందు ప్రజ్ఞ ఎక్కువగ నుండును. ఈ ఏడు కేంద్రముల ఆధారముగ సృష్టి నిర్మాణము జరుగగా అందన్నిటి యందును పరమాత్మ వ్యాపించి యుండును. కేంద్రము నుండి పరిధి వరకు వ్యాపించి యుండును. ఏడు లోకములు త్రిగుణాత్మకములే. అందు పదార్థము, శక్తి, ప్రజ్ఞ హెచ్చుతగ్గులుగ వ్యాపించి యున్నవి. మూల ప్రకృతియే త్రిగుణాత్మకమైనది. ఏడు లోకములలోని మూడు గుణములు 21 అంశములైనవి. ఆత్మ తత్త్వమునకు అంకె లేదు. అది సున్న కన్న ఎక్కువ, ఒకటి కన్న తక్కువ. అది 22వది అనలేము. కావున 21 కన్న ఎక్కువ, 22 కన్న తక్కువ. గణిత శాస్త్రమున కేంద్రము నుండి పరిధికి కల దూరము కూడ ఇట్టిదియే.

$$\pi = \frac{21 + X}{7} \longleftarrow X \ (0 < X > 1)$$

I am less than *one* and more than *zero*

అది 21 + ÷ (divided by) 7. దీనిని వ్యాస మందురు. వ్యాసుడు అనగా కేంద్రము నుండి పరిధికి కొని వచ్చు ప్రజ్ఞ అని అర్థము. వ్యాసుడు నారాయణుడే కదా! కలి యుగమునకు వేద వాఙ్మయమును అందించిన విష్ణురూపు డతడు. ఆత్మజ్ఞానము కలిగి జీవుల అజ్ఞానమును పారద్రోలుటకు వలసిన సమస్త మార్గములను ఏర్పరచిన వాడతడు. అత డాత్మస్వరూపుడే. ఆత్మ అనగ నేనే. దాని విలువ 21+ ÷ (divided by) 7 21+÷7 దీనినే గ్రీకు దేశస్థులు 'పి' అని పిలిచిరి. భారతీయులు, ఆంగ్లేయుల ననుసరించి 'పై' అని పిలుతురు. గ్రీకులు 'పి' అనియే వ్యవహ రింతురు.

కేంద్ర మాధారముగ పరిధి ఏర్పడుచున్నది. ఆత్మ ఆధారముగ సృష్టి ఏర్పడుచున్నది. కేంద్రము లేని పరిధి లేదు. ఆత్మ లేని సృష్టి లేదు. నీవు లేని నీ పరిసరములు లేవు. నీ వుండుట వలన నీ కవి వున్నవి. అట్లే పరమాత్మ యుండుట వలన సృష్టి యున్నది. తనకును తన సృష్టికిని గల సంబంధమే వ్యాసము లేక వ్యాసుడు. నీకును నీ సృష్టికిని గల సంబంధము వ్యాసు డవగలడన్నచో నీవు సత్యవ తేయుడవు కావలెను. అనగా సత్యమే ఆధారముగ జీవింప వలెను.

## MEDITATION - 62

(May 21, July 23, Nov 23, Jan. 25)

Man is centre, space is circumference. The ring of the horizon rotates. Life span is diameter. From the centre to the circumference through the diameter is Pi.

మానవుడు కేంద్రము. ఆకాశము పరిధి. చుట్టును గల వలయము (Horizon) తిరుగుచున్నది. ఆయుష్షు వ్యాసము. కేంద్రము నుండి పరిధికి గల సంబంధము, దేవునికి జీవునికి గల పవిత్ర బంధము.

*వివరణము :*

మానవుడు కేంద్ర ప్రజ్ఞకాగ అతని చుట్టును గల చోటు వలయాకారమగు ఒక పరిధిగ గోచరించును. అట్లే ప్రతి మానవునకును తనదైన పరిధి ఒకటి యుండును. పరిధిని మించి జీవించ లేడు. అది శక్తి సామర్థ్యముల రూపములోను, ఆయుష్షు రూపములోను యుండును. అనగా అతనికి, అతని తెలివి, ప్రాణము, పరిధులుగ ఏర్పడును. కేంద్రము నుండి పరిధికి వ్యాస మాధారముగ పయనించ వచ్చును. తెలివి, ధర్మమార్గమును పెంచు కొనువారికి ప్రాణము పెరుగును. పెరిగిన ఆయుః పరిణామమును ధర్మానుష్ఠానమునకై సద్వినియోగపరచ వచ్చును. ఇట్లు సాగినచో వ్యాసము వెంట సాగినట్లు, వ్యాసుని సాన్నిధ్యమున పురోగమించు చున్నట్లు.

పరిధులు మానవుని తెలివిని బట్టి ఏర్పడుచున్నవి. చీమ, దోమ పరిధుల కన్న పులి, సింహము పరిధులు పెద్దవి. అట్లే సామాన్యుని కన్న వ్యాపారము చేయువారు, వారికన్న ప్రభుత్వ అధికారులు, వారికన్న సలహాదారులు, పండితులు ప్రజ్ఞ యందు విస్తారమైన వారు. దాని వినియోగమును బట్టి ఆయుః ప్రమాణ ముండగలదు.

పైన తెలుపబడిన వారికన్న జ్ఞానులు, యోగులు, ఋషులు, సిద్ధులు మరింత విస్తారముగల ప్రజ్ఞ కలవారు. వ్యాసము వెంట

నడచుట యనగా ప్రజ్ఞ ద్వారా వ్యాపనము చెందుటయే. ఇట్టి వ్యాపనము లోకములు కూడ దాటకలదు. తపస్విజను లందరు తపస్సుచే ఇట్టి వ్యాపనము చెందగలరు. సత్యలోకము, బ్రహ్మ లోకము కూడ చేరిన తపస్విజనులు దీని కుదాహరణములు.

## MEDITATION - 63

(May 22, July 22, Nov. 24, Jan. 24)

Pi is wisdom. Wisdom is objectivity. The power of Pi is the power of thought. Thought leads man to himself.

కేంద్రమునకు పరిధికి గల సంబంధమే జ్ఞానము. జ్ఞానికి అతడెరిగిన జ్ఞానము అతని కన్న ఇతరమగును. అట్టి జ్ఞానమే మేధాశక్తి లేక జ్ఞానశక్తి. జ్ఞాన మాధారముగ జీవుడు తనను తాను చేరగలడు.

*వివరణము :*

జీవునికి దైవమునకు నడుమ గల మాయావరణమును జ్ఞానమొక్కటే దగ్ధము గావించగలదు. సహజముగ తాను దైవమే అయినను జీవుని కది తెలియకుండుట మాయ. అట్టి మాయ నుండి తరింపచేయు విద్యయే జ్ఞానము. "జ్ఞాన మనగ నేనే. జ్ఞేయము నేనే. (అనగా తెలుసుకొన తగినది నేనే)" అని భగవంతుడు పలికినాడు. ప్రతి మనిషి తనయందలి నేను తానే అని తెలియుటకు విద్య యొకటి యున్నది. అదియే యోగవిద్య. యోగ విద్యా బలమును మించిన బలము లేదు. సనక సనందనాదులు, నారదుడు, వశిష్ఠుడు, పరాశరుడు, వ్యాసుడు, శుకుడు, మైత్రేయుడు యోగవిద్యా బలముననే లోకములను చక్కపెట్టు చున్నారు. ఈ బలము మరి ఏ విద్యకును లేదు. ఈ విద్యయందు సిద్ధి పొందిన వారు శాశ్వతులై, కుమారులై యుగముల పర్యంతము సృష్టి యజ్ఞమును గావించు చున్నారు.

## MEDITATION - 64

(May 23, July 21, Nov. 25, Jan. 23)

Man is bound in six charkas and the seventh. Man is liberated in six lotuses and the seventh. Man liberated into Kundalini. Kundalini is serpent. Serpent is spiral. Spiral is time. Time is mind.

మానవుడు షట్చక్రముల యందు, సప్తమము నందు బంధింపబడి యున్నాడు. షట్పద్మముల యందు, సప్తమమునందు ముక్తుడగు చున్నాడు. అతడు కుండలిని యందు ప్రవేశించుటయే ముక్తి. కుండలిని సర్పము. సర్పము నాగమై, ఊర్ధ్వ గమనము వలయాకారముగ చేయును. వలయము కాలము. కాలము మనస్సు.

*వివరణము :*

షట్చ్రక్రములచే మానవుడు బంధింపబడి యున్నాడు. భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు అను ఆరు అంశములు మానవుని శరీరబద్ధునిగ చేయుచున్నవి. అతడు ఏడవ వాడు. అహంకారము వలన మనస్సు షడ్వికారములు చెందుటచే, షట్చ్రక్రముల యందు బంధన ముండును. యజ్ఞార్థబుద్ధి, ధర్మాను ష్ఠానము, నిర్మల, నిరహంకార ప్రవర్తనము కలిగిన మానవుడు మనోవికారములు చెందక, షట్పద్మముల నుండి ముక్తుడై, సహస్రదళ పద్మమున స్థితి గొనును. బంధించునవి చక్రములు సడలించునవి పద్మములు. చక్రములు సృష్టి వలయమున త్రిప్పును. పద్మములు అందుండి వికసింపచేసి ఉద్ధరించును.

మానవుని ఉద్దారణము నతడు కుండలినియందు జేరినపుడు జరుగును. కుండలిని తనయందు గల దివ్య చైతన్యమే. దివ్య చేతనచే స్పృశింపబడిన మానవ చేతన మాయావరణములను దాటకలదు. అది మన వెన్నముకలో గల, సుషుమ్న నాడిలో, చిత్రిణి అను వెలుగుగ యున్నది. అంతర్ముఖ ధ్యానమున దీనిని పొందవచ్చును. అంతర్ముఖు డగుటకు బహిర్ముఖ ఆకర్షణలను అధిగమించవలెను. ఇది యోగమున మొదటి మెట్టు.

కుండలిని సుషుమ్న యందుగల బ్రహ్మరంధ్రములో ఆవర్తనములు చేయుచు ఊర్ధ్వముగ సాగు సర్పము. మానవుని పరివర్తనమును బట్టి కుండలిని చైతన్యము ఊర్ధ్వ, అధో గమనములు చేయుచున్నది. నిజమునకు ఈ ఆవర్తన గమనము లన్నియు కాలమే. అదియే అధోలోకమున మనస్సుగ పనిచేయును.

## MEDITATION - 65

(May 24, July 20, Nov. 26, Jan. 22)

Wheel of time rotates. Serpent of time unwinds. Wheel is cut in the East. Wheel cut is serpent. Wheel cut has head and tail. Serpent has head and tail. Time lived as head and tail. Time before life is wheel. The wheel rotates. The serpent creeps on.

కాలచక్రము భ్రమణము చేయుచున్నది. కాలసర్పము చుట్టలు విప్పుచున్నది. చక్రము తూర్పున కత్తిరింపబడినది. కత్తిరింపబడిన చక్రము సర్పము. కాలచక్రము కత్తిరింపబడుట వలన తల, తోక లేర్పడినవి. సర్పమునకు తల, తోక కలిగినది. కాలము ఆది, అంతములుగ సాగుచున్నది (జీవించు చున్నది). జీవనమునకు ముందు కాలము చక్రమే. ఈ చక్రమునకు భ్రమణమే లక్షణము. ఈ సర్పమునకు ఎగబ్రాకుట, దిగబ్రాకుటయే లక్షణము.

*వివరణము :*

కాలచక్రము భ్రమణము లక్షణముగ గలది. చక్రమునకు మొదలు, తుది లేదు. వృత్తరేఖపై ఒక బిందు వేర్పరిచినచో అదియే మొదలు. అదియే తుది కూడ. ఆరంభమునందే అంతమున్నది. అంతమునం దారంభమున్నది. అది అనంతము, అనాది. వలయా కారమగు కాలము, సంకల్పము కారణముగ మొదలు, తుదిగ ఏర్పడుచున్నది. సూర్యుడు భూమధ్యరేఖను ఉత్తరముగ దాటు సమయమును, ఉత్తరము నుండి దక్షిణమునకు దాటు సమయ మును ఋషులు గుర్తించిరి. ఈ దాటుటను కాలవలయము యొక్క కత్తిరింపుగ గుర్తించిరి. కృత్తిక యనగ కత్తెరయే. ఋగ్వేద మున నక్షత్ర మండలములు కృత్తికతోనే ప్రారంభమగును. అదియే మేషమున కారంభమని ఋషులు కీర్తించిరి. అదియే సంవత్సరాదిగ తెలుపుదురు. కాలము చక్రము కాగ దివ్య సంకల్ప కారణముగ అది విభజింపబడినపుడు, అది సర్పమువలె ఎగబ్రాకుట దిగబ్రాకుట, జరుగుచుండును. వృత్తము నందు ఆరంభమును గుర్తించినపుడు అచట నుండి వృద్ధి, ఉచ్చదశ, పతనము, అంతము అను నాలుగు స్థితులు కూడ ఏర్పడును. మరల అంతమే ఆరంభముగ ఏర్పడు చుండును. ఇట్లు హాని వృద్ధులుగ, ఊర్ధ్వ అధోముఖములుగ సమస్తము గుర్తింపబడుచున్నది. కాలము ఈ విధముగ అవస్థలు చెందుచునుండును. యుగములు అయనములు, పక్షములు, అహోరాత్రములు కాలభ్రమణమున ఏర్పడుచుండుగ, కాలము

కత్తిరింపు వలన, ఊర్ధ్వ, అధస్సు లేర్పడుచున్నవి. సూక్ష్మము నుండి స్థూలమునకు సృష్టి ఏర్పడుట అధస్సుగను, స్థూలము నుండి సూక్ష్మమునకు సృష్టి ఏర్పడుట ఊర్ధ్వముగను తెలుపబడినవి. ఈ గమనము లన్నియు సర్పగమనములవలె నుండు కుండలిని గమనములు. కుండలిని ఎగబ్రాకు, దిగబ్రాకు తీగవలె కాలము నంటిపెట్టుకుని నడచు చుండును. అందువలన సర్పము కాలము నాధారముగ ప్రాకుచున్నదని ధ్యానమున తెలుపబడినది. భ్రమణము కాల స్వభావము కాగా, నందలి ఊర్ధ్వ, అధస్సులు కుండలనీ చైతన్య స్వభావముగ గుర్తించుట, కాలము కత్తిరింపబడనప్పుడు, కుండలిని చైతన్యము అవరోహణ, ఆరోహణ క్రమములు కలిగి యుండదని గుర్తించుట ముఖ్యము. కాలము కత్తిరింపబడుట వలననే జీవనము. కత్తిరింపబడనపుడు చక్రము. కత్తిరింపబడుట దైవ సంకల్పము. అందువలననే దైవము చక్రహస్తుడు. కాలము దాటుటకు అనంతుని అనుగ్రహము అవసరము. కాలము దాటిన వారికి ఆరోహణ, అవరోహణ క్రమముండదు. కేవలము స్థితియే యుండును. అట్టి వానిని స్థాణు అందురు. అది పరమశివుని నామము. అతని కవస్థితులు లేవు. కాలమతని ఆభరణము. చైతన్య మతని నుండి ఉద్భవించు ప్రభావము. అత డన్నిటియందును స్థితి గొని యుండు వాడే కాని అవరోహణ, ఆరోహణములు లేవు.

జీవుడు కూడ నిద్రయందు స్థాణువే. అతనియందు ప్రతి దినము వచ్చు మెలకువ కత్తిరింపబడిన కాలము. అచట నుండి

సంకల్పములు కారణముగ ఆరోహణ, అవరోహణ గమనము చెందుచు నుండును. మరల మెలకువ నుండి నిద్రలోనికి జనినపుడు కాలము అదృశ్యమగును. జీవుడు స్థాణు వగును. మెలకువ వచ్చినప్పుడే కాలము. మెలకువనగ చైతన్యమే. అది కలిగినపుడు కాలము ఏర్పడుచున్నది. లేనిచో చక్రమై యున్నది. యోగులు సమాధి స్థితియందు ఈ చక్రము యున్నది. యోగులు సమాధి స్థితియందు ఈ చక్రము నధిష్ఠించి యుందురు. ధృవుడు, సనక సనందనాదులు, నారదుడు అట్టివారు. చక్రమున కీవల అవరోహణ, ఆరోహణములు గలవు. చక్రమున కావల శాశ్వత స్థితి మాత్రమే యున్నది.

## MEDITATION - 66

(May 25, July 19, Nov. 27, Jan. 21)

Wheel is Zero. Wheel cut is one. One and Zero is number ten. Brahma in the egg is one in Zero. When the wheel is cut, He becomes Virat, number ten.

చక్రము సున్న (0). ఛేదింపబడిన చక్రము 1. ఒకటి, సున్న కలిసి పది. సున్న యందు వున్న 1 హిరణ్య గర్భము నందున్న బ్రహ్మ, హిరణ్యగర్భుడు. అండము ఛేదింపబడి నప్పుడు అతడు విరాట్ అగుచున్నాడు. విరాట్ పురుషుని సంఖ్య పది.

*వివరణము :*

కాలమునకు పూర్వము నుండి వున్న ప్రజ్ఞ పూర్ణము. పూర్ణము శూన్యముగ తోచుట అజ్ఞానము. శూన్యము అజ్ఞానుల మనస్సులో వున్నది గాని, సృష్టియందు వున్నది పూర్ణము. ఉండుట, లేకుండుట దానికి లేదు. అది శాశ్వతమైనది. పూర్ణము ఆకారము గోళము. చక్రమనగా విచ్చుకొనని గోళమని భావించవలెను. గోళము విచ్చు కొనుటయే చక్రము ఛేదింపబడుట. విచ్చుకొనిన గోళమునే కమల మని కూడ అందురు. విచ్చుకొనక ముందు కాలము లేదు. దేశము లేదు. ప్రకృతి లేదు. పురుషుడు లేడు. వీరందరు గోళమున బీజప్రాయముగ నున్నారుగాని అవతరణము చెందలేదని అర్థము. ఈ గోళము సమస్తమును కలిగియున్నది. దానియందు బీజ ప్రాయముగ లేనిది లేదు. ఈ గోళము విచ్చుకొనుట దివ్య సంకల్పము. అది పరమపురుషుని నుండి వ్యక్తమగును. మన నుండి కూడ సంకల్పములు వ్యక్తమగుటకు ఆధారము దివ్యత్వమే. వ్యక్తమగు చోటును అదితి యని, గాయత్రి యని పలుకుదురు. చోటులో వ్యక్తమైన గోళము, చోటులో నుండి వ్యక్తమైన సంకల్పము కారణముగ ఛేదింపబడును. అనగా విచ్చుకొనును. గోళము విచ్చు కొనగానే చతుర్ముఖ బ్రహ్మ అవతరించును. గోళము అంకె 'సున్న'. గోళము నందున్న బ్రహ్మ అంకె '1'. 'సున్నను' చేరిన 'ఒకటి' పది అగును. అందువలన బ్రహ్మ సంఖ్య 'పది'. అతనితోపాటు జనించు వారు నవబ్రహ్మలు. మొత్తము ఈ పదిమందిని ప్రజాపతులందురు.

ఈ పదిమంది కలిసి 'విరాట్పురుషుడు'గ ఏర్పడును. నవబ్రహ్మలును, తొమ్మిది అంకెలవంటి వారు. మొదటివానితో కలిసి పది. ఈ అవతరణము నాధారముగనే దశాంశ మేర్పడినది. దీనినే 'పైథాగరస్' మహాత్ముడు 'Decad' సిద్ధాంతమును వ్యాఖ్యానించినాడు. వీనినే దశ బీజములని కూడ నందురు. (The Ten seeds explained by Master D.K.) పదిని ఈ క్రింది విధముగ వేదజ్ఞులు సంకేతించిరి :




గ్రీకులు ఈ క్రింది విధముగ సంకేతించిరి.




యూదు లీ క్రింది విధముగ సంకేతించిరి :



గ్రీకుల సంకేతము నందు కోణములందున్న మూడు బిందువులు త్రిమూర్తులుగను మధ్యగల ఏడు బిందువులు సప్తర్షులుగను దర్శించవచ్చును.




మరియు వారి సంకేతపు అమరిక నుండి వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహములు, పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ వాక్కు, కృత, త్రేత, ద్వాపర కలియుగములు వివరించదగును. మన్వంతరములు కూడ వివరింపదగును.

పదికి సంబంధించిన విద్యను మండలవిద్య అందురు. మండలము నాధారముగనే తంత్ర శాస్త్రమును నిర్మించిరి. టిబెట్, నేపాళ దేశములలో మండలవిద్య నేటికిని ప్రాశస్త్యము చెంది యున్నది. వృత్తము లేని రేఖాగణితము (జ్యామెట్రి) లేదు. సమస్తమునకు వృత్తమే అధారము. అది గోళము, పూర్ణము, సున్న, విరాట్ పురుషుడు. పది!

## MEDITATION - 67

(May 26, July 18, Nov. 28, Jan. 20)

Virat shines through ten digits. Virat has ten fingers. Man has ten fingers. Man is frame of Virat.

విరాట్పురుషుడు పది అంకెలతో విరాజిల్లు చున్నాడు. అతనికి పదివేళ్ళు కలవు. మానవునికి కూడ పదివేళ్ళు కలవు. విరాట్పురుషుని రూపమే మానవు నిది కూడ.



*వివరణము :*

దైవ సృష్టికి పరిపూర్ణత మానవుని సృష్టి. మానవుని రూపము దైవము రూపముతో సరిపోలినది. దైవము జీవుని మానవ రూపమున తనవలెనే తీర్చిదిద్ది తన ప్రేమను, వాత్సల్యమును, కారుణ్యమును చాటుకొనినాడు. తన అంశను తనంతటి వాడుగ చేయు ప్రయత్నము దివ్య ప్రయత్నము. పరిపూర్ణ ప్రేమ, వాత్సల్యము దీనికి తార్కాణ ములు. కలియుగమున గౌతమబుద్ధుడు, మాస్టరు సి.వి.వి. అట్టి దీక్షను బూనిన మహనీయులు. God made man in his own image and likeness అని బైబిలు గ్రంథము ఘోషించుచున్నది.

మానవ రూపము విరాట్పురుషుని రూపమే. విరాట్పురుషుని యందు గల సమస్తమును మానవుని యందున్నవి. మానవుని యందు ప్రకృతి పురుషులున్నారు. త్రిమూర్తులున్నారు. సప్త ఋషులున్నారు. ద్వాదశాదిత్యు లున్నారు. సప్త లోకములు, లోకేశులున్నారు. గ్రహములు, తారకలున్నవి. యక్షులు, రక్షసు లున్నారు. దేవతలు, దానవులు కూడ నున్నారు. సురలు, అసురు లున్నారు. పంచభూతములు, పంచతన్మాత్ర లున్నవి. మానవుని యందు లేనిది లేదు. తాను బ్రహ్మమే అని తెలియుటయే తెలియుట. తన రూపము విశ్వరూపమే అని తెలిపి చూపినవాడు శ్రీకృష్ణుడు. పూర్ణ పురుషుడు, పురాణ పురుషుడు, సనాతనుడు. ఈ ధ్యానము చేయు సాధకుడు తనయందు సమస్తమును దర్శించుట అభ్యసించదగును.

## MEDITATION - 68

(May 27, July 17, Nov. 29, Jan. 19)

Serpent ascends as eagle. Eagle descends as serpent. Nari ascends as Nara. Nara descends as Nari. Nara and Nari ascend and descend. It is Narayana.

సర్పము ఆరోహణమున సుపర్ణు డగును. సుపర్ణు డవరోహణమున సర్ప మగును. 'నారి' ఆరోహణమున నరుడు అగును. నరుడు అవరోహణమున 'నారి' అగును. నర, నారీలు ఆరోహణ, అవరోహణములు. ఆరోహణ, అవరోహణమే నారాయణము.

*వివరణము :*

సృష్టి అంతయు నర నారీత్వమే. అనగా ప్రకృతి పురుషుల క్రీడయే. సృష్టి ఏర్పడవలెనన్నచో ప్రకృతి పురోగమించవలెను. సూక్ష్మము నుండి స్థూలమునకు అవరోహణము చెందవలెను. సృష్టి లయము కావలెనన్నచో ప్రకృతి తిరోగమించవలెను. అనగా స్థూలము నుండి సూక్ష్మమునకు చేరవలెను. దిగివచ్చుటకు ఋణ సంజ్ఞ కావలెను. ఎక్కి వెళ్లుటకు ధన సంజ్ఞ కావలెను. ఉత్తర ధృవము ధన సంజ్ఞ కలది. దక్షిణ ధృవము ఋణ సంజ్ఞ కలది.

దానమిచ్చుచు, యజ్ఞార్థకర్మను నిర్వర్తించుచు లోక హితు డగుచున్నకొలది జీవుడు ఊర్ధ్వముఖు డగును. సృష్టి యందును, సృష్టియందు సమస్తమును ప్రోగుచేయుచు, కూడబెట్టుచు తాపత్రయ పడువాడు అధోముఖు డగును.

సర్పము పొట్టమీద ప్రాకుచు నడచు చుండును. అధోముఖు డైనవాడు పొట్టకోసమే జీవించును. ఇది నారీ తత్త్వము. ప్రకృతి తత్త్వము. పదిమంది కిచ్చుచు, పంచుచు, ఉపకారియై జీవించు వాడు ఊర్ధ్వముఖు డగును. అనగా గరుడ పక్షివలె రెక్కలు కలిగి ఆకాశమున కెగురును. అనగా దివ్య శరీరధారి యగును. ఇది నరతత్త్వము.

జీవుడు నరుడు. అతని స్వభావము నారీ. ఇచట తెలుపబడిన

నరనారీ తత్త్వములు జీవునకు, అతని స్వభావమునకు సంబంధించి నవే కాని స్త్రీ, పురుష దేహమునకు సంబంధించినవి కావు. స్త్రీ యందైనను, పురుషుని యందైనను జీవుడు నరుడు. స్వభావము నారీ. జీవతత్త్వమునకన్న స్వభావము బలముగ నున్నచో అధోముఖు డగును. స్వభావము నధిష్ఠించి జీవుడున్నచో ఊర్ధ్వ ముఖుడగును. పొట్టకూటికై జీవించువాడు దిగజారుచుండగ ఇతరుల పొట్ట నింపుటకై జీవించువాడు ఊర్ధ్వ ముఖుడగును. సర్పము కాలము రూపమున దిగివచ్చినప్పుడు రెండు నాలుకలు గల సర్పమగును. మరల ఎదిగి వెళ్ళినప్పుడు రెండు నాలుకలు రెండు రెక్కలు కాగలవు. గరుత్మంతుని కథ సారాంశ మిదియే.

## MEDITATION - 69

(May 28, July 16, Nov. 30, Jan. 18)

Man ascends from woman. Woman descends from man. The ascent and descent of man is Ardha Nari.

పురుషుని ఆరోహణము స్త్రీ నుండి. స్త్రీ అవరోహణము పురుషుని నుండి. మానవుని అవరోహణ, ఆరోహణలే అర్ధనారీత్వము.

***వివరణము :***

సాధకుడు అంతర్ముఖుడై దైవ సాన్నిధ్యమును చేరుట ఆరోహణ మార్గము. మరల బహిర్ముఖుడై తన స్వభావము నాధారము చేసుకొని బాహ్య ప్రపంచమున ప్రవర్తించుట అవరోహణ మార్గము. అవరోహణమున అతను నారీ. ఆరోహణమున అతడు నరుడు. ఇట్లు నరుని నుండి నారీ దిగివచ్చుట, నారీ నుండి నరుడు ఉద్భవించుట మరలమరల జరుగుచునే వుండును. నరుడాధారముగ నారీ వర్తించును. నారీ ఆధారముగ మరల నరుడు ఉద్భవించును. ఇట్లనుస్యూతము జరుగుటయే అర్ధనారీ తత్త్వము.

## MEDITATION - 70

(May 29, July 15, Dec. 1, Jan. 17)

The ascent of man is through the eagle. The descent of man is through the serpent. The serpent is the coiled coil of time. The tongues of the serpent are the wings of the eagle.

ఆరోహణమున మానవునకు సుపర్ణుడాధారము. అవరోహణమునకు సర్పమాధారము. సర్పము చుట్టలు చుట్టలుగ చుట్టబడిన కాలము. సర్పము నాలుకలే సుపర్ణుడి రెక్కలు.

*వివరణము :*

సుపర్ణుడు మనయందలి స్పందనాత్మక చైతన్యము. ఉచ్ఛ్వాస నిశ్వాసలను గొని ప్రాణాయామ మార్గమున స్పందనమును చేరినచో స్పందనాత్మకమగు సుపర్ణుడు జీవుని ఊర్ధ్వమునకు గొనిపోగలడు. ప్రాణము, అపానము సమాయుక్తమైనచో జీవ చైతన్యము ఊర్ధ్వ ముఖము చెంది (భ్రూమధ్యమందలి ఉదాన వాయువును చేరును. అటుపైన ఆజ్ఞ, సహస్రారములందుగల వ్యాన వాయువును చేరును. ప్రాణాయామమున ప్రత్యాహారము. ధారణ, ధ్యాన, సమాధులు చేరవచ్చును. అట్టి ప్రాణస్పందనముగ సుపర్ణ డున్నాడు. ఇది ఆరోహణ క్రమము. అవరోహణమున వ్యానము నుండి ఉదానము నకు, ఉదానము నుండి సమానమునకు, సమానము నుండి ప్రాణా అపానములకు దిగివచ్చి ఉచ్ఛ్వాస, నిశ్వాసలు చేయుచు మానవుడు జీవించు చున్నాడు. బరువుగ ఉచ్ఛ్వాస నిశ్వాసలు గావించుచు, దేహమును మోసుకొనుచు జీవించువారు అవరోహణమే కాక అవస్థితి చెందిన వారగుదురు. శ్వాస బుసలుగ నిర్వర్తించువారు రెండు నాలుకల సర్పము వలె వుందురు. ఈ శ్వాసయే ప్రాణాయామ మార్గమున సమన్వయము చెందినపుడు సుపర్ణుడి రెక్కలగుచున్నవి. సర్పము నాలుకలే పరిణతి చెందినపుడు గరుత్మంతుని రెక్కలు. ఏ శ్వాస దేహమున కాధారమో, ఆ శ్వాసయే జీవునికి రెక్కలు. దేవతలను రెక్కలు గలవారిగ చిత్రీకరించుటలో గల అర్థమిదియే.

## MEDITATION - 71

(May 30, July 14, Dec. 2, Jan. 16)

Seven charkas link up seven stars. Seven stars bear the Polar bear. The bear is in the cave. The dog is at the entrance. The dog-star guards the infernal gate. The three-headed hound. The hound's tail is the serpent. The heads bark. The tail stings.

సప్త చక్రములు, సప్త నక్షత్రములతో జతపడి యున్నవి. సప్త నక్షత్రములు ధృవ మందున్న ఎలుగుబంటి. ఎలుగుబంటి గుహ యందున్నది. గుహ చేరు మార్గమును శరమ (కుక్క) కావలి యున్నది. మార్గమున కీవల పాతాళమున్నది. శరమ పాతాళ ద్వారమునకు, గుహ మార్గమునకు మధ్య కావలి కాయు చున్నది. శరమకు మూడు తలలు. దాని తోక సర్పము. తలలు అరచును, తోక కరచును (కాటు వేయును).

*వివరణము :*

ఇది యొక విశేష ధ్యానము. సప్తర్షి మండలము ఆకాశమున ఒక ముసలి ఎలుగుబంటివలె గోచరించును. మానవుని యందు సప్తర్షి మండలము పుఱ్ఱె పైభాగపు డిప్పలో నున్నది. భ్రూమధ్యము నుండి పైభాగమంతయు బోర్లించిన మూకుడువలె యుండును. ఇందు సప్తర్షి కేంద్రము లున్నవి. సప్తర్షులను ఎలుగుబంటిగా ఋషులు వర్ణించిరి. పుఱ్ఱె డిప్పను గుహగా వర్ణించినారు.

సప్తఋషి ప్రజ్ఞలే సప్త కేంద్రములుగ శిరస్సు పై భాగము నుండి వెన్నెముక చివరి భాగము వరకు, అనగా సహస్రారము నుండి మూలాధారము వరకు ఏర్పడి యున్నది. శిరస్సును గుహగా వర్ణించగ, శిరస్సును చేరు ముఖద్వారముగ, మార్గముగ వెన్నెముక యందు గల సుషుమ్న నాడిని వర్ణించిరి. సుషుమ్న గుహను చేర్చు మార్గము.

సుషుమ్న ద్వారము వద్ద అనగా మూలాధారము వద్ద మూడు తలల కుక్క కావలి కాయుచున్నట్లు చెప్పబడినది. కుక్కను సంస్కృతమున శరమ యందురు. ఉత్తర ధృవమున సప్తఋషి మండలమువలె దక్షిణ ధృవమున శరమ యొక్క మండల మున్నది. దానినే శారమేయ మండల మందురు. దత్తాత్రేయ మండలమని కూడ యందురు. ఇందు చెప్పబడిన మూడు తలల కుక్క గ్రీకు సంప్రదాయమున చెప్పబడినది. భరత ఋషుల సంప్రదాయమున, మూడు తలల కుక్క బదులు మూడు తలల మానవ రూపము తెలుపుదురు. అతడే దత్తాత్రేయుడు. యోగమునకు అధిదేవత.

సుషుమ్న యందు ప్రవేశించుటకు 'దత్తస్యయోగ అథ యోగ నాథః' అని నారాయణ కవచమున కీర్తింపబడినాడు. ఇతడు మూలాధార ప్రజ్ఞ యందుండును. మూలాధారమున కుండలిని ప్రచోదనమునకు దత్తుడే కారకుడు. అతడే బ్రహ్మ విష్ణు మహేశ్వర తత్త్వములు కలిగిన గురువు. లోకమున ఏ సద్గురువైనను అతని తరంగమే. అతని చుట్టును కుక్కలు యుండునని, అవి వేద స్వరూపములని భారతీయ సంప్రదాయము.

మూలాధారమునకు దిగువ పాతాళ లోకములు కలవు. త్రిగుణములచే బంధింపబడిన జీవులు యమ నియమ ప్రాణాయా మాది వేదాంగముల ద్వారా సుషుమ్నలో ప్రవేశింప గలరు. ఇతరులు భూతలము, ఇతర పాతాళ లోకముల యందు జీవింతురు. ఈ లోకములను పాము తోకగ ధ్యానము వర్ణించు చున్నది. అనగా కాలవశులై అజ్ఞానమున పడి రజస్తమో గుణములచే పీడింపబడుచు జీవించువారని అర్ధము. అసుర భావముచే జీవించువారని అర్థము.

మూలాధారము నుండి ఊర్ధ్వగతి చెందినవారు, చెందుటకు సాధన చేయువారు మూడు వేదములను పాటింతురు. ఋక్, యజుర్, సామవేదములు. ఋక్ వేదమనగా చక్కని సంకల్పము, మాట యజుర్ వేదమనగా తదనుగుణమైన ఆచరణ. సామవేద మనగా ప్రాణోపాసనము.

కుక్కతోకను పాముగా ధ్యానము వర్ణించుచున్నది. అది అసుర భావములకు సంకేతము. తలలు వేదములు కాగ, తోక అజ్ఞాన సూచకము. ఒకటి ఆర్య జీవనము, మరియొకటి అనార్య జీవనము. రెండింటి నడుమ శరమ యున్నది.

## MEDITATION - 72

(May 31, July 13, Dec. 3, Jan. 15)

The hound is Cerberus. Cerberus is Sarama. Sarama is Sirius.

ఈ కుక్క పేరు 'సెర్బరస్'. దీనినే శరమ అని కూడా అందురు. శరమను సిరియస్ అందురు.

*వివరణము :*

మన సూర్య మండలమును తండ్రులవలె సప్తఋషులు, తల్లుల వలె కృత్తికలు పోషించుచున్నారు. దత్తాత్రేయుడు యోగాధి దేవతయై, మార్గమును చూపు గురువై శారమేయ మండలమును అధిష్ఠించి యున్నాడు. ఈ శారమేయ మండలమే సిరియస్. ఇది వృశ్చిక రాశియందు గల మూలాధార చక్రము నందున్నది. మూడు తలల దత్తాత్రేయుడే ఈ ధ్యానమున తెలుపబడిన అధిదేవత. మూడు తలల కుక్క. దీనిని గ్రీకు దేశస్థులు సెర్బిరస్ అను దైవముగా పూజింతురు. గ్రీకులకు, భారతీయులకు జ్ఞానపరమైన విషయమున మిక్కిలి సామ్యముండెడిది.

మూడు తలలు మూడు గుణములను, మూడు లోకములను మరియు స్వర్గ, భూ, పాతాళములను అవలోకించు ప్రజ్ఞగ తెలియవలెను. అవలోకనము కుక్క లక్షణము. అవలోకించు త్రైలోక్య ప్రజ్ఞ కనుక మూడు తలలను మూడు జాతి కుక్క తలలుగ గ్రీకులు పేర్కొనిరి.

భూమి నందు, స్వర్గము నందు, పాతాళము నందు చరించు సమస్త గురు పరంపర దత్తాత్రేయుని యంశములే. ఆతడు పాతాళమునకు భూమికి, భూమికి స్వర్గమునకు నడుమ గల ద్వారములను కాచి యుండును. జీవుల స్వభావములను బట్టి వారి వారిని ఆయా లోకములందు నిర్వర్తింపజేయుచు కాపలా

యుండును. సప్తర్షి మండలము ఉత్తర ధృవ మండల సమీపమున నుండగ, దత్తాత్రేయ మండలము దక్షిణ ధృవము నాధారము చేసుకొని యుండును. భూమి చుట్టును గల ఆకాశ గోళముతో దత్తాత్రేయ మండలమంత కాంతి ప్రదర్శించు మండలము మరి యొకటి లేదు. దీనిని ఆంగ్లమున సిరియస్ అని సదరన్‌స్టార్ (Southern Star) అని సంబోధింతురు. మన యందీ ప్రజ్ఞ మూలా ధారమున నున్నది (మరిన్ని వివరములకు 'దత్తాత్రేయ' అను పుస్తకము చూడుడు.)

## MEDITATION - 73

(June 1, July 12, Dec. 4, Jan. 14)

The dog is bound to the pole. The bear goes round the pole. The pole is the pole star. The dog is Sirius star. The bear is of seven stars.

జాగిలము (కుక్క) ధృవముకు కట్టబడి యున్నది. ధృవము ఉత్తరభాగమున ఎలుగు బంటి తిరుగుచున్నది. ధృవము ఉత్తర భాగము నందు ధృవతార యున్నది. జాగిలము ధృవము దక్షిణ భాగమున గల శారమేయ మండలమున నున్నది. ఎలుగుబంటి సపర్షి మండలము.

*వివరణము :*

మానవుని యందు మూలాధారము నుండి సహస్రారమునకు గల బ్రహ్మదండమును ధృవము లేక ఇరుసు అందురు. ఇది ఆధారముగనే మానవ శరీర నిర్మాణము జరుగుచున్నది. ఈ ధృవమునకు ఉత్తరమున సప్తర్షి మండల మున్నది. దక్షిణమున దత్తాత్రేయ మండల మున్నది. భూమియొక్క ఉత్తర, దక్షిణ ధృవముల యందు కూడ ఇవియే ప్రజ్ఞలు కలవు. దత్త నక్షత్ర మండలము భూమినుండి కుక్క ఆకారమున కనిపించును. సప్తర్షి మండలము ముసలి ఎలుగుబంటివలె కన్పించును. మానవుని యందు, భూమియందు ఈ ఉత్తర దక్షిణ ధృవములను కలుపు దారి బ్రహ్మదండమై యున్నది. అందలి బ్రహ్మరంధ్రము యోగ మార్గము.

ఈ ధ్యానము ఈ యోగ మార్గమును, సప్తర్షి ప్రజ్ఞలను, దత్త ప్రజ్ఞను దర్శనము గావింపగలవు.

సాధకుడు చేయవలసిన ఊహ ఈ విధముగ నున్నది. తన యందు గల వెన్నెముక యందలి బ్రహ్మదండము, వెలుగుతో కూడిన ఒక గడకఱ్ఱ వలె మూలాధారము నుండి సహస్రారము వరకు యున్నట్లు భావింపవలెను. గడకఱ్ఱ క్రింది భాగమున ఒక తెల్లని రంగు గల జాతికుక్క కావలి కాయుచున్నట్లు భావింపవలెను. కఱ్ఱ పై భాగమున ఒక తెల్లని ముసలి ఎలుగుబంటి ప్రదక్షిణములు చేయు చున్నట్లు గమనింపవలెను. గుంజ చుట్టునుగల చోటు గోళము నందు, నీలాకాశము, అందు మెరయు చున్న తారలను ఊహించవలెను.

## MEDITATION - 74

(June 2, July 11, Dec. 5, Jan. 13)

Three times seven miles from the goal. The goal is the pole. Pole on the head. Bear on the brow. Dog behind the back. The hunter walks.

గమ్యమునకు త్రిసప్త (7×3) మైళ్ళ దూరము గలదు. ధృవాగ్రమే గమ్యము. అది శిరస్సుపైన నున్నది. ఎలుగుబంటి భ్రూమధ్యము నుండి ఫాల భాగమంతయు వ్యాపించి యున్నది. శరమ (కుక్క) వెన్నుముక క్రింద యున్నది. వేటగాడు సాగిపోవు చున్నాడు.

*వివరణము :*

మూలాధారము నుండి సహస్రారమునకు ఏడు కేంద్రములు గలవు. అందు ఏడు ప్రజ్ఞలు చక్రములవలె తిరుగుచున్నవి. అవి పద్మములు కూడ. ఈ ఏడు కేంద్రములు ఏడు లోకములకు సంకేతము. ఏడు కేంద్రములు, లోకములు మూడు గుణములచే నిర్మింపబడి పరిపాలింప బడుచున్నవి. ప్రతి కేంద్రము లోకము నందలి మూడు గుణములను సమన్వయించుకొనుచు దండము దక్షిణ ధృవమునుండి ఉత్తర ధృవమునకు చేరవచ్చును. ఇదియే అష్టాంగ యోగసాధన. గమ్యము ఏడు కేంద్రముల పైన యున్నది. కావున 7×3 (ఏడు లోకములు × మూడు గుణములు) మైళ్ళు దాటి గమ్యమున్నది. అనగా గమ్యము శిరస్సు పైన యున్నది. ఆరంభము వెన్నెముక క్రింద యున్నది. సదాచారము, సంఘసేవ, సత్సాధన ఆధారముగ ఏడు లోకముల దూరము (21 మైళ్ళు) దాటి ముందుకు సాగవచ్చును. వెన్నెముక క్రింద నున్న శరమ, ప్రవర్తనమును కావలి కాయుచుండును. సత్ప్రవర్తకులకు దారి చూపుచుండును. ఫాల భాగము నందుండు సప్తఋషులు, ఆశీర్వదించుచు, స్ఫూర్తి నందించు చుందురు. యోగ సాధనమున యోగ బలముచే సాధకుడు సాగిపోగలడు. సాధకుని వేటకాడని ధ్యానము తెలుపుచున్నది. వేటకాడు అనగా అన్వేషించువాడని కూడ అర్థము. సాధకుడు సత్యాన్వేషి కదా!

## MEDITATION - 75

(June 3, July 10, Dec. 6, Jan. 12)

Yonder is the lion behind bars. Ponder over the lion, it roars. The hunter tames the lion.

సుదూరమున సింహమొకటి బందీయై యున్నది. దానిని ధ్యానింపుము. అది గర్జించును. గర్జించు సింహమును మచ్చిక చేసుకొనుము.

*వివరణము :*

సుదూరమున సింహ మొకటి యున్నది. ఇచ్చట దూరము భౌతికము కాదు. స్థూలము నుండి సూక్ష్మమునకు గల దూరము. భౌతిక లోకమున వ్యవహారములు, ఇంద్రియ కార్యకలాపములు, మనో భావములు దాటి వెనుక శ్వాస యున్నది. శ్వాస ఆధారముగ స్పందన యున్నది. స్పందన సోహం అను శబ్దమును చేయును గనుక దానిని సింహమని ఋషులు సంకేతించిరి. బహిర్ముఖమున జీవించు ప్రాథమిక సాధకునకు అది లోపల బంధింపబడి యుండును. అనగ గుర్తింపబడక యుండును. ఎంతమంది సాధకులు అంతర్ముఖులై అంతరంగ మందలి సింహగర్జన వినగలుగు చున్నారు? బహిరంగముననే ప్రాకులాడుచు, వ్యాకుల పడుచుందురు.

అందువలన సూక్ష్మముగ మనయందు నిర్వర్తింపబడుచున్న హంసగానము (సింహగర్జనము) గుర్తించుటకు ముందుగ హృదయ మున ధ్యానింపవలెను. అనగా మనస్సును శ్వాస ద్వారా లోనికి పయనింపచేసి స్పందనను ధ్యానించవలెను. అట్లు ధ్యానించినచో సింహపు గర్జన వినిపించగలదు. అనగా సూక్ష్మముగ 'సోహం' అను మంత్రము వినిపించగలదు. సాధకుడు ఆ శబ్దమును మచ్చిక చేసుకొనవలెను. ఇట్లు మచ్చిక చేసుకొనినచో సింహము అనుకూలించ గలదు. అప్పుడు సాధకుడు సింహము సహాయముతో ముందుకు సాగిపోగలడు.

శామ్‌సన్, హెర్క్యులిస్, ఆంద్రోక్లీస్ అను గ్రీకు యోగులు సింహమును మచ్చిక చేసుకొనినట్లుగ, జయించినట్లుగ తెలుపు కథలు స్పందనము నధిష్ఠించిన వారుగ తెలియచేయును. గుహ యందలి సింహమును మచ్చిక చేసుకొనుట భారతీయ సంప్రదాయ మున ఎన్నియో గాథలుగ తెలుపబడినవి. ఇట్లు మూలాధారము నందుగల ప్రజ్ఞ ముందుకు సాగి అనాహత మందలి ప్రజ్ఞను చేరగలదు. అనగా గ్రామసింహము (కుక్క) నుండి రాజ సింహము వరకు ప్రయాణము చేయు విధానము ఇందు తెలుపబడినది.

## MEDITATION - 76

(June 4, July 9, Dec. 7, Jan. 11)

The maiden on the back of the lion. Six maidens shower spiritual rains. The hunter levels the ground. The lion walks all around.

సింహాసీనయై కన్య యున్నది. ఆరుగురు కన్యలు దివ్య వర్షమును కురిపించిరి. వేటకాడు భూమిని చదును చేసెను. సింహము అంతట నడచినది.

*వివరణము :*

సింహరాశి యందు, అనాహత చక్రమందు రతి గొనిన మనసు కరగును. కల్మషముల నుండి ముక్తి చెంది నిర్మలమగును. నిర్మలమైన మనస్సునకు సింహము నధిష్ఠించిన కన్య దర్శన మిచ్చును. అమ్మవారు సింహరాశి యందు సింహము నధిష్ఠించి యుండును. కన్యారాశి యందు కన్యకాపరమేశ్వరి. తులారాశి యందు పులిని అధిష్ఠించి యుండును.

సింహము నధిష్ఠించి యుండుట అనగా హంస శబ్దమును సిద్ధింపచేయుట. అట్లు సిద్ధింపచేయుట వలన హృదయమున సుషుమ్న ద్వారములు తెరువబడును. సుషుమ్న ద్వారములు సింహవాహిని అనుగ్రహముచే తెరువబడినపుడు, సమస్త గ్రంథులు, చక్రములు స్రవించగలవు. అట్లు స్రవించుటచే దేహము సారవంత మగును. అనగా ప్రాణవంతము, చైతన్యవంతము అగును. దేహ మందలి అణువులు కాంతివంతములై మలినములను పరిపూర్ణముగ వీడును. ప్రాణమయ కోశము విచ్చుకొనును. విజ్ఞాన మయకోశము వికసించుటారంభించును. శరీరము దీక్షాయుతమగు యోగసాధనకు సహకరించును. సాధన మరింత నిరంతరాయముగ సాగును. స్పందనాత్మక చైతన్యము హృదయమందలి గుహలో నుండి వెలువడి ఊర్ధ్వమునకు, అధస్సునకు యధేష్టముగ సాగుచుండును. గుహయందు బంధింపబడిన సింహము ఇపుడు స్వతంత్రమైనది. దేహమున కొన్ని ముడులు విడినవి. స్పందన గమనము జీవుని గమనమే. అందువలన సాధకుడు యోగమున రాజమార్గమగు సుషుమ్న యందు గమనము చేయుట మొదలిడెను.

## MEDITATION - 77

(June 5, July 8, Dec. 8, Jan. 10)

The eye of the bull twinkles in darkness. The lion grips light from darkness. The maiden gathers lotuses. The maiden makes a garland. The jewel of the serpent graced the garland. Hunter garlanded.

వృషభము కన్ను చీకటిలో మినుకు మినుకు మనుచు మెరయుచుండును. సింహము చీకటి యందు ఆ మెఱపును పట్టుచున్నది. కన్య కమలములను ప్రోగుచేయుచున్నది. కన్య కమలములను మాలగ కూర్చుచున్నది. మాలాగ్రమున నాగమణి భాసించుచున్నది. వేటకాడు మాలాలంకృతుడైనాడు.

*వివరణము :*

వృషభము కన్ను మన ఆజ్ఞా కేంద్రమున యున్నది. 'వృషభాక్షో వృషప్రియః' అని ఈ కేంద్రమునే ఆరాధింతుము. సుషుమ్న మార్గమున ఫాల భాగమున నుండు ఈ నేత్రము సమస్తమును దర్శించుచుండును. దీనినే ఆంగ్లమున All seeing eye అందురు. మన వాఙ్మయమున సర్వసాక్షి యని, లోకసాక్షి యని యందురు. ఈ స్థితిని చేరినవారిని అవలోకితేశ్వరు డందురు. కశ్యపుడందురు. హృదయము నుండి బయలుదేరిన సింహము కన్య అనగా ప్రకృతి లేక కుండలిని చైతన్యము అనుగ్రహ కారణమున యోగసాధన ద్వారా ఆజ్ఞను చేరుట ఇచట తెలుపబడినది. ఇచట కుండలిని చైతన్యము ప్రోగుచేయు కమలములు మూలాధారము నుండి ఆజ్ఞ వరకు గల కమలములు. అనగా మూలాధారమున నాలుగు దళముల కమలము, స్వాధిష్ఠానమున ఆరు దళముల కమలము, మణిపూరకమున పది దళముల కమలము, అనాహతమున పన్నెండు దళముల కమలము, విశుద్ధి యందు 16 దళముల కమలము, ఆజ్ఞ యందు 96 దళముల కమలము, అందు రెండు దళముల నేత్రము- వీని నన్నింటిని దారమున కెక్కించిన పుష్పములవలె సుషుమ్న యందలి కుండలిని చైతన్యము ఒక మాలగ నేర్పరచగ ఆజ్ఞలోని నేత్రము మణివలె ప్రకాశించును. అట్లు యోగము సిద్ధించిన యోగి మాలధారి యగును. అనగా అంతర్ముఖముగ దివ్యమాలను ధరించిన వాడగును. పై తెలిపిన విధానము నంతను భావనామయ లోకమున నిర్మించుకొన్నచో ఆ యా కేంద్రములన్నీ ప్రచోదనము కాగలవు.

## MEDITATION - 78

(June 6, July 7, Dec. 9, Jan. 9)

The solar pole advances. Day increases. Night decreases. The Gods dance. The Virgin sings. Horses gallop. Waters spring.

ధృవము ముందుకు సాగుచున్నది. పగలు పెరుగుచున్నది. రాత్రి తగ్గుచున్నది. దేవతలు నృత్యము చేయుచున్నారు. కన్య గానము చేయుచున్నది. గుఱ్ఱములు లంఘించు చున్నవి. జలములు పొంగుచున్నవి.



*వివరణము :*

జీవుడు ఉత్తర ధృవము వైపునకు ముందుకు సాగుచుండగ, జ్ఞానమను వెలుగు పెరుగుచుండును. అజ్ఞానమను చీకటి తరుగు చుండును. మానవుని యందు జ్ఞానము పెరుగుచు, కాంతివంతు డగుచున్నచో ఆ జీవనకాల మంతయు ఉత్తరాయణమే. అజ్ఞానము మరల అలముకొన్నచో అది దక్షిణాయనమే. యోగసాధనా బలమున జీవునియందు ఆత్మభావనా బలము పెరుగుతున్న కొలది మిక్కిలి కాంతివంతుడు, చైతన్యవంతుడు అగును. ఎంతటి వెలుగు పెరుగునో అంతటి చీకటి కలుగును.

దేహమందలి దేవతా ప్రజ్ఞలు వికసించి ఆనందముతో నృత్యము చేయగలవు. దేహమందలి కన్యారూపమైన కుండలిని శక్తి నుండి రక రకములగు మంగళ వాయిద్యములు రాగయుక్తమైన గానముగ వినిపించగలదు. వేద వాఙ్మయమున గుఱ్ఱము ప్రాణము నకు సంకేతము. గుఱ్ఱములు వేగముగ పరుగెత్తుచున్న వనగ ప్రాణ శక్తి పుష్టికరమై ఉత్సాహముగ దేహమంతయు ప్రవహించుచున్నవని అర్థము. జీవుడు. ఊర్ధ్వ రేతస్కు డగుచున్నాడని అర్థము. సమస్త నాడులు, గ్రంథులు స్రవించుచు, జీవుడు దేహమున దివ్యాను భూతులు చెందుచున్నాడని తెలియచేయుటకే జలములు పొంగు చున్నవని ఈ ధ్యానము తెలుపుచున్నది.

జీవుని యందు కుండలిని చైతన్యము ప్రచోదనము చెంది ఊర్ధ్వముగ సాగుచుండగ పై విధమగు దివ్యానుభూతులు కలుగు చుండును.

## MEDITATION - 79

(June 7, July 6, Dec. 10, Jan. 8)

Hunter on horse-back vanquishes the serpent. The serpent coiled around the rod. The rod is winged. Hunter holds rod. Law is held in hand.

వేటకాడు అశ్వారూఢుడై సర్పమును జయించెను. సర్పము దండమును చుట్టు కొనును. దండాగ్రమున కటునిటు రెక్క లేర్పడి నవి. అట్టి దండమును వేటకాడు ధరించినాడు. ఆ దండము ధర్మదండము. వేటకాడు ధర్మదండమును ధరించి నాడు.

*వివరణము :*

వేటకాడు అశ్వారూఢుడగుట యనగా పంచప్రాణములను అధిష్ఠించుట యని యర్థము. ప్రాణాపానములు హృదయమున సమన్వయింపబడి, సమాన ప్రాణముగ నేర్పడి, ఊర్ధ్వమున కేగి భ్రూమధ్యమున 'ఉదానము'ను చేరగ, ఉదాన వ్యానములు ఆజ్ఞ యందు మరల సమన్వయింప బడినపుడు ప్రాణాశ్వము నధిష్ఠించుట జరుగును. అట్లు సాధకుడు ఊర్ధ్వమున కేగుచుండగ కుండలిని చైతన్య మతనిని అనుసరించును. బ్రహ్మదండ మందలి సుషుమ్న మార్గమును ఆధారముగ చేసుకొని కుండలిని లతవలె అల్లుకొనుచు పై కెగబ్రాకును. సర్పము నాలుకలు ఊర్ధ్వమున గరుడుని రెక్కలని ఇదివరకే వివరింపబడినది. అట్లు బ్రహ్మదండము నల్లుకొనుచు, ఎగబ్రాకుచు ఆజ్ఞను చేరిన చైతన్యము మిత్రా వరుణులవలె దండము పై భాగమున రెండు రెక్కలుగ వ్యాపించెను. ఈ దండమే రాజదండము ధర్మదండము కూడ. సాధకుడిపుడు పరిపూర్ణ ధర్మ పాలనమున నిలువుగ, ధర్మమే అతని శక్తియై అతని చేతికఱ్ఱగ నుండును. ఇట్టి స్థితి చేరినవారిని రాజయోగు లందురు.

## MEDITATION - 80

(June 8, July 5, Dec. 11, Jan. 7)

Hunter sits on throne. Hunter wears the crown. Crown of Magus gained. Kingdom regained.

వేటకాడు రాజ సింహాసనము నధిష్ఠించెను. రాజ మకుటమును ధరించెను. మహత్తరమగు మకుటము లభించెను. కోల్పోయిన రాజ్యము తిరిగి పొందెను.

*వివరణము :*

రాజదండము ధరించిన యోగి అటుపైన పొందునవి రాజ సింహాసనము, రాజ మకుటము. రాజ మకుటమునకు అత్యంత మహత్తు గలదు. రాజ సింహాసనము కూడ నట్టిదే. విక్రమాదిత్యుని సింహాసనము, మకుటము అత్యంత మహత్తు గలవని నానుడి. విక్రమాదిత్యుడు రాజర్షి. ఋషు లగువారి తదుపరి గమ్యము రాజర్షు లగుటయే. వారు శాసించు దండము, అధిష్ఠించు సింహాసనము, ధరించు మకుటము భగవత్ ప్రసాదితము. శివాజీ ఖడ్గము, వశిష్ఠ మహర్షి దండము, జనక మహారాజు కిరీటము, ఈ సందర్భమున పేర్కొన దగినవి.

సామాన్య మానవుడు యోగానుష్ఠానము ద్వారా మహా పురుషుడైనప్పుడు పై తెలిపిన మహత్తరమగు దివ్యశక్తులు వైభవ ములు భగవదనుగ్రహము ఏర్పడును. అట్టి యోగి చక్రవర్తి సమానుడు. అతడు సర్వాధికారిగ తనదైన జీవనమును యథేచ్ఛగ పాలించు చుండును. అట్టివాడు రాజులకు రాజు. ఏసుక్రీస్తు “నేను రాజులకు రాజును” అని రోమను సైన్యాధికారికి తెలుపుట యందలి రహస్యమిదియే. వారి సామ్రాజ్యము దైవ సామ్రాజ్యమే. అట్టివారు జీవుల హృదయములను పరిపాలింతురు. వారిది మృణ్మయ రాజ్యము కాదు. హిరణ్మయమగు రాజ్యము. రాజ్యమును తిరిగి పొందుట యనగా నిజ స్వరూపము తెలిసి తన జీవన

సామ్రాజ్యము నకు తాను స్వామియై నిలబడి యుండుట. పూర్ణయోగి, జ్ఞాని మాత్రమే అట్లుండ గలరు. ఇతరులు అజ్ఞానవశమున వారి రాజ్యమునకు వారే బానిసలై యుందురు. జీవుడు దైవాంశ సంభూతుడు అగుట వలన అతడు సహజముగ సర్వాధికారి. కాని అజ్ఞానవశమున సమస్తమును కోల్పోవును. మరల యోగము జ్ఞానము ఆధారముగ తన సహజత్వమును, నిజత్వమును పొందును. అందరి జీవుల కథలు ఇవియే.

## MEDITATION - 81

(June 9, July 4, Dec. 12, Jan. 6)

Number one, the rod. Zero to one, the serpent unwinds. Number nine, the throne; number ten, the crown. Kingdom gained. Hunter becomes saint. Hunter bears pot. Light of life carried. Mind and wisdom married. Saint blesses the couple with holy water from pot.

ఒకటి దండము (ధర్మదండము), సున్న నుండి ఒకటికి కాలసర్పము విచ్చుకొనును. తొమ్మిది రాజ సింహాసనము. 10 రాజ మకుటము, రాజ్యము లభ్యమైనది. వేటకాడు రాజర్షియైనాడు. కుంభమును ధరించినాడు. అందు జీవ చైతన్యమును కలిగి యున్నాడు. మనస్సు బుద్ధిని పెండ్లి యాడినది. రాజర్షి మనో బుద్ధులను కుంభమందలి జీవ చైతన్య జలముతో సంప్రోక్షించి ఆశీర్వదించినాడు.

*వివరణము :*

దైవము యొక్క సంకేతము పూర్ణము. పూర్ణమే శూన్యము కూడను. అవ్యక్తమున దైవము మనకు శూన్యము. వ్యక్తమున అతడు పూర్ణము. అతని కతను ఎప్పుడూ పూర్ణుడే. పూర్ణము గోళమని, గోళము కాల స్వరూపమున విచ్చుకొనునని ముందు ధ్యానములలో తెలుపబడినది. విచ్చుకొను కాలము వలయాకారముగ చైతన్యమును ఏడు లోకముల లోనికి అవతరణము చేయునని మరల కాలవలయమై ఆరోహణము కలిగించునని కూడ తెలుపబడినది. ఈ ధ్యానమున అది మరల గుర్తు చేయబడుచున్నది.

పూర్ణమగు దైవమే ధర్మముగ సృష్టికాధారమై నిలచును. అందువలన ధర్మదండము సంకేతము, ఒకటి అని తెలుపబడినది. సృష్టి యందు ధర్మమే దైవము. ధర్మము నాచరించుటయే దైవము ననుసరించుట. ధర్మము లేనిచోట దైవము అనుగ్రహింపడు. ధర్మ మాధారముగ సృష్టి ఏర్పడినది. ప్రకృతి, కాలము, శక్తి, ప్రాణము, స్పందనము, వాక్కు, పంచభూతములు, పంచేంద్రియములు, పంచతన్మాత్రలు అన్నియును ధర్మాధీనములే. లోకములు, లోక పాలకులు, జీవులు కూడ ధర్మాధీనులే. త్రిమూర్తులైనను ధర్మాధీనులే. సృష్టియందు ధర్మమే శరణ్యము. కావున ధర్మము మొదటిది. దాని యంకె ఒకటి.

పరిణామమున జీవుడు అష్ట ప్రకృతులను దాటి మూల ప్రకృతితో అనుసంధానము చెందవచ్చును. మూల ప్రకృతి అంకె

తొమ్మిది. అష్ట ప్రకృతులు 8 - పంచభూతములు, మనస్సు, బుద్ధి, అహంకారము. అష్టప్రకృతులను అధిష్ఠించుటకును, మూల ప్రకృతిని చేరుటకును ధర్మము ఆవశ్యకము. అట్లు మూల ప్రకృతిని చేరగనే మానవుడు రాజసింహాసనమును పొందుచున్నాడు. అనగా రాజర్షి యగుచున్నాడు. అది మూల ప్రకృతి యనుగ్రహమే. మూల ప్రకృతినే లలిత, గాయత్రి, దుర్గ, అదితి, సావిత్రి, మహాలక్ష్మి, మహాసరస్వతి, మహాచైతన్యము అని కూడ పిలుతురు.

ఇట్లు తొమ్మిదిని చేరిన జీవుడు మూల ప్రకృతి అనుగ్రహముగ రాజ సింహాసనమును అధిష్ఠించగనే దైవము అతని రాజమకుటమై నిలచును. అనగా వారు దైవ స్వరూపులే అగుదురు. అట్టి వారి యందు ప్రకృతి, దైవము, ధర్మము స్థితిగొని యుండును. పది యగు దైవము తన మకుటముగాను, మూలప్రకృతి తన ఆసనము గాను, ధర్మదండము తన చేతికఱ్ఱగాను పూర్ణయోగి భాసించును. ఇచ్చట ప్రకృతి ఆసనమనగా కూర్చుండు కుర్చీయని కాదు. తల్లి ఒడికి ఎక్కిన కుమారుడని, సింహముపై కూర్చున్న పార్వతీదేవి ఒడిలో కూర్చుండు కుమారుడితడే. అతని మకుటమే పరతత్త్వము, చేతికఱ్ఱయే శక్తిదండము, ధర్మదండము. (గణపతిని, సుబ్రహ్మణ్య స్వామి నిట్లు ఊహించవచ్చును.)

ఒక సామాన్య వేటకాడు ఇట్లొక దైవ కుమారుడు కాగలడు. అతని కుడి భుజమున కుంభ ముండును. ఆ కుంభము నందు

ప్రాణ చైతన్యము లుండును. అతడా ప్రాణ చైతన్యములను కుంభము నుండి వృష్టిగ జీవులపై కురిపించు చుండును. ఆ ప్రాణ చైతన్యముల కుంభవృష్టి జీవులకు ప్రేరణ కలిగించి, వారి మనస్సును కన్యను, బుద్ధి యను పురుషునకు వివాహ మొనర్ప గలదు. అట్లు వివాహము కావించి జలములతో ప్రోక్షించుచు వారిని ఆశీర్వదించును. గురు సమక్షమున జరుగు వివాహ సంస్కారముల కర్థ మిదియే. వివాహమందు గురువు రూపమున పురోహితు డుండును.

## MEDITATION - 82

(June 10, July 3, Dec.13, Jan.5)

Couple married. Inherits Heaven and Earth. Sky married Earth. Time married Space.

దంపతి పెండ్లి చేసుకొనిరి. స్వర్గమును భూమిని పొందిరి. ఆకాశము భూమిని పెండ్లి యాడెను. కాలము చోటును పెండ్లి యాడెను.

*వివరణము :*

మనోబుద్ధుల పరిణయమే నిజమైన పరిణయము. బుద్ధి జీవుని ప్రకాశము. మనస్సు దేహముయొక్క ప్రకాశము. బుద్ధి పురుషుని మనస్సు. స్త్రీ, దేహము మనస్సు. అనగా స్వభావము. స్వభావము బుద్ధిని చేరుట పెండ్లి. పెండ్లికూతురు పెండ్లి కొడుకును చేరుట వంటిది. జీవతత్త్వము ఆకాశమునుండి దిగి వచ్చును. మనోతత్త్వము భూమినుండి ఉద్భవించును. అందువలన మనోబుద్ధుల పరిణయము భూమ్యాకాశముల పరిణయము. ఇదియే స్వర్గము భూమిని చేరుట లేక భూమి స్వర్గమగుట. ఇదియే మానవుడు మహాత్ముడగుట కూడ. అతని యందు మర్త్య లోకములు, దివ్యలోకములు అపుడేకమై పదార్థము పరమార్థము ఒకే తత్త్వముయొక్క భిన్న ముఖములని తెలియును. అట్టి వానికి పదార్థమున పరమార్థము, పరమార్థమున పదార్థము గోచరించి దివ్యానుభూతి కలిగించును. కాలము, చోటు ఏకమై తదతీత భావమున జీవింతురు. ముందు ధ్యానముల వివరణములో కాలము, చోటు విభజింపబడుట, కాలము వలయాకారముగ భ్రమణము చేయుట, చైతన్యము వలయములోనికి దిగివచ్చుచు సప్త లోకముల సృష్టి జరుగుట తెలుపబడినది. మహాత్ముని యందు ఇక కాలచక్ర భ్రమణము లేదు. కారణమేమన కాలము, చైతన్యము ఏకమైనవి.

పై దివ్యస్థితిని పొందినవారు భూమిని స్వర్గము చేయుటకై ప్రయత్నింతురు. వారియందు అది సత్యమై గోచరించుట వలన అదే సత్యమును జీవులందరు అనుభూతి చెందవలెనని అభిలషింతురు. దీనినే మహాత్ముడగు ఏసుక్రీస్తు 'The Kingdom of God upon Earth' అనినాడు. అగస్త్యాంశ స్వరూపులగు మాస్టరు సి.వి.వి. భౌతిక అమరత్వ మనినారు (Physical immortality). దీనిని సాధించుటకే ప్రాచీన ఋషులు యోగవిద్య నందించినారు. ఈ వివాహము సిద్ధించిన జీవుడు అమరులై, చిరంజీవులై దివ్య ప్రణాళికకు సమర్పణ చెంది లోకమున శాశ్వతులై నిలచియున్నారు.

## MEDITATION - 83

(June 11, July 2, Dec. 14, Jan. 4)

Light of life measures in degrees. Pages of wisdom counted in numbers. Span of time filled in pot. Volume of space moulded in cube. Degrees expand.

జీవ ప్రకాశము కొలత దశల వారిగ జరుగుచున్నది. దివ్యజ్ఞానము పుటల వారిగ సాగుచున్నది. ఆయుః ప్రమాణము కుంభమున నింపబడినది. చోటు పరిమాణము ఘనము (Cube) ఆకారము చెందుచున్నది. కొలతలు వ్యాప్తి చెందుచున్నవి.

*వివరణము :*

మనోబుద్ధుల వివాహముతో క్రమముగ జీవుని ప్రకాశము పెరుగుట నారంభమగును. ముందుగ మనస్సంతయు వెలుగై నిండును. అటుపైన ఇంద్రియములు, శరీరము వెలుగై నిండగలవు. ఇట్లు అణువణువు శరీరమున ప్రకాశవంతము, తేజోవంతము అగును.

వెలుగు వ్యాప్తి చెందుచుండగ బుద్ధిలోకముల నుండి జ్ఞానము కూడ వ్యాప్తిచెంది. మనోలోకమున విజ్ఞానము ఆవిష్కరింప బడుచుండును. ప్రపంచ గ్రంథము లన్నియు క్రమముగ అవగాహన యగుచుండును. మనోవికాశము కారణముగ సమస్త గ్రంథముల యందలి సమన్వయము కూడ తెలియుచుండును.

ఆయుః ప్రమాణము ఇట్టి ఉన్నత సాధకునిపై పనిచేయక కాలవలయములు వాని పుట్టుక స్థానమైన పూర్ణత్వమును చేరును. అవియే ఆయుష్షు కుంభమును చేరుట.

షట్చక్రముల యందలి చైతన్యము పుష్పమాలవలె ఏర్పడుటచే జీవచైతన్యము షణ్ముఖమై స్థితిగొనును. ఎగుడుదిగుడు ప్రవాహములు లేక ఘనమై నిలచును. ఆరు చక్రముల తత్త్వము ఆరు పద్మముల వలె, ఆరు దిశలకు వికసించును. అవి తూర్పు, పడమర, ఉత్తరము, దక్షిణము, ఊర్ధ్వము, అధస్సు. గణిత శాస్త్రమున ఆరు ముఖముల

సంకేతమును “ఘనము” అందురు. అనగా ‘క్యూబ్’. ఈ ఘనము నకు తల క్రిందులు లేదు. ఎట్లుంచినను ఒకే రూపమున కనిపించును. అట్లే జీవుడు కూడ ఈ స్థితిలో సర్వకాల సర్వావస్థల యందు స్థిరముగ నుండును. స్థితప్రజ్ఞుడై యుండును. అతని యందు ప్రకాశముయొక్క వ్యాప్తి క్రమముగ పెరుగుచునే యుండును. ఇట్లు మనిషి మహాత్ముడై, ఋషియై, మహర్షియై, రాజర్షియై, బ్రహ్మర్షికూడ యగును. వశిష్ఠాదు లట్టివారు.

## MEDITATION - 84

(June 12, July 1, Dec. 15, Jan. 3)

Verticals rotate horizontals. Horizontals meet verticals. Degrees expand angles. Angles awake angels. The wheel rotates.

ఊర్ధ్వములు సమాంతరములను పరిభ్రమింప చేయుచున్నవి. సమాంతరములు ఊర్ధ్వములను కలయుచున్నవి. కోణములు క్రమముగ వ్యాప్తి చెందుచున్నవి. వ్యాప్తిచెందిన కోణములు దేవతలను మేల్కొల్పుచున్నవి. చక్రము పరిభ్రమించుచున్నది.



*వివరణము :*

జీవచైతన్యము దివ్యోన్ముఖమైనపుడు ఊర్ధ్వముగ చరించును. పదార్థమునందు చరించునపుడు సమాంతరముగ చరించును. పదార్థమున చరించు జంతువులు సమాంతరముగ వెన్నెముక కలిగి యున్నవి. మానవులకు వెన్నెముక సమాంతరముగ కాక నిట్ట నిలువుగా యుండుట వలన అతడు ఊర్ధ్వముగ చరించగలడు. ముందు తెలుపబడిన ధ్యానములు ఊర్ధ్వముఖముగ చరించు జీవచైతన్యము గలవారిని గూర్చి వివరించినవి. అట్టి చైతన్యము కలవారి బాహ్య జీవనమంతయు దివ్యత్వమునే వ్యాపింప చేయు చున్నవి.

ఆధ్యాత్మిక వాఙ్మయమున లంబరేఖలు ఊర్ధ్వములు. సమాంతర రేఖలు పదార్థ అభిలాష కలిగించునవి అని సంకేతింప బడినవి. ఊర్ధ్వములు పురుషునిగను, సమాంతరములు ప్రకృతిగను సంకేతింపబడినవి. సామాన్య మానవులు పదార్థాభిలాష కలిగి యుండి బాహ్య ప్రపంచములోనికి పరువు లెత్తుచుందురు. వీరి చైతన్య ప్రవాహము సమాంతరములు. సత్సాధకులు ఇట్టి గమనము నుండి తిరోధానము చెంది అంతర్ముఖులై ఊర్ధ్వముగ గమనము చేయుటకు చేయు ప్రయత్నములే ధ్యానాధికములు. పై కారణము గనే సాధకులు ఆహార వ్యవహారములను కట్టుబాటు చేసుకొని, పూజ, స్వాధ్యాయము, ధ్యానములు చేయ ప్రయత్నింతురు.

చైతన్యము ఊర్ధ్వమగుచున్న కొలది సమాంతరములు కట్టుబాటగు చుండును. ఊర్ధ్వముల చుట్టును క్రమముగ సమాంతరములు పరిభ్రమించుచుండును. అనగా దివ్య జీవనమునకు ఐహిక జీవనము కట్టుబడి యుండును. దివ్య జీవనమే ప్రధానముగ నడచుచుండును. తపస్సు, ధ్యానము, పూజ, హోమములను చేయుట ద్వారా కలుగు దివ్య భావములకు కార్యాచరణ మేర్పరచును. ఇదియే ఊర్ధ్వముల చుట్టును సమాంతరములు పరిభ్రమించుట. సమాంతరములు ఊర్ధ్వములను చేరుటయని ధ్యానము తెలుపుచున్నది.

ఇట్లు జరుగుచున్న స్థితిలో స్వభావమునందలి పరిమితులన్నియు క్రమముగ సర్దుబాటగును. సంకుచితత్త్వములు తగ్గును. ఇదియే కోణములు క్రమముగ వ్యాప్తిచెందుటగ తెలుపబడినది.

స్వభావము పై విధముగ వికాసము చెందుచున్నప్పుడు, దేహము నందలి దేవతాప్రజ్ఞలు మేల్కాంచగలవు. మేల్కాంచిన దేవతా ప్రజ్ఞలు మరికొన్ని దేవతా ప్రజ్ఞలను మేల్కొల్పును. ఇట్లు క్రమముగ మానవు నందలి దివ్యత్వము తరంగములు తరంగములుగ వికాసము చెందును. సత్కార్యములు చేయు భావములు కలుగుట, అవి కార్యరూపము దాల్చునపుడు మరికొన్ని భావములు కలుగుటగ సాధకుల జీవనము క్రమోన్మీలనము చెందుచుండును. సాధకుని పురోగమనము అతని నుండి వెలువడు సత్కార్యముల విస్తృతిగ తెలియనగును. ఊర్ధ్వముగ పెరుగుచున్న కొలది పరహిత కార్యములు కూడ పెరుగుచు నుండును. జీవన మిట్లు సాగుచు నుండును.

## MEDITATION - 85

(June 13, June. 30, Dec. 16, Jan. 2)

The wheel of seven colours rotates into the wisdom white. Gold melted. Green vegetated. Red is blood. Blue is sky. Kingdom colourful.

సప్త వర్ణముల చక్రము భ్రమణమున శ్వేత వర్ణమును ధరించుచున్నది. సువర్ణము కరగుచున్నది. హరిత వర్ణము పంటల నిచ్చు చున్నది. ఎఱుపు రక్తము. నీలము ఆకాశము. రాజ్యము సర్వవర్ణమయము.

*వివరణము :*

ముందు ధ్యానములలో తెలిపిన విధముగ మనోబుద్ధులు సమన్వయింప బడినపుడు దివ్యత్వము వికాసము చెందుచు దేహ మందలి సప్త కేంద్రములు శోభాయమానమైన రంగులను వ్యక్త పరచును. ఉదయమున బంగారు కాంతి కరిగించిన బంగారమువలె ప్రకాశవంతముగ మెరయుచున్నవి. దేహమందలి సమస్త ధాతువులు శరదృతువు నందలి ప్రకృతివలె సౌందర్యవంతముగ వెల్లివిరియును. ప్రకృతి శోభను హరిత వర్ణమందురు. హరి అణువణువున ప్రకాశించు నపుడు ప్రకృతికాశోభ కలుగును. అలాగే దివ్యత్వము చెందిన జీవునియందు సప్తధాతువులు శోభను చెందుచుండును. రక్తము తీవ్రమగు అయస్కాంత శక్తిని పొంది ఎఱ్రదనమును దాల్చును. ఎరుపు వర్ణము గల రక్తము అనంతశక్తిని ప్రసాదించుచు, అలుపులేని దేహము నేర్పరచును. జీవప్రజ్ఞ నిర్మల ఆకాశము వలె ప్రకాశించు చుండును. సమస్త వర్ణములు కలిసి శ్వేత చక్రమువలె గోచరించును. సర్వ వర్ణముల సముదాయమే శ్వేత వర్ణము. "*సహస్రదళ పద్మస్థా సర్వవర్ణోప శోభితా*" అని సహస్రార చక్రమును, లలితా సహస్రనామ స్తోత్రమున ఆరాధింతురు.

పై ధ్యానమున సాధకునకు కలుగు దర్శనము సహస్రారమున శ్వేతవర్ణము, పాలభాగమున నీలవర్ణము, హృదయమున బంగారు వర్ణము ఉదరవితానము క్రింద హరితవర్ణము.

ఎరుపు ఇచ్ఛాశక్తి, నీలము జ్ఞానశక్తి, మరకతము లేక ఆకుపచ్చ క్రియాశక్తి. జీవుడు దివ్యమగు త్రిగుణములయందు చరించుచు తదతీతముగ కూడ భాసించుచున్నట్లుగ ధ్యానించవలెను.

## MEDITATION - 86

(June 14, June 29, Dec. 17, Jan. 1)

Tables turn. Time tables framed. Planetary adjustments. Levels set in squares. Set-squares erected. Right angles established. Wrong angles adjusted. Accounts squared up.

బల్లలు త్రిప్పబడినవి. కాల పట్టికలు రూపొంది నవి. గ్రహముల సర్దుబాట్లు. బాహ్య జీవనము సమతలమైనది. అంతర్గత జీవితము నిర్మించబడినది. లంబకోణములు స్థిరపడినవి. దృక్కోణములు సర్దుబాటైనవి. భృక్తము రహితమైనది.

*వివరణము :*

సత్సాధనమున దివ్యానుగ్రహము పొందినపుడు, జీవుని యందు కలుగు మార్పులే ఈ ధ్యానములం దీయబడినవి. ఇందు క్రతువిద్యకు సంబంధించిన సంకేతములు వాడబడినవి. బల్లలు త్రిప్పబడుట యనగా ఐహిక జీవనము దివ్యజీవన మగుట కాల పట్టికలు రూపొందింపబడినవి అనగా జీవనము తనదిగా కాక దివ్య ప్రణాళికకు సమర్పింబడి నిర్వర్తింపబడుట. అట్టి అనుగ్రహ పాత్రునిపై గ్రహముల ప్రభావము సర్దుబాట్లు చేయబడును. గ్రహములు పరిమితు లేర్పరచక తమ వంతు సహకారము లందించుచుందురు. బాహ్య జీవనమున ఒడుదొడుకు లుండవు. అంతర్గత జీవితము దివ్య ప్రణాళికకు సమర్పణ చేయబడుటచే అచటి నుండి వెలువడు చైతన్య స్రవంతియే అతని నుండి దిగి వచ్చి బాహ్యప్రపంచములోనికి ప్రసరించు చుండును. ఇట్టి స్థితిలో నున్న వారిని లంబకోణము అందురు. అనగా ఊర్ధ్వము నుండి నిట్టనిలువుగ స్ఫూర్తి దిగివచ్చు చుండగ సమాంతరముగ బాహ్య లోకములలోనికి తత్ స్ఫూర్తిని కార్యరూపమున అవతరింప చేయు చుండును. ఇట్టి ఉత్తమ సాధకునియందు దృక్కోణము లన్నియు సర్దుబాటై దివ్య దృశ్యమై యుండును. కర్మబంధమిక లేదు. భుక్త మంతయు రహితమైనదని భావము. జీవుడు ముక్తుడైనాడని కూడ భావము.

## MEDITATION - 87

(June 15, June. 28, Dec. 18, Dec. 31)

Gates open wide. Boat launched ocean. Star guides boat. Star reflects fish in ocean. Fisherman sails. Fishing of man.

ద్వారములు విశాలముగ తెరువబడినవి. నావ సముద్రమును చేరినది. నక్షత్రము నావను నడిపించుచున్నది. నక్షత్రము మీనమువలె సముద్రమున ప్రతిబింబించుచున్నది. నావ యందు బెస్తవాడు పయనించు చున్నాడు. జీవులనెడి చేపలను పట్టుటయే అతని పని.

*వివరణము :*

నదీ ప్రవాహమువలె వ్యక్తిగతముగ నడచుచున్న జీవనము, అనంత జీవన మనెడి సముద్రములోనికి ప్రవేశించినది. ఇపుడు సాధకుడు లోకహితుడైనాడు. అతని జీవనము అపరిమితమైనది. అనంతమగు సముద్రమునందు అతని ప్రయాణము మొదలైనది. ఆకాశమందలి తారలే మార్గదర్శకులు. అనగా సప్తర్షులే అతనిని నడిపింతురు. అందు వశిష్ఠతార ప్రత్యేకముగ నడిపించును. ఆ తార సముద్రమునందు కూడ ప్రతిబింబించు చున్నది. ప్రతి బింబించు తారలే పరమగురువుల బృందము. వారు మార్గ దర్శకులుగా జీవనము కొనసాగును. ఈ స్థితియందు వున్న లోకహితునకు జీవుల నుద్ధరించుటయే ఏకైక కర్తవ్యము. బెస్తవాడు చేపలు పట్టినట్లు లోకహితుడు సత్యాన్వేషకులగు జీవులను పట్టుచు మార్గమున నిలబెట్టును. అట్టివారిని తన నావయందెక్కించు కొనును.

## MEDITATION - 88

(June 16, June. 27, Dec. 19, Dec. 30)

Two fishes, five loaves gained. St. Mark speaks. “Feed the hosts of wisdom. No more hunger, suffering, death.” The boat sails. The wind blows. The waves dance. The fish jump.

రెండు చేపలు, ఐదు జతల రొట్టె ముక్కలు. మార్కండేయుడు పలుకుచున్నాడు : “జ్ఞానులను పోషింపుడు. ఆకలిదప్పులు, మరణము లేవు.” నావ సాగుచున్నది. గాలి వీచుచున్నది. కెరటములు నాట్య మాడుచున్నవి. చేపలు ఎగురుచున్నవి.

*వివరణము :*

ఐదు జతల రొట్టెలు, రెండు చేపలు జ్యోతిశ్చక్రమును సూచించును. మీనరాశి యందలి రెండు చేపలు మీనరాశిని, కన్యా రాశిని సూచించెను. మిగిలిన పది రాశులు ఐదు జంట రాశులు. అవియే ఐదు జతల రొట్టె ముక్కలు. అవి ఈ విధముగ నున్నవి: 1. మేషము, తుల. 2. వృషభము, వృశ్చికము. 3. మిథునము, ధనుస్సు. 4. కర్కాటకము, మకరము. 5. సింహము, కుంభము. ఐదు జంటల రాశులు ఐదు తత్త్వములకు సంబంధించిన దంపతులు. అనగా ఒక్కొక్క జంట ఒక్కొక్క దంపతి. రాశిచక్రము పరిభ్రమించు చుండగ వాని ప్రభావమున జీవుడు పోషింపబడుచు పరిణామము చెందుచున్నాడు. వాని పోషకత్వము నందించువాడు లోకహితుడు. అతడు రాశిచక్రము నుండి ద్వాదశాదిత్య భావము లను పిండుచు తనచే అనుగ్రహింపబడిన జీవులను పోషించు చుండును. ద్వాదశ దళముల అనాహతచక్ర మాధారముగ అతడీ కర్తవ్యమును నిర్వర్తించు చుండును. ద్వాదశ కమలము హృదయ కమలమే. హృదయ కమలమునకు జీవుల నుద్ధరించుచు ద్వాదశాదిత్య సారమును జీవులకు పంచిపెట్టును. తత్కారణముగ జీవులకు జ్ఞానపిపాసయే కాని క్షుత్పిపాస యుండదు. అనగా జ్ఞానపిపాస కారణముగ ఉత్తేజితులైన జీవులు ఆకలిదప్పుల నుండి ఉద్ధరింప బడుదురు. మరణమునుండి కూడ యుద్ధరింపబడుదురు. "జ్ఞానామృతమును పంచుచు జీవులయందలి జ్ఞానపిపాసను,

రగుల్కొల్పి పోషింపుడు. జ్ఞానమునందు పిపాస కలిగిన జీవుడాకలి దప్పులను, మరణమును కూడ దాటకలడు.'' అని మార్కండేయ మహర్షి బోధించినాడు. ఆ విధముగ హృదయ కమలమును మేల్కొల్పి పోషించుట లోకహితుడు నిర్వర్తించుచు, పయనించు చుండును. వాతావరణ మంతయు అతని కనుకూలముగ ఏర్పడుటయే, చల్లని మెల్లని వాయువులు వీచుట. అతని సమక్షమున జీవచైతన్యము పొంగుటయే కెరటములు నృత్యమాడుట. జీవులు ఆనందోత్సాహ ములతో సాగుటయే చేపలు ఎగిరిపడుట. పై విధముగ లోకహితుడు ఆనందోత్సాహములతో బృందమును నడిపించు చుండును.

## MEDITATION - 89

(June 17, June. 26, Dec. 20, Dec. 29)

Markandeya. Mark-and-A!! Mark in the ark leads pairs through water to life. Noah’s ark sails.

మార్కండేయుడు. మార్కు- మరియు ఆ. చంద్రవంక యందలి బిందువు ద్వంద్వములను నీటినుండి జీవనములోనికి గొనిపోవు చున్నది. నోవా పడవ సాగుచున్నది.



*వివరణము :*

మార్కండేయుడు మృత్యువును దాటిన మహర్షి. జనన-మరణములు, సుఖ-దుఃఖములు, గెలుపు- ఓటములు, మానావమానములు, నిందాస్తుతులు అనెడి ద్వంద్వములు మర్త్య ప్రపంచమున సహజములు. ఏకత్వమను సూత్రమునకు ద్వంద్వములు రెండు ముఖముల వంటివి. ద్వంద్వములలో ఒకటి కోరిన రెండవది కూడ యుండును. ఒకటి నిరాకరించిన రెండవది కూడ నిరాకరింపబడును. సృష్టికి యీవల ద్వంద్వముల క్రీడ అనంతముగ సాగుచునే యుండును. సృష్టికి ఆవల ద్వంద్వములు లేవు. సృష్టి కావల ప్రజ్ఞయే సృష్టియందు ద్వంద్వముల కేంద్రస్థానముగ నున్నవి. అదియే సమత్వదృష్టి, సమాన ధర్మము, యోగస్థితి అని కృష్ణుడు తెలిపినాడు. అది కుడి ఎడమలకు కేంద్రముగ నుండును. ఇడ, పింగళ ప్రవాహములకు కేంద్రమైన సుషుమ్నగ యుండును. కుడి, ఎడమ కన్నులను కలుపు తోరణమునందు కేంద్రస్థానము భ్రూమధ్యమగును. అట్టి కేంద్ర స్థానమును గుర్తింపవలెను. దీనినే 'Mark in the Ark' అని ధ్యానము తెలుపుచున్నది. ఈ బిందువు ద్వంద్వములనెడి సంసార సాగరమునుండి యోగస్థితి యనెడి దివ్య జీవనమునకు నడిపించును. లోకహితుని నావ భ్రూమధ్య మార్గమున సాగుచునుండును. నోవా అను మహనీయుడు కూడ ఇట్లే జీవులను ప్రళయము నుండి కాపాడినాడు.

## MEDITATION - 90

(June 18, June. 25, Dec. 21, Dec. 28)

Mark the ark in moon. Sixteen chapters of Mark in sixteen days of sailing in ark. Sixteen moons shine. Maiden wears crown of moons.

చంద్రుని యందలి రేఖను గుర్తించుము. చంద్రరేఖలో పదునారు దినములు పయనించు బిందువును పదునారు అధ్యాయములుగ తెలియుము. పదునారు చంద్రులు ప్రకాశించు చున్నారు. కన్య పదునారు చంద్రుల మకుటమును ధరించినది.



*వివరణము :*

భ్రూమధ్యమును చేరిన ప్రజ్ఞ తోరణమందలి బిందువుగా తెలిపితిమి. ఈ తోరణము రాజ తోరణము. దాని కున్ముఖముగ మకర తోరణము కలదు. అది ఇడ, పింగళల ప్రజ్ఞలను ఫాల భాగమున కలుపు తోరణమువలె నుండును. ఈ తోరణమును ఉత్తరాయణమని, రాజ తోరణమును దక్షిణాయనమని అందురు. ఉత్తరాయణ రేఖనే మకర తోరణమని అందురు.

**రాజతోరణము**



భ్రూమధ్యము

**మకర తోరణము**




భ్రూమధ్యమున గల బిందువు పిట్యుటరీ కేంద్రము. అది నరుని ఉత్తమోత్తమ స్థానము. మకర తోరణమునందుగల బిందువు పీనియల్ గ్లాండ్, ఆజ్ఞా కేంద్రము. అది నరుడు దివ్యత్వము చెందుట వలన పొందు స్థానము. భ్రూమధ్యమున నుండి ఆజ్ఞ యందలి దైవమును ఆరాధన చేయుటయే ధ్యానము. ధ్యానము యొక్క దక్షత దీక్షల నుండి ఇడ, పింగళ కేంద్రమున నున్న ప్రజ్ఞ ఒక వంతెనగ ఏర్పడును. అది బోర్లించిన చంద్రరేఖ వలె యుండును. ఈ చంద్రరేఖ పదునారు బిందువులతో ఏర్పడెను.

రేఖా మధ్యమందలి బిందువు ఆజ్ఞా స్థానమగును. పదునారు బిందువులు చంద్రుని పదునారు కళలుగ సంకేతము. పదునాలుగు తిథులు, పౌర్ణమి, అమావాస్య కలిపి పదునారు. అమావాస్య నుండి పౌర్ణమికి పదునారు తిథులు. అదియే పదునారు రోజుల ప్రయాణము. మరల పౌర్ణమి నుండి అమావాస్యకు కూడ పదునారు తిథుల ప్రయాణము. ఈ ప్రయాణమున మధ్యమ స్థానము అష్టమి. అదియే ఆజ్ఞా బిందుస్థానము. అదియే దుర్గాష్టమి, కృష్ణాష్టమి. అది మానవుడు చేరు దివ్యస్థానము, యోగస్థానము. అందువలన అష్టమి పవిత్రమైన పుణ్యదినము. ఈ పదునారు చంద్రులు, పదునారు కళలు, పదునారు తిథులతో కూడిన ప్రయాణమునంత నిర్వర్తింపచేసి తత్కారణముగ సృష్టిని ఉద్భవింపచేసి, వృద్ధి పొందించి మరల తనలోనికి లయము చేసుకొను కార్యక్రమ మంతయు మూల ప్రకృతిదే. ఆమెనే అదితి, గాయత్రి, రాజరాజేశ్వరి, లలిత, కన్యకాపరమేశ్వరి అని పిలుతురు. ఈ పదునారు కళలు ఆమె ధరించు కిరీటముగ ఈ ధ్యానము వర్ణించుచున్నది. లలితా సహస్రనామమున ఈ వివరణము నిచ్చు స్తోత్ర శ్లోకములు కలవు. ముందు ధ్యానములలో తెలుపబడిన రాజమకుటధారి జగన్మాతను దర్శించుటయే ఈ వివరణము. ఇది సాధనకు పరాకాష్ఠ.

## MEDITATION - 91

(June 19, June 24, Dec. 22, Dec. 27)

Ocean roars thunder. Waves meet clouds. Ark leaps on bounds. Whole space sounds. Foam of ocean abounds. OM resounds.

సముద్రము ఘోషించు చున్నది. అలలు ఉవ్వెత్తున మేఘములను తాకుచున్నవి. అలల పైన (జీవుని) నావ తేలుచున్నది. భూనభోంత రాళములు నాదము చేయుచున్నవి. ఉవ్వెత్తున లేచు సముద్ర కెరటముల నుండి తెల్లని దూది వంటి నురుగు ఎగజిమ్ముచున్నది. ఓంకారము ప్రతిధ్వనించు చున్నది.



*వివరణము :*

ఈ ధ్యానము ఒక చిన్న ప్రళయ సూచకము. ముందు పంద్రెండు సూత్రములనుండి జీవుడు పొందుచున్న ఉత్తమోత్తమ స్థితులకు ఇది పరాకాష్ఠ. ఇచట జరుగు ప్రళయము నేను, నాది అను విషయములకు. నేను అను అహంకార ప్రజ్ఞ లయము చెందుచు, నే నను విశ్వాత్మ ఆవిష్కరణము చెందు సన్నివేశము. నేను అన్న అహంకార ప్రజ్ఞ లేనప్పుడు నాది లేనే లేదు కదా! నేను, నాది అనునవి నాదమునందు మిళితమై ఓంకారమను ఒకే ఒక ధ్వని యుండును. తానున్నట్లు జ్ఞప్తి యుండును కాని, రూపముగాని పుట్టు పూర్వోత్తములుగాని యుండవు. ఉండుటయే గాని మరియొక మార్గముండదు. ఇది బ్రహ్మ పథమునకు చేరువగు స్థితి. కేవలము ఓంకారము తప్ప ఏమియు వినిపించునది లేదు. అనంతమగు నీలము తప్ప కనిపించునది లేదు. ఉన్నాను అను తెలివి మాత్రము వుండును. ఇదియే "అస్మిత" స్థితి. ఈ స్థితియందు వేచియుండుట తప్ప మరి ఏమియును చేయుట లేదు. కేవలము వుండుటయే.

## MEDITATION - 92

(June 20, June 23, Dec. 23, Dec. 26)

Three days before initiation. Ninety two days in ninety degrees. Ninety third day of judgement. The rod of justice rules. Ark reaches shore. Bird chirps future. Past doubled future. Past meet future in man.

మూడు దినములు ఉపదేశమందుంచు పర్వదినములు. తొంబది రెండు దినములలో తొంబది దశలు. (డిగ్రీలు). తొంబది మూడవ రోజు నిర్ణయము. ధర్మదండము నిర్ణేత. నావ ఒడ్డు చేరినది. పక్షి భవిష్యత్తును కూసినది. భూతము రెట్టింపు భవిష్యత్తు యైనది. భూత, భవిష్యత్తులు మనిషియందు కలసినవి.

*వివరణము :*

ముందు ధ్యానమున తెలిపిన జీవుడు మూడు రోజులు వేచి యుండుటగా నుండును. నచికేతుడు కూడ మూడు రోజులు వేచి యుండెనని కఠోపనిషత్తు తెలుపుచున్నది. సావిత్రీదేవి కూడ మూడు రోజులపాటు యముని ననుసరించుచు సంవాదము జరిపెనని భారతము తెలుపుచున్నది. మూడు దినములు వేచియుండుట మూడు లోకముల యందలి ప్రవర్తనను పరిశీలించుటకే. ధర్మ నిర్ణయము కూలంకషమగు పరిశీలన అయిన తరువాతే కదా! ఇచ్చట నిర్ణయించునది ధర్మమే. దండధరుడైన యముడు ధరించునది ధర్మ దండనమే. ఏ జీవునికైనను అతని వెంట వచ్చునది ధర్మ మొక్కటియే. నిర్ణయము ధర్మాధర్మపర వర్తనమును బట్టి యుండును. ధర్మదేవత ఈ విషయమున కేవలము నిమిత్త మాత్రుడే.

తొంబది దశలను దాటుటను, తొంబది రోజులుగ వర్ణించిరి. ఈ ధ్యానములు కూడ ఆ దశల వారిగనే అందింపబడినవి, తొంభై డిగ్రీలు అనగ లంబకోణమే. లంబకోణము సరియగు కోణము. అది యోగస్థితిని సంకేతించును. యోగమున సమాంతరమగు ప్రపంచమునందు ఊర్ధ్వ ముఖముగ నిలుచుట సిద్ధి. అట్లు నిలుచుటను తొంబది దశలు చేరినవానిగ గణిత శాస్త్రము సంకేతించు చున్నది. అట్టివాని జీవన నౌక పరమపథము చేరినట్లే. అదియే ఒడ్డును చేరుట.

ఇట్లు బ్రహ్మత్వము చేరిన జీవుడుగాని, ఇతర జీవుడుగాని ప్రళయమున ధర్మ నిర్ణయమునకు గురి అగుదురు. పూర్వ కర్మమును బట్టి మరల సృష్టి ప్రారంభమున తమ తమ స్వభావము లను సహజముగ పొందుచు భవిష్యత్తు లోనికి నడచుదురు. జీవులు హంస స్వరూపులు కనుక పక్షిగ సంకేతింపబడిరి. కూతలు పెట్టుచు భవిష్యత్తు లోనికి పక్షి జనిన దనగా వెనుకటి గుణము లన్నియు ఆవహింపగ వెనుకటి ప్రవర్తనముతో తనదగు లోకము లోనికి, తన స్వభావమునకు తగు రూపముతో దిగివచ్చును. తన గతమునే వెదకికొనుచు మరల అదే స్థితికి దిగివచ్చి గత ఫలమే భవిష్యత్తుగ ఏర్పరచుకొనును. ఇది సామాన్య జీవుల కథ.

బ్రహ్మపథము చేరిన జీవుడుకూడ మరల సృష్టి ప్రారంభమున దిగివచ్చుట తప్పదు. కాని వారు ముక్తసంగులు, సంగము లేక జీవ సంఘమున జీవించుచు, వారి ఉద్ధారణమునకు తోడ్పాటు చేయుదురు. అట్టివారే సనక, సనందనాదులు, నారద మహర్షి, సప్తఋషులు, వశిష్ఠ, అగస్త్యాది మహర్షులు.

## MEDITATION - 93

(June 21, June. 22, Dec. 24, Dec. 25)

Man reaches shore. Sailor transformed hunter. The Lion, the Bull, the Serpent, the Maid, the Lotus, safely landed. Fish goes to sea. Eagle flies into the sky. Man comes to land to rule. Rod of justice established. Thunder wonder trumpet. The wheel reverses.

మనిషి తీరమును చేరెను. నావికుడు వేటకాడు అయినాడు. సింహము, ఎద్దు, పాము, కన్య, కమలము క్షేమముగ తీరము చేరినవి. మీనము సముద్రము చేరినది. గద్ద ఆకాశమున కెగిరినది. మానవుడు పాలించుటకై భూమిని చేరినాడు. ధర్మదండము స్థాపింపబడినది. భేరీ నినాదము పిడుగువలె శబ్దము చేసినది. చక్రము వివర్తనము చెందినది.

***వివరణము :***

ముందు ధ్యానములలో పై సంకేతము లన్నియు వివరింప బడినవి. శ్రద్ధాళువైన పాఠకుడు ఈ ఒక్క ధ్యానమును తనకుగా వివరించు కొనవచ్చు నని భావిస్తూ.......

శుభం.

# ముగింపు మాట

మాస్టరు గారిని ప్రార్థనా సమయమున మనస్సు లోనికి ఆవాహనము చేసుకొనిన తరువాత, ముందు చదివిన ధ్యాన భావమును గూర్చి, అందు తెలిపిన సంకేతములను గూర్చి సాధకుడు తన దేహమున ఊహించి దర్శించు ప్రయత్నము శుభప్రదము కాగలదు. అట్లే ధ్యానమునందు తెలిపిన నిర్దేశాత్మకమైన సూచనలను పాటించుటకు ప్రయత్నింపవలెను.

పై విధముగ నిష్ఠతో ఒక్క సంవత్సర మీ ధ్యానములను నిర్వర్తించినచో మాస్టరు చైతన్యము వలసిన మార్పులను గావించి, సాధకుని సాధన సఫలీకృతము చేయగలదు. ఏడు సంవత్సరములు గావించినచో పరిపూర్ణము కాగలదు. ఇది వాగ్దానము.

\- పార్వతీకుమార్

# అంతర్దర్శన ధ్యానములు

# MEDITATIONS

## MEDITATION - 1

(MARCH 21, SEPT. 22, SEPT. 23)

Remember the Giver. He gave this frame. You are the Book. I AM the one copy in existence. I AM copied from the parent manuscript.

దాతను గుర్తుంచుకొనుము. ఈ రూపము అతను యిచ్చినదే. నీవతని పుస్తకము. "నేను" ఒకడనే వున్నాను. నేను మూలమునకు ప్రతీకను.

## MEDITATION - 2

(March 22, Sept. 21, Sept. 24)

Bliss is in giving and not taking. Sun gives life. He is Man. Moon receives. She is Woman. Moon has phases of waxing and waning.

ఇచ్చుటలో గల ఆనందము పుచ్చు కొనుటలో లేదు. సూర్యుడు ఇచ్చువాడు. అతడు పురుషుడు. చంద్రుడు పుచ్చు కొనువాడు. ఆమె స్త్రీ. చంద్రునకు శుక్ల, కృష్ణ పక్షములు కలవు.

## MEDITATION - 3

(March 23, Sept. 20, Sept. 25)

Be a giver. Be a Sun, be a Man. Live in Spirit. Yet live in Soul. Live in Mind, yet live in person. Live in body, but be a Man. Live in the outer world, but be an inner consciousness.

దాతగ నుండుము. సూర్యునిగ వుండుము. పురుషునిగ వుండుము. జీవునిగ నున్నను, ప్రజ్ఞ యందుండుము. మనసు నందున్నను పురుషునిగ నుండుము. దేహమందున్నను మానవుడిగ నుండుము. బాహ్యప్రపంచమున నున్నను అంతః చేతనగనే నుండుము.

## MEDITATION - 4 :

(March 24, Sept. 19, Sept. 26)

Lead me through knowledge to bliss. Lead me through strength to service. Lead me through sympathy to realisation. Lead me through love to oneness.

జ్ఞానము ద్వారా శాశ్వత ఆనందము కలిగించుము. సామర్థ్యము ద్వారా జీవుల సేవలకు స్ఫూర్తి నొసగుము. కారుణ్యము ద్వారా వికాసము కలిగింపుము. ప్రేమ ద్వారా ఏకత్వమును దర్శింప జేయుము.

## MEDITATION - 5

(March 25, Sept. 18, Sept. 27)

Night is my mother. Day is my father. Twilight is my Guru. Life is my friend. Death is my bedroom.

రాత్రి నా తల్లి. పగలు నా తండ్రి. సంధ్య నా గురువు. జీవితము నా మిత్రుడు. పడకగది నా మృత్యువు.

## MEDITATION - 6

(March 26, Sept. 17, Sept. 28)

Virtue, not intelligence, is my goal. Ability, not fame, is my motto. Expression, not impression, is my work. Depth, not height, is my position.

నా గమ్యము సద్గుణములు, తెలివి తేటలు కాదు. నా ఆశయము సమర్ధత, కీర్తి కాదు. వెలిబుచ్చుట నా పని, నమ్మించుట కాదు. లోతులో నా ఉనికి, ఎత్తుపైన కాదు.

## MEDITATION - 7

(March 27, Sept. 16, Sept. 29)

The deeper the lake is, the farther skies peep into it through reflection with solar and lunar eyes. The higher the cliff is, the less the fellow beings are visible and more vehement the fall is of the tide. I live in depth and not height.

సరస్సు లోతు కొలది, సూర్య చంద్రాత్మక ప్రజ్ఞ దూరాకాశము నుండి స్పష్టముగ ప్రతిబింబించ కలదు. శిఖరము ఎత్తుకొలది తోటి జీవులు దూరమగు చుందురు. ఎత్తున వున్నచో పడుట కవకాశమున్నది. ప్రాణాపాయము కూడాను. దీని ఎత్తులలో కాక లోతులలో నుందును.

## MEDITATION - 8

(March 28, Sept. 15, Sept. 30, March, 20)

Do not listen to what the world says. Listen to what it needs. Listen to its heart, not its tongue. Its tongue confuses you. Its heart shows you the way and trumpets the gospel.

లోకము ఏమి చెప్పుచున్నదో వినుటకన్న, లోకమునకు ఏమి కావలయునో వినుము. దాని హృదయమును వినుము. నాలుకను కాదు. నాలుక తికమక పెట్టును. హృదయము సూటిగ తెలుపును. హృదయమందు సత్యస్పందన యుండును.

## MEDITATION - 9

(March, 29, Sept. 14, Oct. 1, March, 19)

You remain an eternal secret. You are not showy. You shine forth for ever. You cannot contain your own joy.

నీవు ఒక శాశ్వత రహస్యము. నిన్ను నీవు ప్రదర్శించుకొనవు. కాని శాశ్వతముగ ప్రకాశిం తువు. నీ ఆనందము ఉబికి, పొంగి సర్వమును వ్యాపించును.

**MEDITATION - 10**

(March 30, Sept. 13, Oct. 2, March 18)

Your joy is unconditioned. Your bliss is my guiding star. I am painted and shaped by your own ray.

నీ ఆనందము అపరిమితమైనది. అది సమస్తమైన తృప్తిని, శాంతిని ప్రసాదించగలదు. అదియే నా జీవితమునకు చుక్కాని. నేను నీ వర్ణము. నీ కిరణము చేతనే రూపొందిం పబడితిని.

**MEDITATION - 11**

(March 31, Sept. 12, Oct. 3, March 17)

I AM the lake and you are the Sun. The drops of water you take from my tiny frame take their seat on the ever shining throne of your bosom. They are showered again into the sacred bosom of the Great Ocean.

నేను ఒక సరస్సును. నీవు సూర్యుడవు. నా నుండి కిరణరూపమున నీవు గొను నీటి బిందువులు నీ దేదీప్య మానమగు హృదయమున నిక్షిప్తము కాగలదు. మరల నీ హృదయము నుండి అవి మహా సముద్ర హృదయమున చేరగలవు.

**MEDITATION - 12**

(April 1, Sept. 11, Oct. 4, March 16)

These are from Higher Circles. These are from whom I follow to those who follow me.

ఈ ధ్యానములు ఊర్ధ్వలోకము నుండి అందింపబడినవి. ఇది నే ననుసరించు వారి నుండి నన్ను అనుసరించు వారి కొఱకు అందింపబడినవి.

## MEDITATION - 13

(April 2, Sept. 10, Oct. 5, March 15)

Life is a pin-point of the Eternal Truth. Generalise the particular fragments in life. Get the equation between the general and the particular.

శాశ్వత సత్యమందు జీవితమొక బిందువు. జీవిత మందలి వివిధ (భిన్న) విషయములను, అంశములను సమన్వయ పరచుకొనుము. ఏకత్వమునకు భిన్నత్వమునకు గల సంబంధము నెఱిగి జీవించుము.

## MEDITATION - 14

(April 3, Sept. 9, Oct. 6, March 14)

Thought is gold. I AM the temple. I AM the image. I build the temple. Clay is darkness and brick is light. The temple is melted into night and built in the day.

భావము బంగారము. నేను దేవా లయము. నేనే గర్భాలయ మందలి దేవుడను. నేనే దేవాలయ నిర్మాతను. మట్టి అంధకారము. ఇటుక వెలుగు. నా దేవాలయము రాత్రి కరగి పగలు నిర్మింపబడును.

## MEDITATION - 15

(April 4, Sept. 8, Oct. 7, March 13)

I AM gold. I build the temple. Steam of gold is my life. Fume of gold is my light. Life is gold. I AM healed. Sun is gold. Sun is life.

నేను బంగారము. నేనే దేవాలయమును నిర్మించు చున్నాను. బంగారు ఆవిరియే నా ప్రాణము. బంగారు కాంతియే నా వెలుగు. నా జీవనమే బంగారము. నేను స్వస్థుడనైతిని. సూర్యుడు బంగారము. సూర్యుడు ప్రాణము.

## MEDITATION - 16

(April 5, Sept. 7, Oct. 8, March 12)

Moon is silver. I AM the lake. Lake is moonlight, I AM healed. I AM silver. In me the moonbeam awakes. I AM moonlight. In me the Sun is sealed.

చంద్రుడు వెండి. నేను సరస్సు. సరస్సు వెన్నెలతో నిండినది. నేను స్వస్థుడనైతిని. నేను వెండిని. నా నుండి చంద్రకిరణ పుంజము ఉద్భవించినది. నేను వెన్నెలను. నా యందు సూర్యుడు నిక్షిప్తమై యున్నాడు.

## MEDITATION - 17

(April 6, Sept. 6, Oct. 9, March 11)

Mighty crown and spear I am. Crown is my head. I am the head. Spear is my back. I AM the tail. Crowned king I am. I am the shepherd. Spear-tip I am. I am the red sting. By me fear is killed, by me the serpent is killed.

నేనొక మహత్తరమైన కిరీటమును, అంకుశమును. కిరీటము నా తల, నేను నా తలయే. అంకుశము నా వెన్నెముక. నేను వెన్నెముకను కూడ. నేను కిరీటధారియైన రాజును. నేను గొఱ్ఱెల కాపరిని. అంకుశపు మొన నేను. మొనకు గల ఎఱుపు మచ్చను నేనే. భయము నాచేత సంహరింపబడినది. సర్పము నాచే చంపబడినది.

## MEDITATION - 18

(April 7, Sept. 5, Oct. 10, March 10)

I AM the thinker. I AM thought. I AM the knower, I AM known. I AM the seer, I AM seen. I AM he who lives, I AM life. I AM the grower, I AM grown.

నేను ఆలోచనాపరుడను, నేను ఆలోచనను. నేనే తెలుసుకొనువాడను, నేనే తెలివిని. నేను ద్రష్టను, ద్రష్ట నేనే. నేను జీవించువాడను, జీవము నేనే. నేను పెరుగు వాడను, పెరుగుదల నేనే.

## MEDITATION - 19

(April 8, Sept. 4, Oct. 11, March 9)

The saviour is coming. He comes through degrees. He is the star of the virgin, who is in charge of Nandi. Nandi is the Kailas of Moon. There she is the star of the virgin. She is the mother, she is the Grace. He is on the bull, she is on the lion. Moon is on his head, she is on the crown of fish. Moon is on his head. He is the lord of She.

రక్షకుడు వచ్చుచున్నాడు. అతడు క్రమశః దరిచేర గలడు. అతడు శ్రీ కన్య నుండి మెరయు తార. అతడా నందమునకు

సంకేతము (నంది). నందత్వము సోముని సొత్తు. రక్షకుని నందత్వము కైలాస పర్వతమంత ఉత్త మోత్తమమైనది. ఆమె జగన్మాత, అనుగ్రహ రూపిణి. అతడు నంది నధిరోహించును. ఆమె సింహము నధిరోహించును. అతని శిరస్సుపై ఆనందమునకు పరాకాష్ఠగ చంద్రవంక వలె రక్షకుడుండును. ఆమె అతని శిరస్సుపై మీనముల కిరీటముగ నుండును. రక్షకుడు కాలము నుండి కన్యద్వారా దిగిరాగ ఆమె అతని సతిగ నుండును.

## MEDITATION - 20

(April 9, Sept. 3, Oct. 12, March 8)

To whose temple the Arch is starlit, In whose temple the Sun is the image of God,
To whose temple the Moon goes every month
And Brings the message out every full-moon,
And whose message the Moon sings as a word of sixteen letters,
His religion I belong to,
His temple I visit; His name I utter;
His glory I live in.
To Him I offer the lotus of my day,
To Him I offer the lotus of my night.

ఎవరి దేవాలయమున దేదీప్యమానమగు తారకలు మకర తోరణమో, ఎవరి దేవాలయమున సూర్యుడు దైవమునకు ప్రతీకయై గర్భాలయమున నుండునో, ఎవరి దేవాలయమునకు ప్రతిమాసము చంద్రుడు యేగి ఆ మాసపు సందేశము కొనితెచ్చునో, చంద్రుడు కొనివచ్చు ఎవరి సందేశము పదహారు అక్షరములతో కూడి యుండునో, అతని మతమునకు నేను చెందినవాడను. అతని

దేవాలయ మును నేను దర్శింతును. అతని నామమును నే నుచ్ఛరింతును. అతని వైభవమున నేను జీవింతును. అతనికే నా పగటి జీవితమను పద్మము సమర్పణము. అతనికే నా రాత్రి జీవితమను పద్మము సమర్పణము.

## MEDITATION - 21

(April 10, Sept. 2, Oct. 13, March 7)

From sleep to darkness, from darkness to no colour, from no colour to brilliant blue, from brilliant blue to brilliance pure, from brilliance pure to one colour, from one colour to three, from three to four, from three and four to seven, from three times four to twelve, from twelve to twenty four, to forty eight, forty nine, to ninety eight, to one hundred, to one thousand and a series of zeros, to lead again into the one great Zero. The world goes to sleep.

నిద్ర నుండి అంధకారములోనికి, అంధకారము నుండి అవర్ణ స్థితి, అవర్ణ స్థితినుండి తేజోమయమగు నీలములోనికి, అట్టి నీలమునుండి దేదీప్యమానమగు, నిర్మలమగు తెల్లదనములోనికి, అందుండి ఒక వర్ణములోనికి, ఒక వర్ణము నుండి మూడు వర్ణములలోనికి, మూడు నుండి నాలుగు, మూడు నాలుగు కలిపి ఏడు, అటుపైన మూడు నాలుగులు పంద్రెండు, పంద్రెండు నుండి ఇరువది నాలుగు, అందుండి నలుబది ఎనిమిది, అటుపైన నలుబది తొమ్మిది నలుబది తొమ్మిది నుండి తొంబది ఎనిమిది, వంద, వెయ్యి, మరియు అచట నుండి వరుసగా పూర్ణములు పెరుగుదల అటుపై అంతయూ ఒకే పూర్ణములోనికి, అటుపైన పరిపూర్ణము, అట నుండి నిద్రలోనికి.

## MEDITATION - 22

(April 11, Sept. 1, Oct. 14, March 6)

Gods are born at Sunrise, man is born at noon.

Gods set in the West, man sets at midnight.

Gods are born in Capricorn, man is born in Aries.

Gods set in Cancer, man sets in Libra.

సూర్యోదయమున దేవతలు జన్మింతురు. మిట్ట మధ్యాహ్నమున మానవులు జన్మింతురు.

పశ్చిమమున దేవతలు అస్తమింతురు. మానవుడు అర్ధరాత్రిన అస్తమించును.

దేవతలు మకర సంక్రమణమున ఉద్భ వింతురు. మానవుడు మేషమున ఉద్భవించును.

దేవతలు కర్కాటక సంక్రమణమున అస్తమింతురు. మానవుడు తుల యందు అస్తమించును.

## MEDITATION - 24

(April 13, Aug. 30, Oct. 16, March 4)

Have your friend in yourself, be a friend to others;

Depend upon yourself, be dependable to others.

Do not expect but demand what is due to Him from them.

Be a guard and a guardian to the temple not for you, but for Him.

Be a guard and a gardener for your body and mind, not for you but for Him.

నీ స్నేహితుడు నీ యందే వున్నాడు. నీవు ఇతరులకు హితుడవై యుండుము. నీవు నీపైనే ఆధారపడుము. ఇతరులకు ఆధారముగ నుండుము.

నీ కొరకు ఏదియును ఆశించవద్దు. కాని దైవము కొరకై, ఇతరుల నుండి దైవమునకు అందవలసినది రాబట్టుము.

పవిత్ర దేవాలయమునకు రక్షకుడుగను, పోషకుడుగను వుండుము.

నీ కొరకు గాక అతని కొరకు అట్లు చేయుము. నీ దేహమునకు కూడ నీవు రక్షకుడుగను, పోషకుడుగను వుండుము. అదియును కూడ నీ కొరకు గాక దైవము కొరకే.

## MEDITATION - 25

(April 14, Aug. 29, Oct. 17, March 3)

In His name we live, in His temple we live;

In Him verily we live until He opens His eye in us.

In His name He lives, in His temple He lives;

In Him verily He lives, as He opens His eye in us.

In the meanwhile, let us wait, let us look to Him and not to each other.

Let us call Him in all to find all in Him,

When the life is a Car festival and not a war festival.

అతని పేరున మనము జీవించుచున్నాము. అతని దేవాలయమున మనమున్నాము.

నిజమునకు అతడు మనయందు కన్ను తెరచు వరకు మనమున్నా మనుకొందుము.

అతడు మనయందు కన్ను తెరచినచో అతని పేరున అతడే యుండును. కేవలము అతడే యుండును.

అంతదనుక వేచియుందము. అతనినే ఒకరి యందొకరము చూసుకొను చుందము. ఒకరినొకరు చూసుకొనక అతనినే చూతము కాక.

అతనినే పిలుతుముగాక, అతనినే సమస్తమునందు దర్శింతుము గాక.

అప్పుడే జీవితము జగన్నాథ రథమువలె సాగ గలదు. లేనిచో అది మహా సంగ్రామమే.

## MEDITATION - 26

(April 15, Aug. 28, Oct. 18, March 2)

Cure earth by food, cure water by drink,
Cure fire by heat, cure air by breath.
Cure sound by thought, cure mind by truth,
Cure is complete.

పదార్థమును అన్నముతో పవిత్రీకరించుము. నీటిని త్రాగుట ద్వారా పవిత్రీకరించుము. అగ్నిని వేడిమితో పవిత్రీకరించుము. గాలిని శ్వాసతో పవిత్రీకరించుము. శబ్దమును భావముతో పవిత్రీకరించుము. మనస్సును సత్యముతో పవిత్రీకరించుము. ఈ విధముగ పవిత్రీకరణము పరిపూర్ణ మగుచున్నది.

## MEDITATION - 27

(April 16, Aug. 27, Oct. 19, March 1)

Up the ladder creeps the serpent. Self-opposing coils harmonised. Ascending the vertical bore of the eternal center.

సర్పము నిచ్చెనను ఎగబ్రాకు చున్నది. పరస్పర విరుద్ధ భావములు సమన్వయ మగుచున్నవి. నిలువుగొట్టములో నెగబ్రాకుచు శాశ్వత కేంద్రమును చేరుచున్నది.

## MEDITATION - 28

(April 17, Aug. 26, Oct. 20, Feb. 28)

Loosening the spirals of Karma, the serpent shines winged and escapes through the bore of the Sun's body from above the eyebrows. Henceforth the serpent is the winged messenger of the Gods. He is Mercury.

కర్మ వృత్తములను వదులు చేసుకొనుచు సర్పము కాంతివంతమై ఊర్ధ్వగతి చెందుచు, ఎగురుచు సూర్య దేహమునందలి గొట్టము ద్వారా భ్రూమధ్యము నుండి విముక్తి నొందు చున్నది. అప్పటి నుండి రెక్కలు గల దివ్య సర్పమై దైవదూత యగు చున్నది. దైవ దూతలకు దైవదూత నారద మహర్షి.

## MEDITATION - 29

(April 18, Aug. 25, Oct. 21, Feb. 27)

The tongues of the serpent are raised from the stings of the scorpion. The tongues of the serpent are the wings of the eagle. Moon bears serpents. Sun enters eagle.

సర్పము నాలుకలు తేలు కుట్టు స్వభావము నుండి ఉద్ధరింపబడినవి. సర్పము నాలుకలు గరుత్మంతుని రెక్కలైనవి. చంద్రుడు సర్పములను ధరించును. సూర్యుడు గరుత్మంతుని యందు ప్రవేశించును.

## MEDITATION - 30

(April 19, Aug. 24, Oct. 22, Feb. 26)

The path of I AM is in eternal darkness. Darkness is the variegated serpent of the nether worlds. The music of the nether worlds blinds the lyre with music of the seven stringed lyre of Apollo. I bore the darkness into the spectrum of variegated light.

జీవుని అన్వేషణ మార్గము ఈ ప్రపంచమున అంతము లేని చీకటిగ గోచరించును. ప్రపంచమున ఈ చీకటి అంతర్హితముగ చిత్రవిచిత్రములతో కాల సర్పముచే అల్లబడియున్నది. సప్తతంతువైన దివ్యసృష్టి సప్తతంతువైన కాల స్వభావపు ఆకర్షణలచే కప్పబడి యున్నది. ఈ కాలమను సర్పమును అవగాహన చేసుకొని సప్త వర్ణముల దివ్య సృష్టిలోనికి చొచ్చుకొని పోయెదను.

## MEDITATION - 31

(April 20, Aug. 23, Oct. 23, Feb. 25)

Vena, the Gandharva, is wiping off the pictures of the subconscious mind on the walls of my nature with the hieroglyphs of sounds from his seven stringed lyre.

వేనుడను గంధర్వరాజు తన సప్తతంతు వైన వీణ నుండి సప్త సంకేతములుగ గాంధర్వ శబ్దములను గావించుచు చిత్తము నంటి పెట్టుకొని వున్న కర్మవాసనల సమస్తమును తుడిచివేయు చున్నాడు.

## MEDITATION 32

(April 21, Aug. 22, Oct. 24, Feb. 24)

Serpent ‘K’ loosens its skin. The pictures of past Karma on the walls of its skin are peeled off. Karma neutralised.

కాల సర్పము తన పొలుసులను వదులు చేయుచున్నది. పూర్వ కర్మపు వాసనలుగ నున్న పొలుసు వలువబడు చున్నది. కర్మము పరిష్కరింపబడినది.

## MEDITATION - 33

(April 22, Aug. 21, Oct. 25, Feb.23)

Karma is neither postponed nor purged but neutralised.

కర్మమును హరించుటయే కాని, దానిని వాయిదా వేయుట కాని, త్వరితముగ అనుభవింపచేయుట కాని కాదు.

## MEDITATION - 34

(April 23, Aug. 20, Oct. 26, Feb. 22)

Wash Karma in space. On the deep blue slate paint ever-elevating colours, ever at the feet of the Master in the Vaishakha valley.

నిశీధి నీలమున కర్మమును కడుగుము. నీలమగు మనోఫలకముపై ఉత్తమము, ఊర్ధ్వము అగు రంగులను

చిత్రీకరించుము. పై సమస్తమును వైశాఖలోయ యందలి పరమగురువు పాద పద్మముల సాన్నిధ్యమున నిర్వర్తించు కొనుము.

## MEDITATION - 35

(April 24, Aug. 19, Oct. 27, Feb. 21)

The imprints of subterranean caves of your consciousness are illuminated by the heartful colours of Kundalini at the feet of the Master. Elevate yourself in the presence of the Master with the colours of the seven-fold wings of the serpent. Nothing is impossible to you. Sinning is impossible to you. Sin is your shadow, lead it into the beam of the light of the Guru. Namaskarams. Verily, verily we are in you.

పరమ గురువు పాదపద్మముల సాన్నిధ్యమున నీ అంతరంగమున గల గుహలలోని మహా చైతన్యనము నెరిగింప బడినదై హృద్యమగు కుండలిని చైతన్యము దివ్యకాంతులను వెదజల్లుచున్నది. పరమగురువు సాన్నిధ్య మున సప్త వర్ణపు రెక్కలతో కలిగిన కుండలినీ సర్పము ద్వారా నిన్ను నీవు ఉద్ధరించుకొనుము. నీకసాధ్య మనునది లేదు. నీవిక పాపము లను చేయలేవు. అది నీడయై నిలచును. దానిని పరమ గురువు వెలుగు లోనికి గొనిరమ్ము. నమస్కారములు. నీయందు నిజముగ మేమున్నాము.

## MEDITATION - 36

(April 25, Aug. 18, Oct. 28, Feb. 20)

A serpent sits in lotus. Lotus dances on ripples of the waters of life. Nara is water, Nari is serpent, Narayana is the Master.

సర్పము కమల మందున్నది. కమలము జీవజలముల తరంగములపై నాట్యమాడు చున్నది. జీవజలములే నారములు. సర్పము నారి. నారాయణుడు సర్పమునకు స్వామి.

## MEDITATION - 37

(April 26, Aug. 17, Oct. 29, Feb. 19)

Lake-beetle adjustments. Lake and beetle are in the Lotus. Lotus is in the lake, beetle is in the Lotus. Beetle sings, man melts, God crystalises.

సరస్సు, భ్రమరముల సర్దుబాట్లు. సరస్సు, భ్రమరము కమల మందున్నవి. కమలము సరస్సునందున్నది. భ్రమరము కమల మందే యున్నది. భ్రమరము గానము చేయును. మానవుడు కరిగి, దైవము స్థిరపడును.

## MEDITATION - 38

(April 27, Aug. 16, Oct. 30, Feb. 18)

All-round development, all round development. Ardent development. Art development. Advent of Master.

సర్వతోముఖ వికాసము. పరిపూర్ణ వికాసము. ఆర్ద్రతతోకూడిన వికాసము. కళావికాసము. మాస్టరు అవతరణము.

## MEDITATION - 39

(April 28, Aug. 15, Oct. 31, Feb. 17)

Ant-Man-Brahma. Ant around man. Man around ant. Man Ant Eagle. Mantle. Ant to Brahma, Abraham.

చీమ, మనిషి బ్రహ్మము. మానవుని చుట్టును చీమ. చీమ చుట్టును మానవుడు. మనిషి, చీమ, గద్ద. వెలుగు. చీమ నుండి బ్రహ్మము, అబ్రహ్మ.

## MEDITATION - 40

(April 29, Aug. 14, Nov. 1, Feb. 16)

Leo, jungle with the cub. Jacob. The sign is royal, Israel.

సింహరాశి అడవిలోని సింహపు పిల్ల. అతడే యాకోబ్. ఈ రాశి రాజు వంటిది. ఇది దేవయాని రాశి.

## MEDITATION - 41

(April 30, Aug. 13, Nov. 2, Feb. 15)

Man is Isiah, Messiah. Man is the Cross. Macrocosmos. Moses. Mount.

మానవుడు ఈశ్వరుడే. అతని యందలి ఈశ్వరాంశయే దేవదూత. మానవుడు చతుర్భుజుడు. బ్రహ్మాండమంతయు అతని యందున్నది. అతడు మోశాయ్. అతడే శిఖరము.

## MEDITATION - 42

(May 1, Aug. 12, Nov. 3, Feb. 14)

All names together utter the name of God. A prophecy thinks from darkness to light. Prophecy is fulfilled. Abraham, Moses, Isiah, Jacob put together form Jesus.

సర్వ నామముల సమగ్ర రూపమే దైవము. చీకటి నుండి వెలుగునకు కొనివచ్చునదే దివ్యవాక్కు. అబ్రహాము, మోజెస్, ఈశయ్య, జాకోబ్, జీససుగా కూడి గోచరింతురు.

## MEDITATION - 43

(May 2, Aug. 11, Nov. 4, Feb. 13)

Trace bridge from the eye of the bull to the tongue of the serpent. It is the rod of the messenger of God. From Taurus to Aquarius the head (symbol) the rod points the path. From Scorpio to Leo the tail ascends. The Z form of Kundalini through eons. Z is the half swastika. Z to A, Zero to Aries.

వృషభాక్షము నుండి సర్పజిహ్వాకు గల వంతెనను వెదకుము. అది భగవంతుని సందేశము నందించు దండము. వృషభము నుండి కుంభమునకు ఈ దండము తల భాగము దారిచూపును. వృశ్చికము నుండి సింహమునకు ఈ దండముయొక్క తోక ఎగబ్రాకును. ఈ మార్గము "ఎ" అక్షరమువలె అనాదిగ గోచరించుచున్నది. ఎ అర్థ స్వస్తికము. ఎ నుండి జు (అ)కు శూన్యము నుండి మేషమునకు.

## MEDITATION - 44

(May 3, Aug. 10, Nov. 5, Feb. 12)

A to Z read scripture written. It is written in the cave temples of your body. Z to A you read in the picture writing of the future. The wheel is reversed.

'ఎ' నుండి 'జడ్' వరకు 26 అక్షరము లతో రచింపబడిన సృష్టియే మూలగ్రంథము. ఈ రచన అంతయు నీ శరీరమందలి రహస్య గుహలలో నిక్షిప్తమై యున్నది. 'జడ్' నుండి 'ఎ' వరకు నీ దేహమందలి రచనను వెనుకకు చదువుము. అది నీ భవిష్యత్తు. అపుడు చక్రము తిరోధానము చెందును.

## MEDITATION - 45

(May 4, Aug. 9, Nov. 6, Feb. 11)

In Aries the serpent is Kumara. In Scorpio the serpent is Saturn. In Cancer the serpent is Python. Python is typhoon.

మేష మండలి కుండలినీ చైతన్యము కుమారుడు. వృశ్చిక మండలి కుండలినీ చైతన్యము శనిదేవత. కర్కాటక మండలి కుండలినీ చైతన్యము కొండచిలువ. అది తుఫాను వంటిది.

## MEDITATION - 46

(May 5, Aug. 8, Nov. 7, Feb. 10)

Eagle and serpent. Matter and serpent. Master and servant. Master and savant. Physical serpent. Astral servant. Divine savant. Celestial saint.

గరుత్మంతుడు- సర్పము. పదార్థము - సర్పము, ఈశ్వరుడు-సేవకుడు. ఈశ్వరుడు-విజ్ఞాని, భౌతిక సర్పము - కామమయ సేవకుడు. దైవ విజ్ఞాని - పరమహంస.

## MEDITATION - 47

(May 6, Aug. 7, Nov. 8, Feb. 9)

Not to learn but to realise. Not to acquire but to expand. Not to possess but to permeate. Not to secure but to sacrifice.

చదువుట కాదు, ఆకళింపు చేసుకొనుట. పోగేసు కొనుట కాదు, వ్యాప్తి చెందుట. పొంది వుండుట కాదు, వితరణ చేయుట. రక్షించు కొనుట కాదు, త్యాగము చేయుట.

## MEDITATION - 48

(May 7, Aug. 6, Nov. 9, Feb. 8)

Matter, Mind Master. Matter is the South pole. Master is the North pole. Mind is the equator.

మట్టి, మనస్సు, మాస్టరు. మట్టి దక్షిణ ధృవము. మాస్టరు ఉత్తర ధృవము. మనస్సు భూమధ్యరేఖ.

## MEDITATION - 49

(May 8, Aug. 5, Nov. 10, Feb. 7)

Matter-Mind-Master is the rod of rotation. The Earth rotates. The rod spins time. Rotation is time.

పదార్థము, మనస్సు, ఈశ్వరుడు ఆవృత్తముగ తిరుగు ఒక దండము. భూమి తిరుగును. ఆవృత్తముగ తిరుగు దండము కాలమును పేనును. కదురు (Spining Spindle) వలె పేనును. భ్రమణమే కాలము.

## MEDITATION - 50

(May 9, Aug. 4, Nov. 11, Feb. 6)

Rotation is time. Revolution is period. Time is in rotation. Matter is in periodicity. Time hatches matter.

భ్రమించునది కాలము. తన చుట్టు తాను తిరుగునది వ్యవధి. కాలము భ్రమణము నందుండును. పదార్థము ఒక వ్యవధి, గడువు కలిగి యుండును. కాలము పదార్థమును పొదుగును.

## MEDITATION - 51

(May 10, Aug. 3, Nov. 12, Feb. 5)

Matter turns atom, atom turns matter. Matter time adjustment. Matter turns man. Man becomes Master. Matter becomes mind. Mind becomes Master.

పదార్థము అణువగును. అణువు పదార్థ మగును. పదార్థము, కాలము సర్దుబాటు. పదార్థము మానవుడగును. మానవుడు మహాత్ముడు (మాస్టర్) అగును. పదార్థము మనస్సగును. మనస్సు మహాత్ముడు (మాస్టర్) అగును.

## MEDITATION - 52

(May 11, Aug. 2, Nov. 13, Feb. 4)

Solar pole, polar soul. The higher pole is the soul. Soul is the centre. Pole is the pivot.

సూర్యాత్మక ధృవము. ధృవాత్మక జీవుడు. జీవుడు ఉత్తర ధృవము. జీవుడు కేంద్రము. ధృవము ఇరుసు.

## MEDITATION - 53

(May 12, Aug. 1, Nov. 14, Feb. 3)

Soul is lunar. Pole is Solar. Soul reflects pole, it is full moon. Soul merges in pole and it is new moon. Pole is light, soul is life. The serpent unwinds the coils. Key and hook. Man is key, mind is hook. Pole is light, life is hook. Rotation of the clock opens the lock.

జీవుడు చంద్రాత్మకుడు. ధృవము సూర్యాత్మకము. జీవుడు ధృవమును ప్రతిబిం బింపచేయును. అది పౌర్ణిమ. జీవుడు ధృవము నందు లయము చెందును. అపుడది అమావాస్య. ధృవము వెలుగు. జీవుడు ప్రాణము. సర్పము చుట్టలను సడలించుచుండును. తాళపు చెవి, కొక్కెము. మానవుడు తాళపు చెవి, మనస్సు కొక్కెము. ధృవము వెలుగు, ప్రాణము కొక్కెము. కాలభ్రమణము కాలమును తెరచును.

## MEDITATION - 54

(May 13, July 31, Nov. 15, Feb. 2)

Lock and key adjustments. Space expands. Horizontals meet verticals. Mind crosses matter. Time unfolds time. Life creates life. Father creates son.

తాళము, చెవి సర్దుబాట్లు. ఆకాశ వ్యాపనము. అడ్డు రేఖలు నిలువు రేఖలను కలియుట. మనస్సు పదార్థమును దాటుట. కాలము నుండి కాలము విచ్చుకొనుట. ప్రాణము నుండి ప్రాణము విచ్చుకొనుట. తండ్రి కుమారుని సృష్టించుట.

## MEDITATION - 55

(May 14, July. 30, Nov. 16, Feb. 1)

Space is globe. Time is spiral. From globe spiral springs. With spiral the globe fills. Space and time are the knower and the known.

చోటు గోళముగ నున్నది. కాలము లతవలె ఊర్ధ్వము నుండి అధస్సునకు చుట్టలు చుట్టలుగ అల్లుకొని యున్నది. చోటు నుండి కాలము ఉద్భ వించుచున్నది. కాలపు టల్లికతో చోటు నిండినది. తెలుసుకొనునది చోటు. తెలియబడునది కాలము.

## MEDITATION - 56

(May 15, July 29, Nov. 17, Jan. 31)

Space is globe, universe is lotus. Globe unfolds into lotus. Space unfolds into universe. Globe is potential lotus.

ఆకాశము (లేక చోటు) గోళాకారము. సృష్టి పద్మాకారము. గోళమే పద్మముగ వికసించును. చోటే సృష్టిగ వికసించును. గోళము పద్మగర్భితము.

## MEDITATION - 57

(MAY 16, JULY 28, NOV. 18, JAN. 30)

Man in globe. Lotus is in man. The heart of space is man. The heart of man is space. The heart of space is the centre. The heart of man reflects the circumference.

మనిషి గోళాకారమగు చోటుయందు వున్నాడు. పద్మము మనిషి యందున్నది. చోటు గోళము యొక్క హృదయమే మానవుడు. మానవుని యొక్క హృదయమే చోటు. చోటు గోళము యొక్క హృదయము. సృష్టికి కేంద్రము. మానవుని హృదయము పరిధిని ప్రతిబింబించు చున్నది.

## MEDITATION - 58

(MAY 17, JULY 27, NOV. 19, JAN. 29)

Serpent unwinds into spiral. Globe of space unfolds into lotus. Serpent of time unwinds into spiral. Serpent is in lotus. Lotus is in globe. Globe is in mind.

కాలసర్పము చుట్టలు విప్పుచున్నది. సృష్టి గోళము పద్మము వలె విచ్చుకొనుచున్నది. విచ్చుకొను కాలమున లతవలె వర్తు లాకారముగ ప్రాకుచు పద్మకోశములను నేర్పరచుచున్నది. అట్లేర్ప రచుచు పద్మము మొత్తము నందిమిడి యున్నది. పద్మము గోళ మందున్నది. గోళము మనస్సు నందున్నది.

## MEDITATION - 59

(May 18, July 26, Nov. 20, Jan. 28)

Man is bound in Chakra. Chakra breathes out lotus. Lotus delivers serpent. Serpent is Kundalini. Lotus is Padma. Chakra is the wheel. The wheel rotates.

మానవుడు చక్రమున బంధింపబడి యున్నాడు. చక్రము, నిశ్వాస నుండి పద్మము నేర్పరచు చున్నది. పద్మము కుండలినిని ప్రచోదనము చేయుచున్నది. సర్పము కుండలిని. పద్మము వికాసము. చక్రము కాల వలయము. వలయము ఆవర్తనములు చేయును.

## MEDITATION - 60

(May 19, July 25, Nov. 21, Jan. 27)

Ten times ten. The wheel rotates. Three wheels from one wheel. A total of four wheels. Three above and four below. Seven wheels rotate in three directions. 7 and 3 is ten.

పదిపర్యాయములు పది. చక్రము భ్రమించుచున్నది. ఒక చక్రము నుండి మూడు చక్రములు. మొత్తము నాలుగు. మూడు పైన, నాలుగు క్రింద. ఏడు చక్రములు మూడు విధములుగ భ్రమణము. 7 మరియు 3 కలసి పది.

## MEDITATION - 61

(May 20, July 24, Nov 22, Jan. 26)

Seven wheels in three Lokas. Twenty-one wheels. The twenty second is I AM. I AM is more than nought, less than one. Twenty-one plus I AM divided by seven is the value of Pi.

మూడు లోకములలో ఏడు చక్రములు. ఇరువది ఒక్క చక్రములు 22వది 'నేను'. నేను సున్నకన్న ఎక్కువ. 1 కన్న తక్కువ. 21 మరియు నేను, 7చే భాగింపబడినచో వ్యాసమగును. (వ్యాసుడగును.)

## MEDITATION - 62

(May 21, July 23, Nov 23, Jan. 25)

Man is centre, space is circum-ference. The ring of the horizon rotates. Life span is diameter. From the centre to the circumference through the diameter is Pi.

మానవుడు కేంద్రము. ఆకాశము పరిధి. చుట్టునుగల వలయము (Horizon) తిరుగు చున్నది. ఆయుష్షు వ్యాసము. కేంద్రము నుండి పరిధికిగల సంబంధము, దేవునికి జీవునికిగల పవిత్ర బంధము.

## MEDITATION - 63

(May 22, July 22, Nov. 24, Jan. 24)

Pi is wisdom. Wisdom is objectivity. The power of Pi is the power of thought. Thought leads man to himself.

కేంద్రమునకు పరిధికిగల సంబంధమే జ్ఞానము. జ్ఞానికి అతడెరిగిన జ్ఞానము అతనికన్న ఇతరమగును. అట్టి జ్ఞానమే మేధాశక్తి లేక జ్ఞానశక్తి. జ్ఞాన మాధారముగ జీవుడు తనను తాను చేరగలడు.

## MEDITATION - 64

(May 23, July 21, Nov. 25, Jan. 23)

Man is bound in six charkas and the seventh. Man is liberated in six lotuses and the seventh. Man liberated into Kundalini. Kundalini is serpent. Serpent is spiral. Spiral is time. Time is mind.

మానవుడు షట్చక్రముల యందు, సప్తమము నందు బంధింపబడి యున్నాడు. షట్పద్మముల యందు, సప్తమమునందు ముక్తుడగు చున్నాడు. అతడు కుండలినియందు ప్రవేశించు టయే ముక్తి. కుండలిని సర్పము. సర్పము నాగమై, ఊర్ధ్వ గమనము వలయాకారముగ చేయును. వలయము కాలము. కాలము మనస్సు.

## MEDITATION - 65

(May 24, July 20, Nov. 26, Jan. 22)

Wheel of time rotates. Serpent of time unwinds. Wheel is cut in the East. Wheel cut is serpent. Wheel cut has head and tail. Serpent has head and tail. Time lived as head and tail. Time before life is wheel. The wheel rotates. The serpent creeps on.

కాలచక్రము భ్రమణము చేయుచున్నది. కాలసర్పము చుట్టలు విప్పుచున్నది. చక్రము తూర్పున కత్తిరింపబడినది. కత్తిరింపబడిన చక్రము సర్పము. కాలచక్రము కత్తిరింప బడుట వలన తల, తోక లేర్పడినవి. సర్పమునకు తల, తోక కలిగినది. కాలము ఆది, అంతములుగ సాగుచున్నది (జీవించుచున్నది). జీవనమునకు ముందు కాలము చక్రమే. ఈ చక్రమునకు భ్రమణమే లక్షణము. ఈ సర్పమునకు ఎగబ్రాకుట, దిగబ్రాకుటయే లక్షణము.

## MEDITATION - 66

(May 25, July 19, Nov. 27, Jan. 21)

Wheel is Zero. Wheel cut is one. One and Zero is number ten. Brahma in the egg is one in Zero. When the wheel is cut, He becomes Virat, number ten.

చక్రము సున్న (0). ఛేదింపబడిన చక్రము 1. ఒకటి, సున్న కలిసి పది. సున్న యందు వున్న 1 హిరణ్యగర్భము నందున్న బ్రహ్మ, హిరణ్యగర్భుడు. అండము ఛేదింపబడి నప్పుడు అతడు విరాట్ అగుచున్నాడు. విరాట్ పురుషుని సంఖ్య పది.

## MEDITATION - 67

(May 26, July 18, Nov. 28, Jan. 20)

Virat shines through ten digits. Virat has ten fingers. Man has ten fingers. Man is frame of Virat.

విరాట్పురుషుడు పది అంకెలతో విరాజిల్లు చున్నాడు. అతనికి పదివేళ్ళు కలవు. మానవునికి కూడ పదివేళ్ళు కలవు. విరాట్పురుషుని రూపమే మానవు నిది కూడ.

## MEDITATION - 68

(May 27, July 17, Nov. 29, Jan. 19)

Serpent ascends as eagle. Eagle descends as serpent. Nari ascends as Nara. Nara descends as Nari. Nara and Nari ascend and descend. It is Narayana.

సర్పము ఆరోహణమున సుపర్ణు డగును. సుపర్ణు డవ రోహణమున సర్పమగును. 'నారి' ఆరోహణమున నరుడు అగును. నరుడు అవరోహణమున 'నారి' అగును. నర, నారీలు ఆరోహణ, అవరోహణములు. ఆరోహణ, అవరోహణమే నారాయణము.

## MEDITATION - 69

(May 28, July 16, Nov. 30, Jan. 18)

Man ascends from woman. Woman descends from man. The ascent and descent of man is Ardha Nari.

పురుషుని ఆరోహణము స్త్రీ నుండి. స్త్రీ అవరోహణము పురుషునినుండి. మానవుని అవరోహణ, ఆరోహణలే అర్ధనారీత్వము.

## MEDITATION - 70

(May 29, July 15, Dec. 1, Jan. 17)

The ascent of man is through the eagle. The descent of man is through the serpent. The serpent is the coiled coil of time. The tongues of the serpent are the wings of the eagle.

ఆరోహణమున మానవునకు సుపర్ణు డాధారము. అవరోహణమునకు సర్పమాధారము. సర్పము చుట్టలు చుట్టలుగ చుట్టబడిన కాలము. సర్పము నాలుకలే సుపర్ణుడి రెక్కలు.

## MEDITATION - 71

(May 30, July 14, Dec. 2, Jan. 16)

Seven charkas link up seven stars. Seven stars bear the Polar bear. The bear is in the cave. The dog is at the entrance. The dog-star guards the infernal gate. The three-headed hound. The hound's tail is the serpent. The heads bark. The tail stings.

సప్త చక్రములు, సప్త నక్షత్రములతో జతపడి యున్నవి. సప్త నక్షత్రములు ధృవ మందున్న ఎలుగుబంటి. ఎలుగుబంటి గుహ యందున్నది. గుహ చేరు మార్గమును శరమ (కుక్క) కావలి

యున్నది. మార్గమున కీవల పాతాళ మున్నది. శరమ పాతాళ ద్వారమునకు, గుహ మార్గమునకు మధ్య కావలి కాయుచున్నది. శరమకు మూడు తలలు. దాని తోక సర్పము. తలలు అరచును, తోక కరచును (కాటు వేయును).

## MEDITATION - 72

(May 31, July 13, Dec. 3, Jan. 15)

The hound is Cerberus. Cerberus is Sarama. Sarama is Sirius.

ఈ కుక్క పేరు 'సెర్బిరస్'. దీనినే శరమ అని కూడా అందురు. శరమను సిరియస్ అందురు.

## MEDITATION - 73

(June 1, July 12, Dec. 4, Jan. 14)

The dog is bound to the pole. The bear goes round the pole. The pole is the pole star. The dog is Sirius star. The bear is of seven stars.

జాగిలము (కుక్క) ధృవముకు కట్టబడి యున్నది. ధృవము ఉత్తరభాగమున ఎలుగు బంటి తిరుగుచున్నది. ధృవము ఉత్తర భాగము నందు ధృవతార యున్నది. జాగిలము ధృవము దక్షిణ భాగమున గల శారమేయ మండలమున నున్నది. ఎలుగుబంటి సప్తర్షి మండలము.

## MEDITATION - 74

(June 2, July 11, Dec. 5, Jan. 13)

Three times seven miles from the goal. The goal is the pole. Pole on the head. Bear on the brow. Dog behind the back. The hunter walks.

గమ్యమునకు త్రిసప్త (7×3) మైళ్ళ దూరము గలదు. ధృవాగ్రమే గమ్యము. అది శిరస్సుపై నున్నది. ఎలుగుబంటి భ్రూమధ్యము నుండి ఫాలభాగమంతయు వ్యాపించి యున్నది. శరమ (కుక్క) వెన్నముక క్రింద యున్నది. వేటగాడు సాగిపోవు చున్నాడు.

## MEDITATION - 75

(June 3, July 10, Dec. 6, Jan. 12)

Yonder is the lion behind bars. Ponder over the lion, it roars. The hunter tames the lion.

సుదూరమున సింహ మొకటి బందీయై యున్నది. దానిని ధ్యానింపుము. అది గర్జించును. గర్జించు సింహమును మచ్చిక చేసుకొనుము.

## MEDITATION - 76

(June 4, July 9, Dec. 7, Jan. 11)

The maiden on the back of the lion. Six maidens shower spiritual rains. The hunter levels the ground. The lion walks all around.

సింహాసీనయై కన్య యున్నది. ఆరుగురు కన్యలు దివ్య వర్షమును కురిపించిరి. వేటకాడు భూమిని చదును చేసెను. సింహము అంతట నడచినది.

## MEDITATION - 77

(June 5, July 8, Dec. 8, Jan. 10)

The eye of the bull twinkles in darkness. The lion grips light from darkness. The maiden gathers lotuses. The maiden makes a garland. The jewel of the serpent graced the garland. Hunter garlanded.

వృషభము కన్ను చీకటిలో మినుకు మినుకు మనుచు మెరయు చుండును. సింహము చీకటి యందు ఆ మెఱపును పట్టుచున్నది. కన్య కమలములను ప్రోగుచేయు చున్నది. కన్య కమలములను మాలగ కూర్చుచున్నది. మాలాగ్రమున నాగమణి భాసించుచున్నది. వేటకాడు మాలాలంకృతుడైనాడు.

## MEDITATION - 78

(June 6, July 7, Dec. 9, Jan. 9)

The solar pole advances. Day increases. Night decreases. The Gods dance. The Virgin sings. Horses gallop. Waters spring.

ధృవము ముందుకు సాగుచున్నది. పగలు పెరుగు చున్నది. రాత్రి తగ్గుచున్నది. దేవతలు నృత్యము చేయుచున్నారు. కన్య గానము చేయుచున్నది. గుఱ్ఱములు లంఘించు చున్నవి. జలములు పొంగుచున్నవి.

## MEDITATION - 79

(June 7, July 6, Dec. 10, Jan. 8)

Hunter on horse-back vanquishes the serpent. The serpent coiled around the rod. The rod is winged. Hunter holds rod. Law is held in hand.

వేటకాడు అశ్వారూఢుడై సర్పమును జయించెను. సర్పము దండమును చుట్టుకొనును. దండాగ్రమున కటునిటు రెక్క లేర్పడి నవి. అట్టి దండమును వేటకాడు ధరించినాడు. ఆ దండము ధర్మ దండము. వేటకాడు ధర్మదండమును ధరించినాడు.

## MEDITATION - 80

(June 8, July 5, Dec. 11, Jan. 7)

Hunter sits on throne. Hunter wears the crown. Crown of Magus gained. Kingdom regained.

వేటకాడు రాజ సింహాసనము నధిష్ఠించెను. రాజమకుట మును ధరించెను. మహత్తరమగు మకుటము లభించెను. కోల్పోయిన రాజ్యము తిరిగి పొందెను.

## MEDITATION - 81

(June 9, July 4, Dec. 12, Jan. 6)

Number one, the rod. Zero to one, the serpent unwinds. Number nine, the throne; number ten, the crown. Kingdom gained. Hunter becomes saint. Hunter bears pot. Light of life carried. Mind and wisdom married. Saint blesses the couple with holy water from pot.

ఒకటి దండము (ధర్మదండము), సున్న నుండి ఒకటికి కాలసర్పము విచ్చుకొనును. తొమ్మిది రాజ సింహాసనము. 10 రాజ మకుటము, రాజ్యము లభ్యమైనది. వేటకాడు రాజర్షియైనాడు. కుంభ మును ధరించినాడు. అందు జీవ చైతన్యమును కలిగి యున్నాడు. మనస్సు బుద్ధిని పెండ్లి యాడినది. రాజర్షి మనోబుద్ధులను కుంభ మందలి జీవ చైతన్య జలముతో సంప్రోక్షించి ఆశీర్వదించినాడు.

## MEDITATION - 82

(June 10, July 3, Dec.13, Jan.5)

Couple married. Inherits Heaven and Earth. Sky married Earth. Time married Space.

దంపతి పెండ్లి చేసుకొనిరి. స్వర్గమును భూమిని పొందిరి. ఆకాశము భూమిని పెండ్లియాడెను. కాలము చోటును పెండ్లియాడెను.

## MEDITATION - 83

(June 11, July 2, Dec. 14, Jan. 4)

Light of life measures in degrees. Pages of wisdom counted in numbers. Span of time filled in pot. Volume of space moulded in cube. Degrees expand.

జీవ ప్రకాశము కొలత దశల వారిగ జరుగుచున్నది. దివ్య జ్ఞానము పుటల వారిగ సాగుచున్నది. ఆయుః ప్రమాణము కుంభ మున నింపబడినది. చోటు పరిమాణము ఘనము (Cube) ఆకారము చెందుచున్నది. కొలతలు వ్యాప్తి చెందుచున్నవి.

## MEDITATION - 84

(June 12, July 1, Dec. 15, Jan. 3)

Verticals rotate horizontals. Horizontals meet verticals. Degrees expand angles. Angles awake angels. The wheel rotates.

ఊర్ధ్వములు సమాంతరములను పరిభ్రమింప చేయుచున్నవి. సమాంతరములు ఊర్ధ్వములను కలయుచున్నవి. కోణములు క్రమ ముగ వ్యాప్తి చెందుచున్నవి. వ్యాప్తిచెందిన కోణములు దేవతలను మేల్కొల్పుచున్నవి. చక్రము పరిభ్రమించుచున్నది.

## MEDITATION - 85

(June 13, June. 30, Dec. 16, Jan. 2)

The wheel of seven colours rotates into the wisdom white. Gold melted. Green vegetated. Red is blood. Blue is sky. Kingdom colourful.

సప్త వర్ణముల చక్రము భ్రమణమున శ్వేత వర్ణమును ధరించుచున్నది. సువర్ణము కరగుచున్నది. హరిత వర్ణము పంటల నిచ్చు చున్నది. ఎఱుపు రక్తము. నీలము ఆకాశము. రాజ్యము సర్వవర్ణమయము.

## MEDITATION - 86

(June 14, June 29, Dec. 17, Jan. 1)

Tables turn. Time tables framed. Planetary adjustments. Levels set in squares. Set-squares erected. Right angles established. Wrong angles adjusted. Accounts squared up.

బల్లలు త్రిప్పబడినవి. కాలపట్టికలు రూపొందినవి. గ్రహముల సర్దుబాట్లు. బాహ్య జీవనము సమతల మైనది. అంతర్గత జీవితము నిర్మించబడినది. లంబకోణములు స్థిరపడినవి. దృక్కోణములు సర్దుబాటైనవి. భృక్తము రహితమైనది.

## MEDITATION - 87

(June 15, June. 28, Dec. 18, Dec. 31)

Gates open wide. Boat launched ocean. Star guides boat. Star reflects fish in ocean. Fisherman sails. Fishing of man.

ద్వారములు విశాలముగ తెరువబడినవి. నావ సముద్రమును చేరినది. నక్షత్రము నావను నడిపించుచున్నది. నక్షత్రము మీనము వలె సముద్రమున ప్రతిబింబించుచున్నది. నావ యందు బెస్తవాడు పయనించుచున్నాడు. జీవులనెడి చేపలను పట్టుటయే అతని పని.

## MEDITATION - 88

(June 16, June. 27, Dec. 19, Dec. 30)

Two fishes, five loaves gained. St. Mark speaks. "Feed the hosts of wisdom. No more hunger, suffering, death." The boat sails. The wind blows. The waves dance. The fish jump.

రెండు చేపలు, ఐదు జతల రొట్టె ముక్కలు. మార్కండేయుడు పలుకుచున్నాడు : "జ్ఞానులను పోషింపుడు. ఆకలిదప్పులు, మరణము లేవు." నావ సాగుచున్నది. గాలి వీచుచున్నది. కెరటములు నాట్య మాడుచున్నవి. చేపలు ఎగురుచున్నవి.

## MEDITATION - 89

(June 17, June. 26, Dec. 20, Dec. 29)

Markandeya. Mark-and-A!! Mark in the ark leads pairs through water to life. Noah's ark sails.

మార్కండేయుడు. మార్కు- మరియు ఆ. చంద్రవంక యందలి బిందువు ద్వంద్వములను నీటినుండి జీవనములోనికి గొనిపోవు చున్నది. నోవా పడవ సాగుచున్నది.

## MEDITATION - 90

(June 18, June. 25, Dec. 21, Dec. 28)

Mark the ark in moon. Sixteen chapters of Mark in sixteen days of sailing in ark. Sixteen moons shine. Maiden wears crown of moons.

చంద్రుని యందలి రేఖను గుర్తించుము. చంద్రరేఖలో పదునారు దినములు పయనించు బిందువును పదునారు అధ్యా యములుగ తెలియుము. పదునారు చంద్రులు ప్రకాశించు చున్నారు. కన్య పదునారు చంద్రుల మకుటమును ధరించినది.

## MEDITATION - 91

(June 19, June 24, Dec. 22, Dec. 27)

Ocean roars thunder. Waves meet clouds. Ark leaps on bounds. Whole space sounds. Foam of ocean abounds. OM resounds.

సముద్రము ఘోషించు చున్నది. అలలు ఉవ్వెత్తున మేఘము లను తాకుచున్నవి. అలలపైన (జీవుని) నావ తేలుచున్నది. ఘూనఘోంత రాళములు నాదము చేయుచున్నవి. ఉవ్వెత్తున లేచు సముద్ర కెరటముల నుండి తెల్లని దూది వంటి నురుగు ఎగజిమ్ము చున్నది. ఓంకారము ప్రతిధ్వనించు చున్నది.

## MEDITATION - 92

(June 20, June 23, Dec. 23, Dec. 26)

Three days before initiation. Ninety two days in ninety degrees. Ninety third day of judgement. The rod of justice rules. Ark reaches shore. Bird chirps future. Past doubled future. Past meet future in man.

మూడు దినములు ఉపదేశమందుంచు పర్వదినములు. తొంబది రెండు దినములలో తొంబది దశలు. (డిగ్రీలు). తొంబది మూడవ రోజు నిర్ణయము. ధర్మదండము నిర్ణేత. నావ ఒడ్డు చేరినది. పక్షి భవిష్యత్తును కూసినది. భూతము రెట్టింపు భవిష్యత్తు యైనది. భూత, భవిష్యత్తులు మనిషియందు కలసినవి.

## MEDITATION - 93

(June 21, June. 22, Dec. 24, Dec. 25)

Man reaches shore. Sailor transformed hunter. The Lion, the Bull, the Serpent, the Maid, the Lotus, safely landed. Fish goes to sea. Eagle flies into the sky. Man comes to land to rule. Rod of justice established. Thunder wonder trumpet. The wheel reverses.

మనిషి తీరమును చేరెను. నావికుడు వేటకాడు అయినాడు. సింహము, ఎద్దు, పాము, కన్య, కమలము క్షేమముగ తీరము చేరినవి. మీనము సముద్రము చేరినది. గద్ద ఆకాశమున కెగిరినది. మానవుడు పాలించుటకై భూమిని చేరినాడు. ధర్మదండము స్థాపింపబడినది. భేరీ నినాదము పిడుగువలె శబ్దము చేసినది. చక్రము వివర్తనము చెందినది.

## ఈ ధ్యానముల యందలి సంకేతములు

1. కిరీటము.
2. శూలము
3. సర్పము
4. కన్యాతార
5. నంది
6. ఎద్దు
7. సింహము
8. చంద్రుడు
9. సూర్యుడు
10. మకర తోరణము
11. దేవాలయము
12. నలుపు, నీలము, తెలుపు.
13. 1, 3, 4, 7, 12, 24, 48, 49, 98, 100, 1000, 0.
14. సూర్యోదయము, సూర్యాస్తమయము.
15. రక్షకుడు, సంరక్షకుడు, తోటమాలి.
16. దండము, రాజదండము, బ్రహ్మదండము, ధర్మదండము, మంత్రదండము.
17. నాగుపాము, నాగుపాము చుట్టలు, నాగుపాము పొలుసు, నాగుపాము కాంతి.

18. పాము నాలుకలు, గరుడు పక్షి రెక్కలు, రెక్కలు గల పాము.
19. తేలుకొండి, పాము నాలుక.
20. రంగు రంగుల పాము.
21. సప్త తంతువులు
22. వేను డను గంధర్వుడు
23. కుండలిని సర్పము
24. ఏడు రెక్కల సర్పము.
25. పద్మము నందలి సర్పము.
26. సరస్సు
27. కమలము
28. భ్రమరము
29. సింహము
30. అడవి నందలి సింహము పిల్ల
31. చతుర్భుజము
32. వృషభాక్షము
33. వృషభము
34. కుంభము
35. వృశ్చికము
36. స్వస్తికము
37. షణ్ముఖుడు
38. పాము, కొండచిలువ, తుఫాను.

39. స్వామి, సాధువు, సన్యాసి, సేవకుడు, సర్పము.
40. ఇరుసు
41. ఉత్తరధృవము
42. సరళరేఖలు, లంబరేఖలు.
43. చోటు, కాలము.
44. గోళము, చుట్టలు.
45. గోళము, కమలము.
46. షట్చక్రములు, కుండలిని.
47. షట్చక్రములు, పద్మములు.
48. వ్యాసార్థము Pi (π)
49. మండలము, విరాట్.
50. నరుడు, నారి, అర్ధనారి.
51. సప్త చక్రములు, సప్తర్షులు, ఎలుగుబంటి.
52. ఎలుగుబంటి గుహ
53. శరమ (కుక్క)
54. శరమ తోక
55. మూడుతలల కుక్క
56. గుంజకు కట్టిన కుక్క
57. 21 మైళ్ళ రహదారి.
58. వేటగాడు, కుక్క, సింహము, గుజ్జము, ఎలుగుబంటి.
59. పద్మముల దండ

60. మణి గల సర్పము
61. దక్షిణ ధృవము, ఉత్తర ధృవము, ఇరుసు.
62. సింహాసనము, కిరీటము, రాజదండము.
63. సింహము, ప్రాణము.
64. మనసు, బుద్ధి, వివాహము.
65. భూమి, ఆకాశము, చోటు.
66. ఘనము, కుంభము.
67. కోణములు, దేవతలు.
68. సప్త వర్ణములు
69. లంబకోణములు, ఇతర కోణములు.
70. నావ, ధృవతార.
71. నీటి యందలి తార, చేప.
72. రెండుచేపలు, ఐదు రొట్టెలు.
73. మార్కండేయుడు
74. నావ, చంద్రవంక.
75. సముద్రము, అలలు, శబ్దము.
76. చక్రము, భ్రమణము.
77. కాలము, వ్యవధి, వృత్తములు, ఆవృత్తములు.

## OTHER BOOKS THROUGH
# DR. SRI K. PARVATHI KUMAR

*The following books are available in: English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (HI) and Kannada (K) languages.*

**BOOKLETS:**

| | | |
|---|---|---|
| 1. | LORD MAITREYA -The World Teacher | E/G/S/F |
| 2. | THE WHITE LOTUS | E/G/S |
| 3. | WISDOM BUDS | E/G/S |
| 4. | SPIRITUALISM, BUSINESS & MANAGEMENT | E/G/S |
| 5. | THE PATH OF SYNTHESIS | E |
| 6. | THE ETHERIC BODY | E/G/S |
| 7. | MARIA MAGDALENA | E/G/S |
| 8. | TIME THE KEY | E/G/S |
| 9. | LISTENING TO THE INVISIBLE MASTER | E/G/S/F/H |
| 10. | GOOD FRIDAY | E/G/S/F/H |
| 11. | BHRIKTA RAHITA TARAKA RAJAYOGAMU | T/K |

BOOKS :

| | | |
|---|---|---|
| 12. | MITHILA –A New Age Syllabus | E/G/S |
| 13. | THE AQUARIAN MASTER | E/G/S |
| 14. | SOUND –The Key & its Application | E/G/S |
| 15. | ASHRAM LEAVES | E/G/S |
| 16. | SANKHYA –The Sacred Doctrine | E/G/S |
| 17. | VENUS –The Path to Immortality | E/G/S |
| 18. | THEOSOPHICAL MOVEMENT | E/G/S |
| 19. | SHIRDI SAY SAYINGS | E/G/S |
| 20. | SPIRITUALITY IN DAILY LIFE | S |
| 21. | THE MASTERS OF WISDOM | S |
| 22. | MEDITATION & GAYATRI | S |
| 23. | WISDOM TEACHINGS OF VIDURA | E/G/S |
| 24. | ON HEALING | E/G/S |
| 25. | SPIRITUAL FUSION OF EAST & WEST | E |
| 26. | SRI SASTRY GARU | E/G/S/F/T |
| 27. | THE AQUARIAN CROSS | E/G/S |
| 28. | HERCULES –The Man & the Symbol | E/G/S |
| 29. | MANTRAMS –Their Significance & Practice | E/G/S |
| 30. | SRI DATTATREYA | E/G/S/T/HI |
| 31. | SATURN –The Path to Systematised Growth | E/S |
| 32. | JUPITER –The Path of Expansion | E/S |
| 33. | MASTER E.K. –The New Age Teacher | E/G/S |
| 34. | AMANASAKUDU | T/K |
| 35. | VRUTRASURA RAHASYAM | T |
| 36. | THE DOCTRINE OF ETHICS | E |
| 37. | DHANAKAMUNI KATHA | T |
| 38. | ANTARDARSANA DHYANAMULU | T |
| 39. | THE SPLENDOR OF SEVEN HILLS | E/T/Hi |
| 40. | DOCTRINE OF ETERNAL PRESENCE | E |
| 41. | ASANGUDU | T |
| 42. | SARASWATHI - THE WORD | E |